


చదువు
రూ॥ 180/-
పేజీలు: 210
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★


బెంగాల్‌లో ఆర్‌ఎస్‌ఎస్ పన్నాగం విఫలం

క్షేత్రస్థాయిలో అందరికీ మేలు చేసే చట్టం భూ భారతి!

లోపలి పేజీల్లో


సంపుటి 08, సంచిక: 146 | శనివారం | 26-04-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




ఇస్రో మాజీ చైర్మన్ కస్తూరిరంగన్ కన్నుమూత 05



'లష్కరే' టాప్ కమాండర్ అల్తాఫ్ లల్లీ హతం? 05

పత్తి కొనుగోళ్ల అవకతవకలపై మంత్రి ఆగ్రహం 03





## పిఒకెను భారత్‌లో కలపండి

ప్రధాని మోదీకి సిఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

- రాజకీయాలు, పార్టీ సిద్ధాంతాలు పక్కనపెట్టి తీవ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడాలి
- నరేంద్రమోదీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన
- ఉగ్రదాడులు పునరావృతం కాకుండా కఠినంగా వ్యవహరించాలి

**కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ కొవ్వొత్తుల ప్రదర్శన, శాంతిర్యాలీ**

ప్రజాపక్షం/హైదరాబాద్

''ఆక్రమిత కశ్మీర్‌ను భారత్‌లో కలపండి. మేమంతా మీ వెంట ఉన్నాం' అని ప్రధాని నరేంద్రమోదీని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కోరారు. రాజకీయాలు, పార్టీ సిద్ధాంతాలు పక్కన బెట్టి తీవ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. జమ్మూ కశ్మీర్ పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి ఆత్మశాంతి కలగాలని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) ఇచ్చిన పిలుపు మేరకు టిపిసిసి పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శుక్రవారం భారీ కొవ్వొత్తుల ప్రదర్శన, శాంతి ర్యాలీ నిర్వహించారు. నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ ఇందిరాగాంధీ విగ్రహం వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్, తరువాయి 2లో

## ఎన్‌డిఎస్‌ఎ నివేదికతో బిఆర్ఎస్ సిగ్గుపడాలి



- లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం కుప్పకూలి పోయింది
- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ పనికిరాకుండా పోయాయి
- ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై జాతీయ ప్రాజెక్టుల భద్రతా సంస్థ (ఎన్‌డిఎస్‌ఎ) ఇచ్చిన నివేదికను చూసి అప్పటి బిఆర్ఎస్ పాలకులు, పార్టీ నేతలు సిగ్గుపడాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ తరువాయి 2లో



## హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంఐఎం గెలుపు

- 38 ఓట్ల మెజరీటీతో విజయం సాధించిన మీర్జా రియాజ్ ఉల్ హాసన్ ఎఫెండి
- బిజెపి అభ్యర్థి గౌతమ్‌రావుకు 25 ఓట్లు

ప్రజాపక్షం/హైదరాబాద్

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంఐఎం అభ్యర్థి మీర్జా రియాజ్ ఉల్ హాసన్ ఎఫెండి విజయం సాధించారు. ఎంఐఎం అభ్యర్థికి 63 ఓట్లురాగా, బిజెపి అభ్యర్థి గౌతమ్ రావుకు 25 ఓట్లు వచ్చాయి. 38 ఓట్ల మెజార్టీతో ఎంఐఎం అభ్యర్థి గెలుపొందారు. క్రాస్ ఓటింగ్‌పై ఆశలు పెట్టుకున్న బిజెపికి నిరాశే ఎదురైంది. తమకున్న 25 ఓట్లు మాత్రమే బిజెపికి పోలయ్యాయి. ఎంఐఎంకు తరువాయి 2లో

## శాంతి, అహింసా మార్గాల్లోనే గ్లోబల్ జస్టిస్

- ఘనంగా భారత్ సమ్మిట్ ప్రారంభం
- 100 దేశాల ప్రతినిధులు హాజరు
- సమ్మిట్‌లో రాష్ట్రానికి పెట్టుబడులు ఆహ్వానించా
- డిప్యూటీ సిఎం భట్టి వెల్లడి



ప్రజాపక్షం / హైదరాబాద్

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆర్థిక, రాజకీయ, సామాజిక అసమానతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో అహింస, సత్యం సామాజిక న్యాయం అనే మూడు ప్రాథమిక మూల సిద్ధాంతాలతో 'భారత్ సమ్మిట్–2025' ద్వారా కాంగ్రెస్ పార్టీ దిశా నిర్దేశం చేస్తున్నదని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ప్రపంచంలో కోల్డ్ వార్ జరుగుతున్న సమయంలో ప్రపంచం మొత్తం రెండు కూటములుగా విడిపోయిన సమయంలో కొన్ని దేశాలతో కలిసి ఆనాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అలీన విధానాన్ని తీసుకుని ప్రపంచానికి దిశా నిర్దేశం చూపారని గుర్తు తరువాయి 2లో




03

## ఐక్య కమ్యూనిస్టు ఉద్యమాల ద్వారానే సామ్రాజ్యవాద ఓటమి సాధ్యం

క్యూబా రాయబారి జువాన్ కార్లోస్ మార్సన్ అగ్విలెరా

## సిఎంలకు అమిత్ షా ఫోన్

- స్థానికంగా ఉండే పాక్ జాతీయుల సమాచారం ఇవ్వండి
- గడువు ముగిసేలోగా భారత్‌లో ఉండకుండా చూడాలని విజ్ఞప్తి



**న్యూఢిల్లీ :** ఏ ఒక్క పాకిస్థానీ కూడా భారత్‌లో ఉండడానికి వీలులేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. వారు దేశం విడిచి వెళ్లేందుకు విధించిన గడువు ముగిసే నాటికి ఏ ఒక్క పాకిస్థానీ కూడా భారత్ ఉండకుండా చూసుకోవాలని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు అమిత్ షా ఫోన్ చేసినట్లు వర్గాలు తెలిపాయి. జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఈనెల 22న పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. దీంతో ఈనెల 27 నుండి పాకిస్తానీ జాతీయులకు జారీ చేసిన అన్ని వీసాలను రద్దు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. పాకిస్తాన్‌లో నివసిస్తున్న భారతీయ పౌరులు వీలైనంత త్వరగా స్వదేశానికి తిరిగి వెళ్లాలని సూచించింది. ఈ క్రమంలోనే హోంమంత్రి అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు వ్యక్తిగతంగా ఫోన్ చేసి, గడువు ముగిసే నాటికి పాకిస్తానీ కూడా భారతదేశంలో ఉండకుండా చూసుకోవాలని కోరారు. స్థానికంగా ఉంటున్న పాకిస్థాన్ జాతీయులను గుర్తించి, వారి వివరాలను కేంద్రానికి పంపాలని అప్పుడే వారి వీసాల రద్దుకు అవకాశముంటుందని చెప్పినట్లు వర్గాలు తెలిపాయి. హిందూ పాకిస్తానీ జాతీయులకు ఇప్పటికే జారీ చేయబడిన దీర్ఘకాలిక వీసాలకు రద్దు వర్తించదు. అవి చెల్లుబాటులోనే ఉండనున్నాయి. 26/11 ముంబయి ఉగ్రవాద దాడి తర్వాత దేశంలోని పౌరులను లక్ష్యంగా చేసుకుని జరిగిన అత్యంత దారుణమైన ఉగ్రవాద దాడి పహల్గామ్‌లో జరిగిందని, సరిహద్దు సంబంధాల కారణంగా పాకిస్తాన్ జాతీయులకు వీసా తరువాయి 12లో

## హైదరాబాద్‌లో 208 మంది పాక్ పౌరులు

సెర్చ్ ఆపరేషన్‌లో గుర్తించిన పోలీసులు

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణలో నివాసముంటున్న పాకిస్తాన్ పౌరుల కోసం రాష్ట్ర పోలీసులు వేట మొదలు పెట్టారు. వీసాపై వచ్చిన వారి వివరాలను కూడా అన్ని జిల్లాలలో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఆరా తీస్తున్నారు. హైదరాబాద్‌లో మాత్రం 208 మంది పాకిస్తాన్ దేశానికి చెందిన వారు ఉన్నారని గుర్తించారు. వీరిలో 156 మందికి దీర్ఘకాలిక వీసా ఉంది. వీరందరికి వారం రోజుల్లో దేశం వదిలి పోవాలని నోటీసులు తరువాయి 2లో

## ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఐకమత్యమే ముఖ్యం

- సమాజాన్ని విభజించడమే ఉగ్రవాదుల పని : రాహుల్
- కశ్మీర్‌కు వెళ్లిన ప్రతిపక్షనేత
- పహల్గామ్ ఉగ్రదాడి బాధితులకు పరామర్శ
- ఉగ్రదాడిని యావత్‌దేశం ఖండించిందని వ్యాఖ్య



**న్యూఢిల్లీ :** దేశ ప్రజలను విభజించడమే పహల్గామ్ ఉగ్రవాద దాడి వెనుక ఉన్న ఆలోచన అని ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అన్నారు. భారతీయులంతా ఐక్యంగా ఉండడం అవసరమని, ద్వారానే ఉగ్రవాదాన్ని శాశ్వతంగా అంతమొందించగలమని పేర్కొన్నారు. పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి ఒక భయంకరమైన విషాద ఘటన అని, ఏమి జరుగుతుందో అర్థం చేసుకోవడానికి, సహాయం చేయడానికే తాను జమ్ముకశ్మీర్ వచ్చానన్నారు. ఉగ్రదాడిని యావత్ జమ్ముకశ్మీర్ ఖండించిందన్నారు. వీరికి దేశం మొత్తం పూర్తిగా మద్దతు నిలిచిందని రాహుల్‌గాంధీ చెప్పారు. శుక్రవారం శ్రీనగర్‌కు చేరుకున్న రాహుల్ ఉగ్రదాడి బాధితులను పరామర్శించేందుకు బాదామి బాగ్ కంటోన్మెంట్‌లోని ఆర్మీ 92 బేస్ ఆసుపత్రిని సందర్శించారు. అనంతరం తరువాయి 2లో

## సంయమనం పాటించండి

భారత్–పాకిస్థాన్‌లకు ఐక్యరాజ్యసమితి విజ్ఞప్తి

**న్యూయార్క్ :** సంయమనం పాటించాలని భారత్ – పాకిస్థాన్ దేశాలకు ఐక్యరాజ్యసమితి శుక్రవారం నాడు విజ్ఞప్తి చేసింది. దక్షిణ కశ్మీరు అనంతనాగ్‌జిల్లా పహల్గామ్ సమీపంలో పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న లష్కరే తోయిబా అనుబంధ ఉగ్రవాదులు దాడిచేసి 26 మంది పర్యాటకులను కాల్చి చంపిన తర్వాత రెండు దేశాల మధ్యా యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఇక ముందుకు వెళ్ళవద్దని, పరిస్థితి చేయిదాటిపోయే వరకూ తీసుకువెళ్ళవద్దని ఐక్యరాజ్యసమితి రెండు దేశాలకు విజ్ఞప్తి చేసింది. ఈ ఘటనతో రెండు దేశాలమధ్య సంబంధాలు అత్యంత దారుణస్థాయికి తరువాయి 12లో

## వక్ఫ్ సవరణ చట్టంపై.. 'బ్లాంకెట్ స్టే' సరికాదు

- 'సుప్రీం'కు దాఖలుచేసిన ప్రాథమిక కౌంటర్ అఫిడవిట్‌లో కేంద్రం
- సమగ్ర, లోతైన, విశ్లేషణాత్మక అధ్యయనం తర్వాతే వక్ఫ్ చట్టానికి సవరణలు చేశామని వెల్లడి

**న్యూఢిల్లీ :** వక్ఫ్ (సవరణ) చట్టం–2025ను శుక్రవారం కేంద్రం సుప్రీంకోర్టులో సమర్థించుకుంది. పార్లమెంట్ ఆమోదించిన రాజ్యాంగబద్ధత కలిగి ఉన్న చట్టంపై కోర్టు ద్వారా 'బ్లాంకెట్ స్టే'ను విధించడం సమంజసం కాదని వ్యతిరేకించింది. ఈ మేరకు 1332 పేజీలతో దాఖలు చేసిన ప్రాథమిక కౌంటర్ అఫిడవిట్‌లో వక్ఫ్ సవరణలను కేంద్ర ప్రభుత్వం సమర్థించుకుంది. మత స్వేచ్ఛకు తరువాయి 12లో

## కర్రెగుట్టల్లో... అలజడి



- నక్సల్‌కోసం డ్రోన్లు,హెలికాప్టర్లతో వేట
- 10 వేలమంది భద్రతా సిబ్బందితో గాలింపు చర్యలు
- ఐదోరోజూ కొనసాగిన ఆపరేషన్


**రాయ్‌పూర్ :** ఛత్తీస్‌గఢ్–తెలంగాణ సరిహద్దుల్లో వరుసగా ఐదురోజు శుక్రవారంనాడు కూడా నక్సలైట్లకోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగాయి. హెలికాప్టర్లు, డ్రోన్లను ఈ గాలింపు చర్యల్లో ప్రధానసాధనాలుగా ఉపయోగిస్తున్నారు. 10,000 మంది భద్రతా సిబ్బంది ఉధృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారని సీనియర్ అధికారి ఒకరు తెలియజేశారు. నిషేధిత సిపిఐ (మావోయిస్టు)కు చెందిన అగ్రనాయకులతోపాటు సుమారు 500 మంది నక్సలైట్లు కర్రెగుట్టల్లో ఉన్నట్లు పోలీసులు బలంగా విశ్వసిస్తున్నారు. ఈ గాలింపు చర్యలకు తెలంగాణ పోలీసులు తమ పూర్తిసహకారం అందిస్తున్నారు. పరిస్థితులను పర్యవేక్షిస్తున్న అధికారి ఒకరు ఈవిషయంపై మాట్లాడారు. బస్తర్ ప్రాంతంలో నక్సలైట్ల ఏరివేతకోసం చేపట్టిన ఇది అతిపెద్ద గాలింపు కార్యక్రమం అని ఆయన అన్నారు. జిల్లా రిజర్వు గార్డులు, బస్తర్ ఫైటర్లు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ప్రత్యేక కర్తవ్య నిర్వహణా బృందాలకు చెందిన పోలీసులు, సెంట్రల్ రిజర్వు పోలీసు దళం, సెంట్రల్ రిజర్వులో ఉన్న కమాండో బెటాలియన్స్ ఫర్ రిసొల్యూట్ యాక్షన్ (కోబ్రా) బృందాలన్నీ సంయుక్తంగా ఈ గాలింపు చర్యల్లో నిమగ్నమయ్యాయని చెప్పారు. గురువారంనాడు కర్రెగుట్టల్లో ముగ్గురు మహిళా నక్సలైట్లను గాలింపు బృందాలు కాల్చిచంపాయి. ఐతే వారి నుండి భారీగా పేలుడు పదార్థాలు,ఆయుధాలు, ఇతర సామాగ్రి స్వాధీనం చేసుకున్నారు. రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న కర్రెగుట్ట, దుర్గంగుట్టల ప్రాంతంలో సోమవారంనాడు భద్రతా దళాలు ఈ గాలింపు చర్యలను తరువాయి 12లో

## అణిచివేత, హింసాకాండ ఆపాలి

- శాంతి చర్చల ద్వారా సమస్యలు పరిష్కారం కావాలని అందరూ కోరుతున్నారు
- ప్రభుత్వ ఉద్దేశం వేరేలా కనిపిస్తోంది
- మావోయిస్టు పార్టీ లేఖ విడుదల

ప్రజాపక్షం/ఖమ్మం

శాంతి చర్చల ద్వారా సమస్య పరిష్కారం కావాలని అందరూ కోరుకుంటున్నారని శాంతి చర్చలకు మావోయిస్టు పార్టీ సిద్ధంగా ఉంటుందని మావోయిస్టులు లేఖ విడుదల చేశారు. నార్త్, వెస్ట్, సబ్ జోనల్ బాధ్యులు రూపేష్ పేరుతో శుక్రవారం మీడియాకు ఒక లేఖ విడుదల చేశారు.ఈ లేఖలో శాంతి చర్చలకు సంబంధించి పార్టీ కేంద్ర కమిటీ లేఖలు జారీ చేసిందని విశ్వాస రాహిత్యాన్ని తొలగించేందుకు మావోయిస్టు పార్టీ నుంచి నిరంతరం ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆ లేఖలో పేర్కొన్నారు ప్రభుత్వ ఉద్దేశం వేరేలా కనిపిస్తుందని శాంతి చర్చల ద్వారా తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

శతాబ్దకాల సంప్రదాయానికి విరుద్ధంగా

## నేడు పోప్ అంత్యక్రియలు



**వాటికన్ సిటీ :** రోమన్ క్యాథలిక్స్ మత గురువు, పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు శనివారం ఉదయం 10 గంటలకు (వాటికన్ కాలమానం) జరుగుతాయి. ఈ అంత్యక్రియలకు 50 దేశాల నాయకులు, బ్రిటన్ రాజు ఛార్లెస్ సహా పది ముస్లిం దేశాలకు చెందిన రాజులు హాజరవుతున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్‌మర్, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డసిల్వా, ఉక్రేన్ అధ్యక్షుడు వి.జెలెన్స్కీ తదితరులు హాజరవుతున్నారు. సాధారణంగా పోప్‌ను సెయింట్ పీటర్స్‌లోని క్రిప్ట్‌లో ఖననం చేస్తారు. కానీ గడచిన 100 సంవత్సరాల చారిత్రక సంప్రదాయాలకు భిన్నంగా మరణ వీలునామాలో వ్యక్తం చేసిన కోరిక ప్రకారం పోప్ ఫ్రాన్సిస్ భౌతిక దేహాన్ని రోమ్‌లోని బసిలికా ఆఫ్ సెయింట్ మేరీ మేజర్‌లో ఖననం చేస్తారు. ఈనెల 21న గుండెపోటుతో పోప్ మరణించారు.

# కారుబాంబు దాడి : రష్యా సైనిక జనరల్ హత్య

### ఉక్రేన్ శాంతి చర్చలపై అడుగంటిన ఆశలు!



**మాస్కో :** మాస్కోలో శుక్రవారం జరిగిన కారు బాంబు దాడిలో రష్యా ఉన్నతస్థాయి సైనిక జనరల్, రష్యా కమాండర్ యూరోస్లావ్ మోస్కాలిక్ హతుడయ్యారు. ఇటీవలనే ఆయన ఈ బాధ్యతల్లో నియమితులయ్యారు. డిసెంబరు నుండి ఇప్పటి వరకూ రష్యాలో ఇద్దరు సైనిక జనరల్స్ హతులయ్యారు. ఆయన హతులైనట్లు రష్యా ఫెడరల్ ఇన్వెస్టిగేటింగ్ అథారిటీ ధృవీకరించింది. పెల్లెట్స్‌తో నింపిన ఇంప్రొవైజ్డ్ పేలుడు పదార్థాల ప్రభావంతో వోక్స్‌వేగన్ గోల్ఫ్ కారు పేలిపోయిందని ఇన్వెస్టిగేటింగ్ అథారిటీ ప్రధానాధిపతి స్వెత్లానా పెట్రెంకో చెప్పారు. ఈ ఘటన తర్వాత ఉక్రేన్‌కు వ్యతిరేకంగా అధ్యక్షుడు పుతిన్ నుండి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. గత ఏడాది డిసెంబరులో రష్యా లెఫ్టినెంట్ జనరల్ ఇగోర్ కిర్రిల్లోవ్ తన అపార్ట్‌మెంటు వెలుపల ఎలక్ట్రికల్ స్కూటర్‌లో బిగించిన బాంబుదాడిలో మరణించారు. రష్యాలోనే ఆ దేశ కమాండర్‌ను లక్ష్యంగా చేసుకుని ఉక్రేన్ హతమార్చింది. సైనిక జనరల్ హత్య ఘటనతో ఇక ఉక్రేన్–రష్యామధ్య శాంతి చర్చలకు ఆశలు అడుగంటాయని యూరప్ మీడియా పేర్కొంది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రతినిధి విట్‌కాఫ్ చర్చల నిమిత్తం మాస్కోకు చేరుకున్న తరుణంలో జరిగినీ కారు బాంబు సంఘటన వారి చర్చల ఆలోచనలను తుత్తునియలు చేసిందని బ్రిటన్ మీడియా తన వార్తాకథనంలో వ్యాఖ్యానించింది. విట్‌కాఫ్–పుతిన్ మధ్య ఈ విధంగా చర్చలు జరగడం ఇది నాలుగోసారి. రష్యా ఒకవైపు చర్చల గురించి మాట్లాడుతూ మరోవైపు ఉక్రేన్‌పై ఇటీవలికాలంలో దాడులు ఉధృతం చేయడం పరస్పర విరుద్ధ ఆలోచనలుగా ఆ వార్తాకథనం పేర్కొంది. ఐతే నాలుగోవిడత చర్చల్లో ఎలాగైనా ఉక్రేన్–రష్యా మధ్య శాంతి చర్చలకు తెరలేస్తుందని అటు ట్రంప్ ఎంత ఆశాభావంతో ఉన్నారో, ఇటు రష్యా కూడా అంతే మొగ్గుచూపింది. ఐతే ఇటీవల ఉక్రేన్–రష్యామధ్య దాడులు పెరిగినప్పటికీ ట్రంప్ జోక్యంవల్ల ఆశాభావం తారాడింది. తాజా కారు బాంబు ఘటనతో ఈ పరిస్థితులు తారుమారయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**కీవ్ మేయర్ రష్యా అనుకూల వ్యాఖ్యలు**

ఒకవైపు రష్యా–ఉక్రేన్ మధ్య యుద్ధదాడులు, మరోవైపు శాంతి చర్చల యత్నాలు ఉధృతమైన తరుణంలో ఉక్రేన్ రాజధాని కీవ్ నగర మేయర్ విటాలీ క్లిట్స్కో రష్యా అనుకూల వ్యాఖ్యలు చేశారు. శాంతి చర్చలు జరిగితే రష్యా ఆక్రమించుకున్న భూభాగాన్ని ఆ దేశానికి వదులుకోవడానికి ఉక్రేన్ సిద్ధంగా ఉండాలని అన్నారు. ఇరవైశాతం భూభాగాన్ని ఇప్పటివరకూ రష్యా ఆక్రమించగా క్రిమియాలో రష్యా ఆక్రమించిన భూభాగాన్ని ఆ దేశానికి వదిలేయాలని ట్రంప్ కూడా జెలెన్స్కీపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. కీవ్ మేయర్ వ్యాఖ్యలపై జెలెన్స్కీ తీవ్రంగా స్పందించారు. శాంతి చర్చల దిశగా మొదట కాల్పుల విరమణ జరగాలనీ, ఆ తర్వాత చర్చలు జరుగుతాయన్నారు. ట్రంప్ ఒత్తిడివల్ల ఉక్రేన్ తన భూభాగాన్ని రష్యాకు వదిలేయాల్సి వస్తుందని కీవ్‌మేయర్ అన్నారు.

# ఉక్రేన్‌తో ఒప్పందానికి రష్యా సంసిద్ధత

**వాషింగ్టన్ :** ఉక్రేన్‌తో కాల్పుల విరమణ శాంతిసాధనపై ప్రత్యక్ష చర్చలకు సిద్ధంగా ఉన్నామని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లోవరోవ్ చెప్పారు. కారు బాంబు దాడి ఘటనలో రష్యాసైనికజనరల్‌హత్యకుగురికావడానికి ముందుగా సిబిఎస్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూ (ఫేస్ ద నేషన్ విత్ మార్గరెట్ బ్రెన్నన్)లో శుక్రవారం లోవరోవ్ మాట్లాడుతూ, ఉక్రేన్‌తో ప్రత్యక్ష శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నామనీ, ఐతే చర్చలకు సంబంధించిన కొన్ని విషయాలను ఇంకా తుది మెరుగులు దిద్దాల్సి ఉందని అన్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రత్యేకదూత విట్‌కాఫ్ చర్చలు చేయడానికి శుక్రవారం నాడు మాస్కోకు చేరుకున్న సందర్భంగా లోవరోవ్ ఈ ప్రకటన చేశారు.అమెరికాఅధ్యక్షుడుడోనాల్డ్ ట్రంప్ సరైన పద్ధతుల్లో ఆలోచిస్తున్నారు, అందువల్ల మేం కూడా సరైన దిశగానే అడుగులు వేస్తున్నాం అని ఆయన అన్నారు. గడచిన జులై నెల తర్వాత ఉక్రేన్ రాజధాని కీవ్‌పై రష్యా భారీ స్థాయిలో గురువారం దాడులకు పాల్పడటంతో తొమ్మిది మంది మరణించారు. మరో 77 మంది గాయపడ్డారు. ఈ మృతుల సంఖ్య శుక్రవారంనాటికి 12కు పెరిగింది. అదేవిధంగా డ్నిప్రోపెట్రోవ్స్క్ ప్రాంతం పావ్లోహ్రాడ్ పట్టణంపై రష్యా చేసిన తాజా డ్రోన్ దాడుల్లో ముగ్గురు మరణించారు. వీరిలో ఒక బాలిక, 76 ఏళ్ళ వృద్ధురాలు కూడా ఉన్నారు. రష్యా చర్యలపై ట్రంప్ గురువారం అసహనం వ్యక్తం చేశారు. ఇక దాడులు ఆపాలని, తాను విసిగిపోయానన్నారు. అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ కూడా ఒక ప్రకటన చేస్తూ రష్యా–ఉక్రేన్‌కు చర్చల బల్ల దగ్గరకు రాకపోతే ఇక అమెరికా తన దారి తాను చూసుకుంటుందని,జోక్యం చేసుకోదన్నారు. ఒకవైపు ప్రజలను చంపుతూ శాంతి చర్చలు ఎలా చేస్తారని మార్గరెట్ బ్రెన్నన్ ఆయనను ప్రశ్నించగా,ఉక్రేన్ సైన్యాలు పౌర ప్రాంతాలను సైనిక అవసరాలకు ఉపయోగిస్తున్నాయనీ, అలాంటి ప్రాంతాలను తాము లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నామని లోవరోవ్ సమాధానం చెప్పారు. తాము ఇప్పటికీ ఉక్రేన్‌తో చర్చలకు కట్టుబడి ఉన్నామని చెప్పడానికి అనేక ఉదాహరణలు ఉన్నాయనీ, ఉక్రేన్‌లో అసలు సమస్యకు గల మూల కారణాన్నిపరిష్కరించాల్సినఅవసరం ఉందన్న ఆలోచనతో కృషి చేస్తున్న నాయకుడు ఈ భూమ్మీద కేవలం డోనాల్డ్ ట్రంప్ మాత్రమేనన్నారు. 2022 ఫిబ్రవరి 24న ఉక్రేన్‌పై రష్యా పూర్తిస్థాయి యుద్ధాన్ని ప్రారంభించింది. ఇప్పటివరకు 20శాతం ఉక్రేన్ భూభాగాన్ని తన అధీనంలోకి తెచ్చుకుంది. రష్యాశాంతికి కట్టుబడిఉందని తాను చాలా బలంగానమ్ముతున్నానని ట్రంప్‌పదేపదే ప్రకటనలు చేస్తున్నారు. రష్యా ఆక్రమించిన భూభాగాలను వారికే అప్పగించేందుకు అంగీకరించాలని జెలెన్స్కీపై ట్రంప్ ఒత్తిడి చేశారు.

# ఆ దాడుల్ని మాకు అంటగడతారా?

### జల ఉగ్రవాదాన్ని ప్రతిఘటిస్తాం
### పాక్ సెనేట్ ఏకగ్రీవ ఖండన తీర్మానం



**ఇస్లామాబాద్:** భారతదేశానికి వ్యతిరేకంగా పాకిస్థాన్ ఎగువసభ శుక్రవారంనాడు ఏకగ్రీవ తీర్మా నం చేసింది. ఈనెల 22న అనంతనాగ్ జిల్లా పహల్గామ్ సమీపంలో ఉగ్రవాదులు దాడి చేస్తే ఈ దాడిని పాకిస్థాన్ ప్రభుత్వానికి ముడిపెట్టి భారతదేశం జాతీయ భద్రతా కమిటీ సమావేశంలో ఆంక్షల తీర్మానాలు చేయడాన్ని పాకిస్థాన్ ఎగువసభ ఖండించింది. ''భారతదేశం ఆక్రమించిన కశ్మీరులో ఉన్న టూరిస్టు ప్రాంతంలో ఈ ఉగ్రవాదుల దాడి జరిగింది, ఈ దాడిలో ఇద్దరు విదేశీయులు సహా 26 మంది మరణించారు, ఐతే ఈ దాడులు పాకిస్థాన్ విశ్వసించిన విలువలకు విరుద్ధమైనవి, ఈ దాడులను పాకిస్థాన్‌కు అంటగట్టే పనికిమాలిన, నిరాధారమైన ప్రయత్నాలను ఖండిస్తున్నాం''అని ఎగువసభ తన తీర్మానంలో పేర్కొంది. ''సంకుచిత రాజకీయ లక్ష్యాలకోసం సాక్ష్యాలు లేని, అందరికీ తెలిసిన ఉదాహరణలను చూపించి పాకిస్థాన్‌నుకించపరచేందుకుభారతదేశం చేస్తున్న కుట్రపూరితమైన,దురుద్దేశపూరితమైన ప్రచారాన్ని ఎగువసభఖండిస్తున్నది'' అని తీర్మానం పేర్కొంది. ''సింధుజలాల ఒప్పందాన్ని రద్దుచేస్తూ భారతదేశం తీసుకున్న నిర్ణయం చట్టాల ఉల్లంఘన, ఏకపక్షనిర్ణయం,సింధుజలాల ఒప్పందాన్ని స్పష్టంగా ఉల్లంఘించడం చట్టవిరుద్ధం, ఇది యుద్ధం ప్రకటించడంతో సమానం'' అని ఎగువసభ పేర్కొంది. పాకిస్థాన్ ఉప ప్రధానమంత్రి ఇషాక్ దార్ ఎగువసభలో ఈ తీర్మానం ప్రవేశపెట్టారు. జల ఉగ్రవాదం లేదా సైనిక కవ్వింపులకు వ్యతిరేకంగా దేశ సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను కాపాడుకోవడానికి పాకిస్థాన్ పూర్తిశక్తిసామర్థ్యాలతో సర్వసన్నద్ధంగా ఉందని తీర్మానం పేర్కొంది.

# బ్రిటన్‌లో భారత్ సంతతి నిరసన, నివాళి



**లండన్ :** పహల్గామ్‌లో పాకిస్థాన్ ఉగ్రవాదుల దాడులకు వ్యతిరేకంగా బ్రిటన్‌లో స్థిరపడిన భారతీయులు తీవ్ర నిరసన వ్యక్తంచేశారు. భారతీయులు పెద్దసంఖ్యలో శుక్రవారంనాడు లండన్‌లో ఉన్న భారత హైకమిషన్ కార్యాలయం వెలుపల గుమిగూడి పాకిస్థాన్ దుశ్చర్యలపట్ల తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. భారతీయ డయాస్పోరా తరపున కులదీప్ షెకావత్ మాట్లాడుతూ, ఉగ్రవాదులను కఠినంగా అణచివేయాలని కోరారు. ఇజ్రాయెలీకి చెందిన వారు కూడా భారత్ డయాస్పోరాకు ఈ విషయంలో మద్దతు ఇచ్చారు. ముస్లిం ఉగ్రవాదులను అణచివేయాలని వారు కోరారు. భారత జాతీయ పతాకాలను పట్టుకుని ప్రదర్శన చేశారు. భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. జీహాదిస్టులను అణచివేయాలని ప్రదర్శకులు కోరారు. ఇదిలాఉండగా భారత హైకమిషన్ కార్యాలయం కూడా పహల్గామ్‌లో మరణించిన పర్యాటకులకు సంతాపం తెలియజేసింది. బ్రిటన్ మంత్రులు కేథరిన్ వెస్ట్, ఎల్.మురుగన్, బ్రిటన్ పార్లమెంటు సభ్యులు బాబ్ బ్లాక్‌మన్, కనిష్క నారాయణ్, హౌస్‌ఆఫ్‌లార్డ్స్‌సభ్యులు సంధ్యావర్మ, లార్డ్ రావెల్, మహారాష్ట్ర మం త్రి సంజయ్ సిర్సాత్ తదితరులు ఉగ్రవాదుల దాడిలో మరణించిన పర్యాటకులకు శ్రద్ధాంజలిఘటించారు. మృతుల కుటుంబాలకు సంతాపం, సానుభూతి తెలిపారు.

# పాకిస్థాన్‌లో భారత్ వ్యతిరేక నిరసనలు

### యుద్ధం చేసి నీటి హక్కు సాధిస్తాం



**ఇస్లామాబాద్:** పాకిస్థాన్‌పై భారత ప్రభుత్వం ఆంక్షలు విధించిన తర్వాత ఆ దేశంలో భారత్‌కు వ్యతిరేకంగా అ దేశంలో పలుచోట్ల నిరసన ప్రదర్శనలు జరిగాయి. సింధు జలాల ఒప్పందం రద్దును షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం ప్రజల్లో తనకు అనుకూలగా ప్రచారం చేసుకుంటున్నది. యుద్ధం చేసి నీటి హక్కు సాధిస్తామంటూ పజలు వీధుల్లోకి వచ్చి భారత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. భారత సరిహద్దుల్లో ఉగ్రవాదానికి పాకిస్థాన్ ప్రభుత్వం పెంచిపోషిస్తోందని ప్రతీకారం తీర్చుకుంటామని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ హెచ్చరించిన తర్వాత ఈ నిరసనలు మొదలయ్యాయి. శతాబ్దకాలంగా భారత్ ఆక్రమిత కశ్మీరులో ప్రజలను అణచివేస్తున్నారని వారు విమర్శించారు. లాహోర్, ఇస్లామాబాద్‌లలో వందలమంది ప్రదర్శనలు చేశారు. ఒక వ్యాపారవేత్త అజ్మల్ బలూచ్ మాట్లాడుతూ, ''భారతదేశం మాతో యుద్ధానికి దిగాలనుకుంటే బాహాటంగా ముందుకు రమ్మనండి'' అని సవాలు చేశారు. ''రెలిజియస్‌పార్టీ'' పిలుపు మేరకు లాహోర్‌లో ఈ ప్రదర్శన జరిగింది. పాకిస్థాన్ ఆక్రమిత ముజఫరాబాద్‌లో కూడా 300 మంది ప్లకార్డులు చేతపట్టుకుని నిరసన ప్రదర్శన చేశారు. సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేసి పాకిస్థాన్ జీవనంపై భారత్ దెబ్బకొడుతోందని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం ప్రజల్లో విస్తారంగా ప్రచారం ప్రారంభించింది. ఈ అంశాన్ని తనకు అనుకూలంగా మలచుకుంటున్నది. ''నీరు మా హక్కు, నీరు దేవుడు ఇచ్చిన ప్రసాదం, ఆ హక్కును అవసరమైతే యుద్ధం చేసైనాసరే సంపాదించుకుంటాం'' అని ప్రదర్శనలో పాల్గొన్న పాతికేళ్ళ వయసుగల మహ్మద్ ఓవైసీ అన్నాడు. ''భారతదేశం గనుక పాకిస్థాన్‌పై దాడి ద్వారా తప్పుచేస్తే పాకిస్థాన్ కశ్మీరీ ప్రజలు యుద్ధంలో ముందు పీఠిన నిలబడి పోరాటం చేస్తాం, పాకిస్థాన్ కోసం మేం మరణించి ప్రాణాలు అర్పించడానికి కూడా సిద్ధంగా ఉన్నాం'' అని పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరులోని పాకిస్థాన్ పీపుల్స్‌పార్టీ సీనియర్ నాయకుడు షౌకత్ జావేద్ మిర్ అన్నారు. బలూచిస్థాన్ రాజధాన క్వెట్టాలో కూడా 150 మంది ప్రజలు నిరసన ప్రదర్శన జరిపారు.

## బెయిల్ ఇవ్వండి

### ప్రభాకర్‌రావు వాదన

**హైదరాబాద్ :** ఫోన్‌ల ట్యాపింగ్‌కు ముందు చీఫ్‌సెక్రటరీ ఆధ్వర్యంలోని కమిటీ ఆదేశాలు ఇస్తుందని, ఆ కమిటీ ఆదేశాల మేరకు విధులు నిర్వహించినట్లు ఫోన్‌ట్యాపింగ్ కేసులో ఏ1 అయిన టి.ప్రభాకర్‌రావు హైకోర్టులో వాదించారు. తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలన్నారు. ఈ మేరకు ఆయన వేసిన పిటిషన్‌పై జస్టిస్ జె.శ్రీనివాసరావు శుక్రవారం విచారించారు. పిటిషనర్ డీజీపీ సబార్డినేట్‌గా పనిచేస్తారని, కమిటీ వాళ్లను వదిలేసి పిటిషనర్‌పై విచారణ చేయడం చెల్లదని ఆయన లాయర్ అన్నారు. అరెస్ట్ నుంచి మినహాయింపునిస్తే విచారణకు హాజరవుతారన్నారు. ఇదే కేసులో 6వ నిందితుడైన శ్రవణ్‌కుమార్‌కు సుప్రీం కోర్టులో వెసులబాటు లభించిందన్నారు. హార్డ్‌డిస్కల ధ్వంసంలో పిటిషనర్ పాత్ర లేదని, అప్పటికే అతను రాజీనామా చేశారన్నారు. సుమారు 65 ఏళ్ల వయస్సు ఉందని, ఈ వయసులో ఉన్నవారిని విచారించాలంటే ఇంటివద్దకే దర్యాప్తు అధికారులు వెళ్లాలని కోర్టులు చెబుతున్నాయన్నారు. క్యాన్సర్‌తో బాధపడుతున్నారని, 30 ఏళ్ల సర్వీసులో అనేక పతకాలు పొందన అంశాలను కూడా గమనంలోకి తీసుకోవాలన్నారు. పోలీసుల తరపున సీనియర్ లాయర్ వాదిస్తూ, ప్రభాకర్ పొందిన పతకాలను చూసి బెయిల్ ఇవ్వొద్దని కోరారు. పంజాబ్‌లో జరిగిన ఆపరేషన్ బ్లూస్టార్ చేసినప్పుడు ఒక ఆర్మీ రిటైర్డు ఆఫీసర్ బింద్రన్‌వాలే గ్రూపు సలహాదారుగా చేశారని, ఆపరేషన్ బ్లూస్టార్‌లో ఆ అధికారి హతమయ్యారని చెప్పారు. ముందస్తు బెయిలు ఇవ్వొద్దని కోరారు విచారణను ఈనెల 29వ తేదీకి వాయిదా వేశారు.

## ఐకమత్యమే ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మీడియాతో మాట్లాడుతూ దాడిలో గాయబడిన వారిని కలిశానన్నారు. కుటుంబ సభ్యులను కోల్పోయిన ప్రతి ఒక్కరి పట్ల ప్రేమ, ఆప్యాయత ఉందన్నారు. దేశం మొత్తం కలిసి ఉందని అందరికీ తెలియజేయాలని కోరుకుంటున్నానన్నారు. గురువారం ఢిల్లీలో జరిగిన అఖిలపక్ష సమావేశాన్ని ప్రస్తావిస్తూ, ఐక్య ప్రతిపక్షం ఉగ్రవాద దాడిని ఖండించిందని, ప్రభుత్వానికి అండగా ఉందని పేర్కొన్నారు. సమాజాన్ని విభజించడం, సోదరులు మధ్య తగాదాలు సృష్టించడమే ఉగ్రవాదుల పని అని, భారతీయులంతా ఐక్యంగా ఉండడం ఎంతో అవసరమన్నారు. అప్పుడే ఉగ్రచర్యలను, వారి ప్రయత్నాలను దీటుగా ఎదుర్కోగలమని చెప్పారు. కశ్మీర్‌తో పాటు దేశంలో వివిధ ప్రాంతాలకు చెందిన వారిపై కొందరు దాడులు చేయడం అత్యంత బాధాకరమని, మనందరం ఐక్యంగా ఉండి ఉగ్రవాదాన్ని తరిమికొట్టాలని సూచించారు. కాగా, రాహుల్‌గాంధీ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లానూ కలిశారు. పహల్గామ్‌లో ఏం జరిగిందో వారు వివరించారు. తమ పార్టీ తరుపున పూర్తి మద్దతు ఉంటుందని వారిద్దరికీ హామీనిచ్చానని రాహుల్ చెప్పారు. ముందుగా రాహుల్ వ్యాపారులు, విద్యార్థి నాయకులు, పర్యాటక రంగానికి సంబంధించిన ప్రతినిధులను కలిశారు.

## హింసాకాండ ఆపాలి

(మొదటి పేజీ తరువాయి)

సమస్యను పరిష్కరించే అవకాశం ఉన్నప్పటికీ అణిచివేత, హింసాకాండ ద్వారా సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని లేఖలో తెలిపారు. బీజాపూర్ తెలంగాణ సరిహద్దుల్లో భారీ సైనిక ఆపరేషన్ ప్రారంభమైందని దీనిని వెంటనే ఆపాలని సైనిక బలగాలను ఉపసంహరించుకోవాలని మావోయిస్టులు లేఖలో డిమాండ్ చేశారు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించే మార్గాన్ని అనుసరించాలని అనుకూల వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆ దిశగా మావోయిస్టు పార్టీ అభ్యర్థిస్తుందని లేఖలో తెలిపారు. చర్చల మార్గమే సానుకూల ఫలితాలను ఇస్తుందని తుపాకీతో సమస్యను పరిష్కరించాలని ప్రయత్నిస్తున్న ప్రభుత్వం కాగార్ సైనిక్ కార్యక్రమాన్ని ఒక నెల పాటు వాయిదా వేయాలని మా విజ్ఞప్తి పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఆశతో ఎదురు చూస్తున్నామని మావోయిస్టులు లేఖలో పేర్కొన్నారు.

## గ్లోబల్ జస్టిస్

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. సుదీర్ఘకాలం తర్వాత అలాంటి దిశా నిర్దేశాన్ని 'భారత్ సమ్మిట్–2025' ద్వారా కాంగ్రెస్ పార్టీ చేస్తున్నదన్నారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసిసిలోశుక్రవారంప్రారంభమైన'భారత్ సమ్మిట్–2025' కార్యక్రమంలో భాగంగా వివిధ అంశాలపై జరిగిన ప్యానల్ డిస్కషన్స్ వివరాలను టిపిసిసిఅధ్యక్షులుబి. మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, సల్మాన్ ఖుర్షిద్‌లతో కలిసి డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మీడియాకు వెల్లడించారు. కాంగ్రెస్ మూల సిద్ధాంతాల ఆధారంగా భారత్‌సమ్మిట్ జరుగుతున్నదని, ఈసమ్మిట్‌లో శాంతికాముకులు, ప్రపంచ న్యాయం కోరుకునే వారు (గ్లోబల్ జస్టిస్) ప్రోగ్రెసివ్ ఆలోచనలు కలిగిన వారు 8 ప్యానెల్స్‌గా చర్చల్లో పాల్గొన్నారని తెలిపారు. సుమారు 100 దేశాల నుంచి హాజరైన ప్రతినిధులు లింగ న్యాయం, ఫెమినిస్ట్ ఫ్యూచర్, ఫ్యాక్ట్ వర్సెస్ ఫిక్షన్–కౌంటరింగ్ డిస్‌ఇన్ఫర్మేషన్,యూత్‌అండ్ పాలిటిక్స్‌ఆఫ్‌టుమారో, షేపింగ్ న్యూ మల్టీ ల్యాటరలిజం వంటి అంశాలపై లోతుగా ప్రముఖులు చర్చలు చేశారనివివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా హైదరాబాదులో నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్ కార్యక్రమం చారిత్రాత్మకమైన సమ్మిట్‌గా నిలిచిపోతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోజరుగుతున్నఅభివృద్ధి,అమలు చేస్తున్న సంక్షేమం గురించి భారత్ సమ్మిట్ ద్వారా ప్రపంచానికి చాటి చెప్పామన్నారు. సామాజిక న్యాయం, అభివృద్ధిని మేళవించి కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతాలను ఏవిధంగాముందుకుతీసుకుపోతున్నామో ప్రపంచ ప్రతినిధులకు వివరించామన్నారు. లోక్‌సభ ప్రతిపక్షనేత,కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తీసుకున్న 'గ్లోబల్ జస్టిస్' నిర్ణయాన్ని ముందుకు తీసుకెళ్లే క్రమంలో తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రయత్నాన్ని ఈ సమ్మిట్‌కు హాజరైన ప్రతినిధులు స్వాగతించి, అభినందించారని వెల్లడించారు. టెర్రరిజానికి వ్యతిరేకంగా దేశం కోసం అందరం ఒక్కటై నిలబడదామని పిలుపునిచ్చారు. శాంతి, అహింసా మార్గంలో గ్లోబల్ జస్టిస్ కోసం కాంగ్రెస్‌తో కలిసి రావాలని కోరారు.

**తెలంగాణాలో పెట్టుబడులు పెట్టండి**

దేశానికే మోడల్‌గా నిలవనున్న తెలంగాణలో పెట్టుబడులుపెట్టాలని'భారత్‌సమ్మిట్'లో పాల్గొన్న దేశవిదేశాలకు చెందిన ప్రతినిధులను కోరినట్లు ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క చెప్పారు. క్లీన్ అండ్ గ్రీన్ న్యూ ఎనర్జీ పాలసీ ద్వారా 2035 నాటికి 40 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, రీజినల్ రింగ్ రోడ్ ఔటర్ రింగ్ రోడ్డు మధ్య ఏర్పాటు చేస్తున్న క్లస్టర్స్, ఫ్యూచర్ సిటీ, మూసి పునర్జీవం, నాలెడ్జ్ ఐటీ సెంటర్, ఇందిరా గిరి జల వికాసం, యంగ్‌ఇండియాఇంటిగ్రేటెడ్‌రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు,రాజీవ్‌యువ వికాసం పథకాల గురించిప్రతినిధులకు వివరించామని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ను ప్రతినిధులు అభినందించారన్నారు.

## 208 మంది పాక్ పౌరులు

(మొదటి పేజీ తరువాయి)

జారీ చేస్తున్నారు. గడువు ముగిసిన తరువాత కూడా ఎవరైనా ఇక్కడ ఉంటే వారిని అరెస్టు చేసి పంపించే అంశాలపై కూడా పోలీసులు చర్చిస్తున్నారు.అలాగేఅక్రమవలసదారులపై కూడా పోలీసు శాఖ గట్టి చర్యలు తీసుకుంటోంది. ఇది కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం, జాతీయ భద్రతా పరిరక్షణ చర్యలలో భాగంగా ఈ సర్చ్ ఆపరేషన్ మొదలు పెట్టారు.శ్రీనగర్‌లఉగ్రదాడిలో 26 మంది మరణించిన ఉదంతంపై కేంద్ర మంత్రివర్గ భద్రతాకమిటీ(సిసిఎస్)పాకిస్తానీయులను గుర్తించి, వారి వీసాల గడువు ముగిసిన వారిని వెనక్కి పంపించాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఈ ఆదేశాల మేరకు, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండపోలీసు కమిషనరేట్ల పరిధిలో ప్రత్యేక శాఖలతో కలిసి పాకిస్తానీయుల గుర్తింపు కోసం విస్తృతంగాతనిఖీలు నిర్వహిస్తున్నారు. 2023లో ఫైజ్ మహ్మద్ అనే పాకిస్తానీయుడు నెపాల్ సరిహద్దు ద్వారా అక్రమంగా భారత్లోకి ప్రవేశించి, హైదరాబాద్‌లో తన భార్యతో కలిసి నివసిస్తున్నాడు. ఇతన్ని అరెస్టు చేసిన పోలీసులు అతని వద్ద నుండి పాకిస్తాన్ పాస్‌పోర్టు, ఇతర డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు.ఈ ఏడాది జనవరిలో జక్రియా అనే పాకిస్తానీయుడు వరంగల్‌లో హోటల్ నిర్వహిస్తూ, టెర్రర్ స్లీపర్ సెల్ కార్యకలాపాల్లో పాల్గొంటున్నాడని నిఘా సంస్థలు గుర్తించి అరెస్ట్ చేశాయి. అతని వద్ద నుండి పేలుడు పదార్థాలు, తుపాకులు, నకిలీ డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు . భారతీయ జనతా పార్టీ తెలంగాణ శాఖ, రాష్ట్రంలో పాకిస్తానీయులు మరియు బంగ్లాదేశీయులను గుర్తించి, అక్రమంగా నివసిస్తున్న వారిని వెంటనే వెనక్కి పంపించాలని ప్రభుత్వాన్ని కోరింది. పార్టీ నాయకులు, పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో, విదేశీయులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు . తెలంగాణలో పాకిస్తానీయుల గుర్తింపు, అక్రమ వలసదారుల నిర్ధారణపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలు అపరిచిత వ్యక్తులపై అనుమానాస్పద కార్యకలాపాలను గమనించి, పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరుతున్నారు.

## ఎంఐఎం గెలుపు

(మొదటి పేజీ తరువాయి)

చెందిన 49, కాంగ్రెస్‌కు చెందిన 14 ఓట్లు కలిపి 63 ఓట్లు ఎంఐఎం అభ్యర్థికి పోలయ్యాయి. దీంతో ఆ పార్టీ అభ్యర్థి మీర్జా రియాజ్ ఉల్ హాసన్ గెలుపొందినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి ప్రకటించారు. హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయం పన్వర్‌హాల్‌లో శుక్రవారం ఉదయం 8 గంటలకు ప్రారంభించారు. లెక్కింపు ప్రక్రియను 10 గంటలలోపే పూర్తి చేశారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాన్ని రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. ఈ నెల 23న జరిగిన ఎన్నికల్లో 78.57 శాతం పోలింగ్ నమోదు అయింది. మొత్తం 112 ఓట్లకు గాను 88 ఓట్లు పోలయ్యాయి. 66 మంది కార్పొరేటర్లు, 22 మంది ఎక్స్ అఫిషియో సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్‌లో బిజెపి, కాంగ్రెస్, ఎంఐఎం కార్పొరేటర్లు, ఎక్స్ ఆఫీషియె సభ్యులు పాల్గొన్నారు. ఓటింగ్‌ను బిఆర్‌ఎస్ కార్పొరేటర్లు, ఎక్స్ ఆఫీషియో సభ్యులు దూరంగా ఉన్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయం వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

**ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు : అనురాగ్ జయంతి**

హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ప్రశాతంగా ముగిసిందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి తెలిపారు. ఈ ఎన్నికల్లో 88 ఓట్లు పోల్ కాగా అందులో ఎంఐఎం అభ్యర్థి మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండికి 63 ఓట్లు, బిజెపిఅభ్యర్థి డాక్టర్ ఎన్. గౌతమ్ రావుకు 25 ఓట్లు పోలయ్యాయన్నారు. గెలుపొందిన అభ్యర్థికి రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి డిక్లరేషన్ సర్టిఫికెట్‌ను అందచేశారు.

**ఏకగ్రీవం కావొద్దనే బిజెపి పోటీ చేసింది : మీర్జా రియాజ్ ఉల్ హాసన్ ఎఫెండి**

ఎమ్మెల్సీ ఎంఐఎంకి ఏకగ్రీవం కావద్దనే ఉద్దేశంతోనే చివరి నిమిషంలో బిజెపి తన అభ్యర్థిని ఎన్నికల్లో నిలబెట్టిందని రియాజ్ ఉల్ హాసన్ ఎఫెండి అన్నారు. ఇది ఎన్నిక జరగడానికి కారణమైందన్నారు. ఎమ్మెల్సీగా విజయం సాధించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అయినా కూడా ఈ ఎన్నికల్లో తామే విజయం సాధించామన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. కశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల దుశ్చర్య కారణంగా విజయోత్సవ ర్యాలీని రద్దు చేసుకున్నామని తెలిపారు. తమ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం కొవ్వోత్తుల ర్యాలీని జరుపుతామని చెప్పారు.

**ఆ మూడు పార్టీలు ఒక్కటే : బిజెపి అభ్యర్థి గౌతమ్ రావు**

ఈ సందర్భంగా బిజెపి అభ్యర్థి గౌతమ్ రావు మాట్లాడుతూ బిఆర్‌ఎస్ కార్పొరేటర్లను ఓటు వేయకుండా అడ్డుకున్న బిఆర్‌ఎస్ పార్టీ గుర్తింపును ఎన్నికల కమిషన్ ఎందుకు రద్దు చేయవద్దని తాను ప్రశ్నిస్తున్నానని అన్నారు. బిఆర్‌ఎస్ పార్టీ గుర్తింపును రద్దు చేయాలని ఎన్నికల కమిషన్కు ఫిర్యాదు చేస్తామన్నారు. వారు ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్న వారిని ఓటింగ్‌కు రానివ్వకుండా బిఆర్‌ఎస్ నేతలు అడ్డుకున్నారని ఆరోపించారు. కెటిఆర్ ఓట్లు వేయొద్దు అని చెప్పారని, ఈ పార్టీ ఇప్పుడు ఏ విధంగా ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎంఐఎంకు నేరుగా సహకరించిందన్నారు. బిఆర్‌ఎస్ ఓటింగ్ రాకుండా దోహదపడిందన్నారు.

## బిఆర్‌ఎస్ సిగ్గుపడాలి

(మొదటి పేజీ తరువాయి)

పాలనలో కట్టిన ఈ ప్రాజెక్టు వారి పాలనలోనే కుప్ప కూలిపోయిందని ఆయన మండిపడ్డారు. మెడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలు ఎందుకూ పనికి రాకుండా పోయినా ఆ నిర్మాణాలు తమ గొప్పతనమని బిఆర్‌ఎస్ నేతలు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై జాతీయ ఎన్‌డిఎస్‌ఎ ఇచ్చిన నివేదికపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో స్పందించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి బిఆర్‌ఎస్ ప్రభుత్వం అధిక వడ్డీలతో లక్ష కోట్లు ఋణం తీసుకొచ్చి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఇంత జరిగాక కుడా బిఆర్‌ఎస్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ బిఆర్‌ఎస్ సొంత జాగీర్ కాదని, ప్రజాధనంతో ప్రజల ప్రాణాలతో చెలగాట మాడితే చూస్తూ సహించేదిలేదని హెచ్చరించారు. ఎన్‌డిఎస్‌ఎ ఇచ్చిన నివేదికపై సమగ్రమైన అధ్యయనం చేసిన అనంతరం తదుపరి చర్యల కోసం మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. బిఆర్‌ఎస్ పాలనలో నిర్మితమైన ఈ ప్రాజెక్టు రైతుల కోసం నిర్మించింది ఎంత మాత్రం కాదని, నాటి అధికార పార్టీ నేతల జేబులు నింపు కోవడానికే దీనిని వినియోగించుకున్నారని ఆయన విమర్శించారు. ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలను గుర్తించి అందుకు బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ అంశంలో ఏ ఒక్కరినీ ఉపేక్షించేది లేదని బాధ్యులైన వారికి శిక్షలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రాజెక్టు నిర్మాణం రూపకల్పన, నిర్వహణా లోపాలు బయట పడినందున బిఆర్‌ఎస్ నేతలు తెలంగాణ రైతులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మెడిగడ్డ, సుందిళ్ళ, అన్నారం బ్యారెజ్‌లు నిరుపయోగంగా మారినా రాష్ట్రంలో ధాన్యం దిగుబడి రికార్డు సృష్టిస్తుంది అంటే కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగం విషయంలో అనుసరించిన విధానాలు మాత్రమే దోహద పడ్డాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## కలపండి

(మొదటి పేజీ తరువాయి)

మంత్రులు, ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, ప్రభుత్వ సలహాదారులు, కార్పొరేషన్ చైర్మన్‌లు, ఎమ్‌ఐఎమ్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీతో పాటు భారత్ సమ్మిట్‌కు దేశ, విదేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ పహల్గామ్‌లో భారతీయ పర్యాటకులపై ఉగ్రవాదుల పాశవిక దాడులను తీవ్రంగా ఖండించారు. దేశ ప్రధాని మోదీ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తీసుకుంటున్న చర్యలకు రాష్ట్ర ప్రభుత్వ, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల సంపూర్ణ మద్దతు కూడా ఉంటుందని ప్రకటించారు. దేశ ప్రజలు కూడా కేంద్ర ప్రభుత్వం వెంట ఉన్నారన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ఉండాలంటే భారత ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు.

ఉగ్రవాదంపై భారత ప్రభుత్వం చేపట్టే ప్రతీ చర్యకు మద్దతు పలికేందుకు అందరం సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. అందరం ఏకమై తీవ్రవాదాన్ని అంతమొందించి దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాలన్నారు. దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని అన్నారు. ఉగ్రవాద దాడుల్లో మరణించిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం సానుభూతి తెలుపుతుందని, ఆ కుటుంబాలకు అందరం అండగా నిలబడి మనోధైర్యాన్ని ఇవ్వాలని కోరారు.

1967, 1971లో ఇలాంటి దాడులు చేసిన వారికి అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ గట్టిగా జవాబు ఇచ్చారని, ఒక్క దెబ్బతో పాకిస్తాన్‌ను పాకిస్తాన్, బంగ్లాదేశ్ అని రెండు ముక్కలు చేశారని సిఎం గుర్తు చేశారు. ఆ సందర్భంలో ఇందిరాగాంధీని వాజ్‌పేయ్ దుర్గామాతతో పోల్చారని తెలిపారు. ప్రధాని మోదీ కూడా దుర్గామాత భక్తులుగా ఇందిరాగాంధీని ఆదర్శంగా తీసుకుని ఉగ్రమూకలకు గట్టి జవాబు ఇవ్వాలని సిఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఒక్క దెబ్బతో పాకిస్థాన్‌ను రెండు ముక్కలు చేయండి పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను భారత్‌లో కలపండి అని సిఎం కోరారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## అట్టారీ సరిహద్దు 30 వరకు తెరిచి ఉంటుంది: డిజిపి



ప్రజాపక్షం/హైదరాబాద్: శ్రీనగర్‌లో ఉగ్ర దాడి నేపథ్యంలో రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ పాక్ పౌరులకు సంబంధించి కీలక ఆదేశాలు జారీ చేశారు. పాకిస్తానీ జాతీయులకు వీసా సేవలను తక్షణమే నిలిపివేయాలని నిర్ణయించామని స్పష్టం చేశారు. పాకిస్తాన్ జాతీయులకు భారతదేశం జారీ చేసిన అన్ని చెల్లుబాటు అయ్యే వీసాలు ఏప్రిల్ 27 నుండి రద్దు అవుతాయన్నారు. అలాగే పాకిస్తాన్ జాతీయులకు జారీ చేసిన వైద్య వీసాలు మాత్రం ఏప్రిల్ 29 వరకు మాత్రమే చెల్లుబాటు అవుతాయని ఆ తరువాత రద్దవుతాయన్నారు. వీసాల రద్దు .. దీర్ఘకాలిక వీసాలు (ఎల్‌టివిలు), దౌత్య, అధికారిక వీసాలు కలిగి ఉన్నవారికి వర్తించదన్నారు. పాక్ వెళ్లాలనుకునేవారి కోసం అట్టారీ సరిహద్దు ఈ నెల 30 వరకు తెరిచి ఉంటుందని తెలిపారు. చట్ట పరమైన చర్యలను నివారించడానికి తెలంగాణలో ఉంటున్న పాకిస్తాన్ జాతీయులు మార్గదర్శకాలను పాటించాలని సూచించారు.

## పత్తి కొనుగోళ్ల అవకతవకలపై మంత్రి ఆగ్రహం



### విజిలెన్స్ విచారణను త్వరగా పూర్తి చేయాలని ఆదేశం
### 162 మార్కెట్ కమిటీలకు నూతన కార్యవర్గాలు

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో పత్తి కొనుగోళ్ల సందర్భంగా చోటుచేసుకున్న అవకతవకలపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పలు పత్రికలలో ప్రచురితమైన కథనాలపై స్పందించిన మంత్రి, సంబంధిత అధికారులకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ అవకతవకలపై వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులను పిలిపించి, తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ మార్కెట్లలో విజిలెన్స్ విచారణ చేపడుతున్నారని మంత్రి తెలిపారు. విజిలెన్స్ ఇచ్చే విచారణ నివేదిక ఆధారంగా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా, విజిలెన్స్ విచారణను వేగంగా పూర్తి చేసి, రిపోర్టును సమర్పించేవిధంగా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ కార్యదర్శికి, మార్కెటింగ్ డైరెక్టర్‌కు ఆదేశాలిచ్చారు. అదేవిధంగా రాష్ట్రంలోని ప్రతి మార్కెటింగ్ సెక్రటరీ, జిల్లా మార్కెటింగ్ అధికారుల నుండి వివరణ తెప్పించుకోవాలని మార్కెటింగ్ డైరెక్టర్‌కి మంత్రి ఆదేశించారు. మార్కెట్లలో జరిగే ఎలాంటి అక్రమాలను ప్రభుత్వం ఉపేక్షించదని, రైతులకు నష్టం కలిగే విధంగా ఎవరూ నడుచుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**162 మార్కెట్ కమిటీలకు నూతన కార్యవర్గం**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 197 మార్కెట్ కమిటీల్లో ఇప్పటివరకు 162 కమిటీలకు నూతన పాలకవర్గాలను నియమించడం జరిగిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలియజేశారు. ఏడాదిలోనే 2,268 నామినేటెడ్ పోస్టులను భర్తీ చేశామని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అతి తక్కువ సమయంలో ఈ స్థాయిలో మార్కెట్ కమిటీలను ఏర్పాటు చేసినది ఇదే తొలి సారని మంత్రి తెలిపారు. మార్కెట్లలో జరిగే అవకతవకలకు అడ్డుకట్ట పడేవిధంగా, రైతులకు గరిష్ట మద్ధతు ధర వచ్చే విధంగా, రైతులకు కావాల్సిన కనీస వసతులు కల్పించే దిశగా ఈ పాలకవర్గాలు పనిచేయాలని మంత్రి సూచించారు. గత ప్రభుత్వ హయాంలో మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలు లేని పరిస్థితుల వలన రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని, వేగంగా కమిటీలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. మిగిలిన మార్కెట్ కమిటీలకు కూడా త్వరలోనే పాలకవర్గాలు నియమించబడతాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, మిగతా మార్కెట్ కమిటీలతో పాటు ఎటిఎంఎ, ఇతర నామినేటెడ్ పోస్టులను త్వరలోనే భర్తీ చేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు.

## ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో దేశానికి అండగా నిలుస్తాం




### ఎపిటిబిఇఎఫ్ ప్రధాన కార్యదర్శి బిఎస్.రాంబాబు

ప్రజాపక్షం/హైదరాబాద్: ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో దేశానికి అండగా నిలుస్తామని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఎపిటిబిఇఎఫ్) ప్రధాన కార్యదర్శి బి.ఎస్.రాంబాబు చెప్పారు. పహల్గామ్‌లో జరిగిన క్రూరమైన ఉగ్రవాద దాడి బ్యాంక్ ఉద్యోగులను తీవ్రంగా దిగ్భ్రాంతికి గురి చేసిందని, ఈ భయంకరమైన చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పహల్గామ్‌లో అమాయక పౌరులపై ఉగ్రవాదుల దాడులను ఖండిస్తూ హైదరాబాద్ కోఠిలోని బ్యాంకు స్ట్రీట్‌లో శుక్రవారం ఎపిటిబిఇఎఫ్ నిరసన ప్రదర్శన నిర్వహించింది. వందలాది మంది బ్యాంకు ఉద్యోగులు ప్లకార్డులు చేతబూని ఉగ్రవాదం నశించాలి, శాంతిని కాపాడాలి, ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేసి, కొవ్వత్తులు వెలిగించి మృతులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బి.ఎస్. రాంబాబు మాట్లాడుతూ పహల్గామ్‌లో విషాదకరమైన ఉగ్రవాద దాడిలో ఇద్దరు బ్యాంకు ఉద్యోగులు జె.చంద్రమౌళి, శైలేష్ భాయ్ కాలాతియా బలికావడం బ్యాంకు ఉద్యోగులను తీవ్రంగా కలచి వేసిందన్నారు. ఈ దాడి నాగరిక సమాజంపై ఒక మచ్చ అని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. శాంతి, ఐక్యత, పురోగతి కోసం ప్రయత్నిస్తున్న సమాజంలో ఇటువంటి ఉగ్రవాద చర్యలకు స్థానం లేదన్నారు. అన్ని రూపాల్లో ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వం గట్టిగా చర్యలు చేపట్టాలని, బ్యాంకు ఉద్యోగులందరం కేంద్ర ప్రభుత్వానికి సంఘీభావంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎపిటిబిఇఎఫ్ అధ్యక్షులు టి.రవీంద్రనాథ్, సంయుక్త కార్యదర్శి పి.వి. కృష్టారావు, ఉప ప్రధాన కార్యదర్శులు సమద్ ఖాన్, ఉదయ్ భాస్కర్, అజయ్ కుమార్, ఐబిఓఎ ప్రధాన కార్యదర్శి ఫణి కుమార్ పాల్గొన్నారు.



తిరువనంతపురంలో శుక్రవారం కేరళ మీడియా అకాడమీని సందర్శించిన తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డికి కేరళ మీడియా అకాడమీ చైర్మన్ ఆర్.ఎస్.బాబు సత్కారం

## గ్రామపంచాయతీ పాలన పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి సీతక్క

ప్రజాపక్షం/హైదరాబాద్: రైల్వే రిటైర్డ్ అధికారి కె.వి.రావు రచించిన గ్రామపంచాయతీ పరిపాలన పుస్తకాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క సచివాలయంలోని తన చాంబర్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. భారతదేశంలో పంచాయతీరాజ్ చరిత్ర మొదలుకుని తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, గ్రామ సభలు, సర్పంచ్, ఉప సర్పంచ్ ఎన్నికలు, అర్హతలు, సర్పంచ్, సెక్రెటరీ నిధులు విధులు, గ్రామపంచాయతీలో పన్నులు నిధుల వినియోగం, గ్రామ పంచాయతీ ట్రిబ్యునల్, గ్రామ ప్రగతి ప్రణాళికలు తదితర సమగ్ర విషయాలను క్రోడీకరించి పుస్తకాన్ని రూపొందించిన రచయిత కె.వి.రావును ఈ సందర్భంగా మంత్రి సీతక్క అభినందించారు. గ్రామపంచాయతీ పాలనపై అవగాహన పెంచుకునేందుకు ఈ



పుస్తకం ఎంతగానో దోహద పడుతుందన్నారు. భారత రాజ్యాంగం 75వ వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా స్థానిక ఎన్నికలకు తెలంగాణ సమాయత్తం అవుతున్న సమయంలో ఇలాంటి పుస్తకం రావడం ఎంతో ఉపయోగకరమన్నారు.

## ఐక్య కమ్యూనిస్టుల ఉద్యమాలతో సామ్రాజ్యవాద ఓటమి సాధ్యం

### క్యూబా రాయబారి జువాన్ కార్లోస్ మార్సన్ అగ్విలెరా

ప్రజాపక్షం/హైదరాబాద్ : అమెరికాతో పోల్చుకుంటే క్యూబా ప్రజాస్వామ్యం గొప్పదని భారత్‌లో క్యూబా రాయబారి జువాన్ కార్లోస్ మార్సన్ అగ్విలెరా అన్నారు. ప్రపంచంలోనే సూపర్ పవర్‌గా, అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకుంటున్న అమెరికాలో ప్రస్తుతం ఆర్థిక సంక్షోభం, నిరుద్యోగం, సామాజిక అసమానతలు నెలకొన్నాయన్నారు. క్యూబాలో సింగిల్ పార్టీ ప్రభుత్వమే అయినా 45 శాతం మహిళలకు, 30 ఏళ్ల వయస్సు ఉన్న వారికి 20 శాతం, పౌరుగువారిని ప్రోత్సహించేందుకు 50 శాతం చట్టసభలలో అవకాశం కల్పించడం ద్వారా గొప్ప ప్రజాస్వామ్య దేశంగా క్యూబా పేరు తెచ్చుకుందని ఆయన అన్నారు. సిపిఐ, సిపిఐ(ఎం) సంయుక్త ఆధ్వర్యంలో క్యూబా సంఘీభావ సదస్సు శుక్రవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సిపిఐ(ఎం) జాతీయ కార్యవర్గ సభ్యులు జ్యోతి, సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. క్యూబా భారత్ మైత్రిపై పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జువాన్ కార్లోస్ మార్సన్ అగ్విలెరా మాట్లాడుతూ అమెరికా నుండి క్యూబా కు సులభతరంగా విమానాల రాకపోకలు లేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రెండు కోట్ల మంది క్యూబా ప్రజలు అమెరికాలో ఉంటున్నారని, వారు డబ్బులు పంపించడాన్ని కూడా అమెరికా అడ్డుకుంటుందన్నారు. విమానాల రాకపోకలపై ఆంక్ష లు విధించడంతో ఇబ్బందిగా మారిందన్నారు. నార్త్ కోరియా, ఇరాన్, భారత్ లాంటి దేశాలతో వాణిజ్య సంబంధాలు పెట్టుకోకుండా ఆంక్షలు విధిస్తుందన్నారు. ట్రంప్ అధికారం చేపట్టిన అనంతరం క్యూబాపై ఆంక్షలు మరింత ఎక్కువ అయ్యాయన్నారు. సిపిఐ త్వరలోనే 100 సంవత్సరాల వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఇటీవల సిపిఐ(ఎం) జాతీయ మహాసభల సందర్భంగా క్యూబాకు సంఘీభావం తెలుపుతూ తీర్మానం చేయడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సిపిఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన బేబీకి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. భారత్‌కు తాత్కాలిక రాయబారిగా పనిచేస్తున్నానని, కానీ తాను క్యూబా కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యునిగా ఉన్నానని, ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ సంవత్సరం తాము క్యూబా 65 వార్సికోత్సవాన్ని జరుపుతున్నామని తెలిపారు. నెహ్రూ కాలం నుంచి 1959 నుంచి భారత్‌తో క్యూబాకు మంచి సంబంధాలు ఉన్నాయని, 1973, 1983 రెండు సార్లు ఫిడెల్ క్యాస్ట్రో భారత్‌ను సందర్శించారని గుర్తు చేశారు. అలీనయోధ్యమంలో ఫిడెల్ క్యాస్ట్రో కీలకపాత్ర పోషించారన్నారు. 1960లో దశకంలో ఐక్యరాజ్య



సమితికి క్యాస్ట్రో వెళ్లారని, కేవలం పెద్ద దేశాలతో సంబంధాలు ఏర్పాటు చేసుకోవడం మాత్రమే కాకుండా పేద దేశాలకు కూడా వెళ్లాలని చెప్పారన్నారు. ఇండియాలో ఉన్న సిపిఐ, సిపిఐ(ఎం)లతో చాలా సత్సంబంధాలు కలిగి ఉన్నామన్నారు. పెట్టుబడిదారి సామ్రాజ్యవాదాన్ని ఓడించాలంటే కేవలం ఐక్య కమ్యూనిస్టు ఉద్యమాల ద్వారానే సాధ్యమవుతుందన్నారు. అందులో భాగంగానే ఇండియాతో కలిసి అనేక సందర్భాల్లో పనిచేస్తున్నామన్నారు. అంతర్జాతీయ స్థాయిల్లో అనేక సెమినార్లు, సమావేశాల్లో పాల్గొనడం ద్వారా ప్రపంచమంతా కూడా కమ్యూనిస్టు ఉద్యమాన్ని పెంపొందించే దిశగా పనిచేస్తున్నామని తెలిపారు. క్యూబా సంఘీభావంగా భారతదేశంలో గత రెండు మూడు దశాబ్దాలుగా అమెరికా దాష్టికాన్ని ఎదుర్కోవడంలో క్యూబా చేస్తున్న ప్రయత్నాలన్నిటికీ కూడా ఇండియా నుంచి తమకు పెద్ద ఎత్తున మద్దతు లభిస్తుందని, అలాంటి సహకారానికి తాము చాలా సంతోషపడుతున్నామన్నారు. వి.ఎస్.బోస్ మాట్లాడుతూ క్యూబాలో కమ్యూనిజం లేకుండా సామ్రాజ్యవాద అమెరికా ఎన్ని ప్రయత్నాలు చేసినా ధైర్యంగా క్యూబా నిలబడడం కమ్యూనిస్టు ఉద్యమానికి గర్వకారణమన్నారు. క్యూబాపై అమెరికా అనేక ఆంక్షలతో ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. రష్యా ఉక్రెయిన్, ఇజ్రాయిల్‌పాలస్తీనాల మధ్య అమెరికానే యుద్ధం రాజేసిందన్నారు. యుద్ధాలకు ఊసిగొల్పడం, ఆయుధాలను అమ్ముకోవడం అమెరికా కుటిల నీతికి నిదర్శనమన్నారు. గతంలో అలీనోద్యమం నడిస్తే, ప్రస్తుతం ప్రధాని మోదీ ఆలింగన విధానం నడుస్తుందన్నారు. సోషలిస్ట్ బ్లాక్ రావాలని, ప్రపంచ కమ్యూనిస్టు పార్టీలు చర్చించాలని, మనిషిని మనిషి దోచుకునే పరిస్థితులు పోవాలన్నారు. జాన్ వేస్లీ మాట్లాడుతూ కరోనా సమయంలో క్యూబా వైద్యులు ప్రపంచనాన్ని ఆదుకున్నారని తెలిపారు. ప్రపంచంలో సామ్రాజ్యవాదంతో అమెరికా ప్రభుత్వాలను పడగొట్టడం, కూలగొట్టడం చేస్తుందన్నారు. అలాంటి అమెరికా ఆంక్షలకు తట్టుకుని క్యూబా కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కొనసాగించడం గొప్ప విషయమన్నారు. డబ్బులు ఇచ్చిమరీ క్యూబాలో అమెరికా టెర్రిరిజాన్ని ఊసిగొల్పుతుందని మండిపడ్డారు. చివరకు ఆహార ధాన్యాల దిగుమతిపై కూడా ఆంక్షలు విధించడం దారుణమన్నారు. విద్య, వైద్యం పూర్తిగా ఉచితంగా అందిస్తుందని తెలిపారు. సభలో ఉభయ కమ్యూనిస్టు పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## "హిందుస్తాన్ జిందాబాద్.. పాకిస్తాన్ ముర్దాబాద్"

### చార్మినార్ వద్ద మార్మోగిన నినాదాలు



ప్రజాపక్షం/హైదరాబాద్: పహల్గామ్ ఉగ్రదాడిని నిరసిస్తూ హైదరాబాద్ మక్కా మసీదులో శుక్రవారం జరిగిన ప్రార్థనల్లో ఎంఐఎం ఎపి అసదుద్దీన్ ఒవైసీతో పాటు ముస్లింలు పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం చార్మినార్ వద్దకు చేరుకున్న వీరంతా "హిందుస్తాన్ జిందాబాద్ పాకిస్తాన్ ముర్దాబాద్" అనే నినాదాలు పెద్ద ఎత్తున చేశారు. ఈ సందర్భంగా చార్మినార్, మక్కామసీదు పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉగ్రదాడిపై కేంద్ర ప్రభుత్వ తీసుకుంటున్న కఠిన చర్యలపై ఒవైసీ మద్దతు తెలిపారు. శుక్రవారం ప్రార్థనల కోసం మసీదుకు వచ్చిన వారికి అసదుద్దీన్ ఒవైసీ స్వయంగా నల్ల బ్యాడ్జీలను పంపిణీ చేశారు. తాను కూడా చేతికి నల్ల బ్యాడ్జీ ధరించారు. పహల్గామ్ ఉగ్రదాడికి వ్యతిరేకంగా నిరసన తెలిపేందుకు అందరూ నల్ల బ్యాడ్జీలు ధరించాలని ఆయన అక్కడి వారికి పిలుపునిచ్చారు. ఉగ్రవాద చర్యలను తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఉందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. పహల్గామ్ ఉగ్రదాడి విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన వైఖరిని తాను సమర్థిస్తున్నట్లు ఒవైసీ ఈ సందర్భంగా వెల్లడించారు. అయితే, ఇదే సమయంలో పాకిస్తాన్‌కు నీటి సరఫరా నిలిపివేయాలనే వాదనలపై ఆయన స్పందిస్తూ, ఒకవేళ నీటిని నిలిపివేస్తే, ఆ నీటిని ఎక్కడ నిల్వ చేస్తారని కేంద్రాన్ని ప్రశ్నించారు.






తిరువనంతపురంలో జరిగిన సిపిఐ జాతీయ కౌన్సిల్ సమావేశంలో తెలంగాణ రాష్ట్రం సిపిఐ తరఫున చర్చలో పాల్గొన్న సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు

## నాణ్యమైన విద్యకు సంస్కరణలు అవసరం

### ఎస్‌టియుటిఎస్



ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు పలు సంస్కరణలు అవసరమని ఎస్‌టియుటిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యం.పర్వత్ రెడ్డి, జి.సదానందం గౌడ్‌లు అన్నారు. తెలంగాణ విద్యా కమీషన్ చైర్మన్ ఆకునూరి మురళి ఇటీవల విద్యారంగంలో సమూల మార్పులను సూచి స్తూ పలు విప్లవాత్మక సూచనలతో ప్రభుత్వానికి సమర్పించిన నివేదికపై కాచిగూడలోని ఎస్‌టియు భవన్‌లో సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్ షాప్‌లో 33 జిల్లాల నుండి ఎస్‌టియుటిఎస్ ముఖ్య బాధ్యులు, విషయ నిపుణులు పాల్గొన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో తరగతి గదికి ఒక ఉపాధ్యాయున్ని నియమించడం, మెరుగైన సౌకర్యాల కల్పన, రవాణా ఫెసిలిటీ, ఎన్‌రోల్‌మెంట్ పెరుగుదల, వృత్తి నైపుణ్య విద్యా కోర్సుల అమలు, పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీల బలోపేతం, కరికులం, భాషా సామర్థ్యాల పెంపు, మూల్యాంకనం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించడం జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఆట సదయ్య, దాసరి శ్రీధర్, ఎల్.ఎం.ప్రసాద్, బి.రవి, జుట్టు గజేందర్, సాబిర్ అలీ, రామ సుబ్బారావు, విశ్వశాంతి, రమ్య పాల్గొన్నారు.

## రెవెన్యూ మంత్రి పేరిట వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరు అరెస్ట్

### అధికారాన్ని దుర్వినియోగపరిస్తే కఠిన చర్యలు
### మంత్రి పొంగులేటి హెచ్చరిక



హైదరాబాద్ : రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్సనల్ అసిస్టెంట్ ( పిఎ)లమని చెప్పి అమాయకులను మోసగిస్తున్న ఇద్దరు వ్యక్తులను నాగోల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన బుస్సా వెంకట రెడ్డి (34), మచ్చ సురేష్ (30) హైదరాబాద్ నాగోల్‌లో నివాసముంటున్నారు. వీరు మంత్రి పిఎలమంటూ రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఫోన్లు చేసి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ విషయాన్ని మంత్రిగా దృష్టికి వచ్చిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన పోలీసులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఇక నుండి తన పిఎలమంటూ ఎవరైనా ఫోన్ చేస్తే, ఎలాంటి చిన్న అనుమానం కలిగినా సచివాలయంలోని తన కార్యాలయం 040–23451072/040– 23451073 నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రజలకు సూచించారు. ఎవరైనా ఈ విధంగా అధికారాన్ని దుర్వినియోగపరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా బిఆర్‌ఎస్ ఎప్పుడూ ప్రజాపక్షమే

### మాజీ మంత్రి హరీష్‌రావు

ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి : తెలంగాణ ఉద్యమానికి సిద్దిపేటకు పేగుబంధం ముడిపడి ఉందని ... ఈ పాదయాత్ర రేపటి బిఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రావటానికి విజయయాత్రగా కాబోతుందని మాజీ మాజీ మంత్రి హరీష్‌రావు అభిప్రాయం వ్యక్తం చేశారు. నాడు సిద్దిపేట నుండి కెసిఆర్ సైకిల్ యాత్ర చేపట్టి వరంగల్ సభకు ఊళ్లను ఊళ్లు కదిలించారన్నారు. చాల పార్టీలు పుడుతుంటాయి.. పోతుంటాయని బిఆర్‌ఎస్ లక్ష్యాన్ని ముద్దాడిందన్నారు. కెసిఆర్ అనే ఒక గొంతు కోట్ల గొంతులను ఏకం చేసిందన్నారు. 14 ఏళ్ల ఉద్యమం,.10 ఏళ్ల ప్రభుత్వం ఏడాదిన్నరగా ప్రతిపక్షం ఏ పాత్ర అయిన బిఆర్‌ఎస్ తెలంగాణ పక్షమన్నారు. శుక్రవారం సిద్దిపేట రంగధాంపల్లి అమరవీరుల స్థూపం వద్ద వెయ్యి మంది విద్యార్థి, యువకులతో పాదయాత్రను అమరవీరులకు నివాళ్లు అర్పించి జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. ఈసందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ సిద్దిపేట నుండి ఎల్కతుర్తి బిఆర్‌ఎస్ రజతోత్సవ సభకు పాదయాత్రలో బయలుదేరిన విద్యార్థి, యువ మిత్రులకు, ఉద్యమకారుకు, బిఆర్‌ఎస్ ఉద్యమకారులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. 44డిగ్రీల ఎండను లెక్క చేయకుండా వెయ్యి మంది 27వ వరంగల్‌లో జరిగే పార్టీ రజతోత్సవ సభకు స్వచ్ఛందంగా తరలివచ్చిన అందరికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఉద్యమానికి సిద్దిపేటకు అవినాభావ సంబంధం ఉందన్నారు. పాదయాత్ర విజయవంతం చేసేందుకు అందరు క్రమశిక్షణతో ట్రాఫిక్ ఇబ్బందులు జరుగకుండ నడువాలన్నారు. పాదయాత్రలో కాంగ్రెస్ అరాచకాలను ప్రజలకు వివరించాలని కోరారు. ప్రతిరోజు భోజన, రాత్రి భోజన సమయాల్లో మిమ్మల్ని కలుసుకుంటానన్నారు. పాదయాత్రకు ముందు పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి నివాళ్లు అర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. 25 ఏండ్ల పార్టీ ఆవిర్భావం సందర్భంగా 25 మీటర్ల జెండా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ రాష్ట్ర నేతలు కడవేర్గు రాజనర్సు, పూజల వెంకటేశ్వర్‌రావు, పాల సాయిరాం. మారెడ్డి రవీందర్‌రెడ్డి, కోల రమేశ్, ఎడ్ల సోమిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి. మచ్చ వేణుగోపాల్‌రెడ్డి. సంపత్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.




**తెలంగాణ ప్రభుత్వం, రోడ్లు మరియు భవనాల శాఖ**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B), జిల్లా R&B కార్యాలయం, సూర్యాపేట జిల్లా.
ఇ-ప్రొక్యూర్‌మెంట్ NIT No. 04/D1/PA to EE/SRPT/2025-26, 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు తేది: 22.04.2025
మల్లారెడ్డి గూడ నుండి ముక్త్యాల రోడ్ కి.మీ. 0/0 నుండి 2/8, 3/830 నుండి 5/0 & 11/0-14/800 వరకు రోడ్డు భద్రతా జోక్యాలకు అందించే పని కొరకు ఆన్‌లైన్ టెండర్లను ఆహ్వానించడమైనది. **అంచనా మొత్తం విలువ:** రూ.19.00లక్షలు. టెండరుదారులు బిడ్ డాక్యుమెంట్ల డౌన్‌లోడ్ కొరకు ఇ-మార్కెట్ ప్లేస్ అనగా www.eprocurement.gov.inలో 25.04.2025న మ.3.00గం.ల నుండి 28.04.2025న మ.3.00గం.ల వరకు అందుబాటులో ఉండును. **బిడ్ల స్వీకరణకు ఆఖరి తేది:** 28.04.2025న మ.3.30గం.ల వరకు మరియు అంతకు ముందు. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిల్లా R&B కార్యాలయం, సూర్యాపేట జిల్లా.
DIPR R.O. No. : 824-PP/CL/ADVT/1/2025-26, Date: 25-04-2025

ప్రజాపక్షం
శనివారం, ఏప్రిల్ 26

# మోదీ ముందున్న మార్గం?

జమ్మూ–కశ్మీర్‌లోని పహల్గాంలో టెర్రరిస్టు ముష్కరుల కాల్పుల్లో 26మంది టూరిస్టుల ప్రాణాలు బలిగొన్న ఘోరకలి జరిగి అప్పుడే మూడు రోజులు గడిచిపోయాయి. కశ్మీర్‌లో టెర్రరిస్టు దాడులు, టెర్రరిస్టుల ఏరివేత దశాబ్దాలుగా సర్వసాధారణ ఘటనలే. అయితే పహల్గాంలో టెర్రరిస్టులు హిందువులను ఏరికోరి హతమార్చిన తీరు ఇందులో మత కోణాన్ని చేర్చింది. యావత్ భారతీయుల హృదయాలు గాయపడ్డాయి. ప్రతిచర్యను ఆక్రోశించాయి. అదే ఆవేదనను పాలక, ప్రతిపక్ష పార్టీలు ఏకోన్ముఖంగా వ్యక్తం చేశాయి; టెర్రరిస్టు దాడిని ముక్తకంఠంతో ఖండిస్తూ, ప్రభుత్వం తీసుకునే ప్రతిచర్యలకు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం బిహార్‌లో బహిరంగసభలో ప్రసంగిస్తూ టెర్రరిస్టులను, వారి మద్దతుదారులను భూగోళం అంచువరకు వేటాడుతామని ప్రతినబూనారు. భారత వ్యతిరేక టెర్రరిస్టు ముఠాలను పెంచి పోషించే పాకిస్థాన్ ఎస్టాబ్లిష్‌మెట్ – అది ప్రభుత్వం కావచ్చు, సైన్యం కావచ్చు, ఐఎస్ఐ కావచ్చు, వాటి ప్రోత్సాహంతో కార్యకలాపాలు నిర్వహించే లస్కరే తోయిబా, జైషే మహమ్మద్ వగైరా మతోన్మాద సంస్థలు కావచ్చు – పహల్గాం పైశాచిక కృత్యం వెనుక ఉందనేది నిర్వివాదాంశం. పాకిస్థాన్ ప్రభుత్వం నంగనాచి విచారం వ్యక్తం చేయవచ్చు. పహల్గాం రాక్షసకాండ తదుపరి ఇరుదేశాల ప్రభుత్వాలు పరస్పరం తీవ్రమైన చర్యలు ప్రకటించాయి. భారత్ సింధు జలాల ఒప్పందాన్ని సస్పెండ్ చేసింది. భారత్‌నుంచి పాక్ జాతీయులందరూ స్వదేశం వెళ్లిపోవాలని ఆదేశించింది. ఇతర అన్ని చర్యలకన్నా సింధు జలాల ఒప్పందం నిలుపుదల పాకిస్థాన్‌ను తీవ్రంగా దెబ్బతీసే విషయం. అది సాగునీరు, తాగునీరు విడుదలను కుదిస్తుంది. ఈ భారత్ చర్యను యుద్ధం ప్రకటనగా పరిగణిస్తామని పాకిస్థాన్ ప్రకటించింది. సిమ్లా ఒప్పందాన్ని తిరస్కరించింది. భారత్ సర్జికల్ స్ట్రయిక్ లాంటి సాహసకృత్యానికి ఒడిగడితే తిప్పికొట్టేందుకు త్రివిధ దళాలను సిద్ధం చేసింది.

హిందూ టూరిస్టులపైనే గురిపెట్టి కాల్పులు జరిపిన ముష్కరుల పన్నాగం కశ్మీర్ సమస్య సజీవంగా ఉందని ప్రపంచానికి చెప్పటం కావచ్చు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత కశ్మీర్‌లో తీవ్రవాదాన్ని దాదాపు అణిచివేశామని, అభివృద్ధి పరుగులు తీస్తున్నదనే భారత ప్రభుత్వ బీరాలు అబద్ధాలని చాటిచెప్పటం కావచ్చు. హిందువులనే చంపటం ద్వారా భారత్‌లో హిందువులను రెచ్చగొట్టి హిందూ–ముస్లిం మతకలహాలతో కల్లోలం సృష్టించటం కావచ్చు. వారి వలలో చిక్కుకోకుండా దౌత్యమార్గాల్లో పాకిస్థాన్ మెడలు వంచటం, సరిహద్దుల్లో ఉగ్రవాదుల శిబిరాలను ధ్వంసం చేయించటం, ఆర్థికంగా నష్టపరచటం వగైరా చర్యలు సత్ఫలితాలిస్తాయి. ఇస్లామిక్ టెర్రరిజం విషయంలో పాకిస్థాన్ అడ్డా అని యావత్ ప్రపంచానికి తెలుసు. అందువల్ల పాకిస్థాన్‌ను దెబ్బతీయటానికి అంతర్జాతీయ సమాజంలో మన దేశానికున్న సద్భావాన్ని నేర్పుగా వినియోగించుకోవటం అవసరం. అయితే టెర్రరిస్టులు ఏదైతే కోరుకుంటున్నారో అందుకు పావుగా ఉపకరించే శక్తులకు మన దేశంలో కొదవలేదు. పాలక బిజెపి హిందూత్వ పేరుతో గత దశాబ్దంగా సాగిస్తున్న ముస్లిం వ్యతిరేక ద్వేష ప్రచారం అటువంటి శక్తులకు జంకుగొంకు లేకుండా చేసిన వాస్తవాన్ని విస్మరించరాదు. టెర్రరిస్టు మూకలు కాల్పులు జరుపుతుంటే తన అశ్వారూఢుడైన హిందువును కాపాడటానికి తన ప్రాణాన్ని పణంగా పెట్టిన ముస్లిం త్యాగం ఈ శక్తులకు కనిపించదు. కశ్మీర్‌లో ఎప్పుడు ఎక్కడ తీవ్రమైన టెర్రరిస్టు చర్య జరిగినా సంఘ్ పరివార్, దాని అనుయాయి అల్లర చిల్లర సంస్థలకు భారత యూనివర్శిటీల్లోని కశ్మీరీ విద్యార్థులపై దాడులు చేయటం పరిపాటి అయింది. అటువంటి అవాంఛనీయశక్తులను ప్రభుత్వం తన మన అని చూడకుండా అణచివేయాలి. ఇతర ప్రాంతాల్లోని కశ్మీరీయులకు రక్షణ కల్పించాలి, భరోసా ఇవ్వాలి.

ప్రధాన సమస్య సీమాంతర ఉగ్రవాదం, దానికి సహాయమందిస్తున్న పాకిస్థానీ ఏజన్సీలు. 2021 లో పార్లమెంటు భవనంపై టెర్రరిస్టు దాడి నేపథ్యంలో 2002 మే/జూన్‌లో పాకిస్థాన్‌పై దాడికి భారత్ సైన్యం సర్వసిద్ధం చేయబడింది. యుద్ధం అనివార్యం అనే స్థితిలో అమెరికా సీనియర్ అధికారి రిచర్డ్ ఆర్మిటేజ్, విదేశాంగ మంత్రి కొలిన్ పావెల్‌లు పాకిస్థాన్‌నుండి టెర్రర్ శిబిరాలు ధ్వంసం చేస్తామనే హామీ పొంది ప్రధాని వాజ్‌పేయికి నచ్చజెప్పి యుద్ధ ప్రయత్నాలు విరమింపజేశారు. ఇప్పుడు భారత్ స్థితి అంతర్జాతీయంగా నాటికన్నా ఎంతో మెరుగ్గా ఉంది. పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రధాని మోదీ అమెరికా తదితర దేశాల సహాయం పొందవచ్చు. యుద్ధం దేనికీ పరిష్కారం కాదు. టెర్రరిజం మానవాళికి శత్రువు. దాన్ని అంతం చేయటానికి యుద్ధం పరిష్కారం కాదని అంతర్జాతీయ ఘటనలు పాఠం చెబుతున్నాయి.

# బెంగాల్‌లో ఆర్ఎస్ఎస్ పన్నాగం విఫలం

**అరుణ్ శ్రీవాస్తవ**

బెంగాల్‌లో అధికసంఖ్యాకుల మతతత్వ ఉద్వేగాలను రేకెత్తించి, రాష్ట్రాన్ని జాతుల హింసకు వేదికగా మార్చడానికి ఆర్ఎస్ఎస్ రచించిన సమగ్ర వ్యూహం పూర్తిగా అమలు కాకముందే కుట్ర బట్టబయలైంది. ఏప్రిల్ 11న జరిగిన హింసాత్మక ఘటనల్లో ఇద్దరు మరణించిన తర్వాత, ముర్షిదాబాద్‌లోని హిందువులు, ముస్లింలు తాము ఒక మందుపాతర మీద నడుస్తున్నామని గ్రహించి, నిశ్శబ్దంగా వెనక్కితగ్గారు.

అయినప్పటికీ, ఆర్ఎస్ఎస్ ఒక పెద్ద పొరపాటు చేసిందనేది యదార్థం. తమ ప్రణాళిక ఇంత అవమానకరంగా విఫలమవుతుందని ఆర్ఎస్ఎస్ నాయకత్వం ఊహించలేకపోయింది. బిజెపి రాష్ట్ర నాయకత్వంతో పోటీ పడే క్రమంలో ఆర్ఎస్ఎస్ రాష్ట్ర నాయకులు మమతా బెనర్జీ రాజకీయ చతురతను సరిగ్గా అంచనా కట్టలేకపోయారు. హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీలలో సాధించిన ఎన్నికల విజయాల మాదిరిగానే బెంగాల్‌లో కూడా తమ వ్యూహం విజయం సాధించిపెడుతుందని వారు నమ్మారు. కానీ వారి కుట్ర విఫలమైంది.



టిఎంసి అధ్యక్షురాలు మమతా బెనర్జీ ఆర్ఎస్ఎస్ ప్రణాళికను తెలుసుకుని, అది విస్ఫోటంగా మారి బెంగాలీ సామాజిక, సాంస్కృతిక విలువలకు తీవ్ర నష్టం కలిగించటానికి ముందుగా, దానిని నిర్వీర్యం చేశారు. తమకు అందిన సంకేతాలను రాష్ట్ర పోలీసులు తీవ్రంగా పరిగణించి, వెంటనే చర్య తీసుకుని ఉంటే మొదటి రెండు రోజుల్లో జరిగిన సంఘటనలు కూడా జరిగి ఉండేవి కావు.

బెంగాల్ ప్రజలకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాసిన నాలుగు పేజీల బహిరంగలేఖలో కుట్ర గుట్టును విప్పారు. రాష్ట్రం లో అల్లర్లను, తప్పుడు ప్రచారం ద్వారా విభేదాలను సృష్టించడానికి కాషాయ దళం కుట్ర పన్నుతోందని ఆమె ఆరోపించారు. శాంతిని పాటించాలని, ఈ 'ప్రమాదకరమైన ఉచ్చు' లో పడొద్దని ఆమె అందరికీ విజ్ఞప్తి చేశారు. ముర్షిదాబాద్ మత ఘర్షణలకు కొద్దిగా ముందు కొందరు బిజెపి అనుకూల అంతర్గత వ్యక్తులు ఈ కుట్ర గురించి రాష్ట్ర పరిపాలనా యంత్రాంగానికి తెలియజేశారు.

ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ పది రోజుల రాష్ట్ర పర్యటన సందర్భంగా ఎన్నికల వ్యూహం బ్లూప్రింట్‌ను ఆర్ఎస్ఎస్ సిద్ధం చేసింది. ఆర్ఎస్ఎస్ అధినేతను కలవరపరిచిన రెండు అంశాలు ఏమిటంటే; హిందువులు తాము ఆర్ఎస్ఎస్‌తో ఉన్నట్లు గుర్తింపబడడానికి, తమ ఆకాంక్షల ప్రతినిధిగా దాన్ని అంగీకరించడానికి విముఖత చూపడం; రెండవది, మమతా బెనర్జీ వెనుక ముస్లిం ఓట్ల ఏకీకరణ. సీనియర్ నాయకులు, ప్రత్యేకించి ఉత్తర బెంగాల్‌కు చెందిన ప్రచారకులు పాల్గొన్న ఆ సమావేశంలో బెంగాలీ హిందువులకు, ఆ ప్రాంతంలోని ముస్లింలకు కూడా చేరువ కావాలని భాగవత్ సూచించారు.

2024 లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర బెంగాల్ ముస్లింలు టిఎంసికి వ్యతిరేకంగా ఓటు వేశారు. జనాభాలో ముస్లింలు దాదాపు 30 శాతం ఉన్నారు. ముస్లిం జనాభాలో చీలిక వస్తే తమ ప్రణాళిక విజయవంతమవుతుందని ఆర్ఎస్ఎస్ భావిస్తోంది. ఆ పరిస్థితిలో మమతా బెనర్జీ ఈ ప్రాంతంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కచ్చితంగా ఓడిపోతారు. ఉత్తర బెంగాల్‌లో హిందువులకు చేరువయ్యేందుకు ఉత్తర భారత రాష్ట్రాల నుండి కొంతమంది ఆర్ఎస్ఎస్ ప్రచారకులను, సీనియర్ స్థాయి కార్యకర్తలను నియమించారనే వాస్తవం నుంచి పరిస్థితి తీవ్రతను అంచనా వేయవచ్చు. మమతా బెనర్జీ పట్ల ముస్లింల అసంతృప్తిని ఉపయోగించుకోవాలని ఆర్ఎస్ఎస్ భావించింది. బెంగాలీ ముస్లింలు మమతా బెనర్జీకి బలమైన మద్దతుదారులుగా ఉన్నారు. కానీ ఇటీవల వారు అసంతృప్తికి గురవుతున్నారు. దిగువ స్థాయిలో టిఎంసి అవినీతి కూడా వారిని ప్రభావితం చేసింది. ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ (ఐఎస్ఎఫ్) ముస్లింల గొంతుగా అవతరించిన తర్వాత ఈ మార్పు స్పష్టంగా కనిపించింది. ఐఎస్ఎఫ్‌కు పెద్ద సంఖ్యలో బెంగాలీ ముస్లింల మద్దతు ఉంది. ఫుర్‌ఫురా షరీఫ్ పీర్ యొక్క మజార్‌ను అజ్మీర్ దర్గా షరీఫ్ తర్వాత రెండవ అత్యంత పవిత్రమైన సూఫీ పుణ్యక్షేత్రమని బెంగాలీ ముస్లింలు నమ్ముతారు. ఫుర్‌ఫురా మొదటి పీర్ అయిన ముహమ్మద్ అబూ బాకర్ సిద్ధిఖీ వారసులైన ఇద్దరు ఇస్లామిక్ మత గురువులు ఐఎస్ఎఫ్‌ను స్థాపించారు. ఇది ఒక మతపరమైనరాజకీయ పార్టీ. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఐఎస్ఎఫ్‌కు కాంగ్రెస్, సిపిఐ(ఎం)తో ఎన్నికల అవగాహన ఉంది. అయితే ఆ ఎన్నికల్లో పెరుగుతున్న బిజెపి ప్రభావాన్ని చూసి భయపడిన ముస్లింలు టిఎంసికే ఓటు వేశారు. అయినా ఐఎస్ఎఫ్ తన ఇతర భాగస్వాముల కంటే ఎక్కువ ముస్లిం ఓట్లను పొంది, అసెంబ్లీలో ఆ కూటమి నుండి ఒక్క స్థానాన్ని గెలుచుకుంది.

ఏప్రిల్‌లో జరిగిన అల్లర్లకు వక్ఫ్ సవరణ బిల్లు పునాది వేసింది. ఐఎస్ఎఫ్, ఇతర ముస్లిం గ్రూపుల మద్దతుదారులు కలతచెంది దానిని ముస్లింలకు అవమానంగా, వారి షరియత్ జీవన విధానంపై దాడిగా భావించారు. ముస్లింలకు చేరువకావడానికి, వారి ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి అప్పటికే ప్రణాళికతో సిద్ధంగా ఉన్న ఆర్ఎస్ఎస్ ఈ పరిస్థితిని ఉపయోగించుకుంది. సాధారణంగా మమతా బెనర్జీతో ఉన్న రాష్ట్రంలోని ముస్లింలు రెండు రాజకీయ వైఖరులతో చీలిపోయారు. మొదటిది, కొంతమంది దానిని తమ ఆర్థిక సాధికారత, లాభాల కోసం ఉపయోగించుకోవాలని భావిస్తున్నారు. రెండవ వర్గం, టిఎంసిని తమ ప్రస్తుత అధికారాలు, భద్రతను కాపాడే సాధనంగా చూస్తున్నారు.

ఆర్ఎస్ఎస్ ప్రణాళిక స్థానిక హిందువులపై పెద్దగా ప్రభావం చూపలేదు. దానికి బెంగాల్ హిందువులు దూరంగా ఉండటానికి రెండు అంశాలు కారణం. అవి స్వాతంత్ర్యం తర్వాత బెంగాల్‌కు వలస వచ్చిన హిందువులపై ఆర్ఎస్ఎస్ ఎక్కువగా ఆధారపడటం, ఒకప్పుడు గణనీయమైన సంఖ్యలో బెంగాలీ హిందువులు ఉన్న అనేక విలాసవంతమైన ప్రాంతాలు ఇటీవలి సంవత్సరాలలో చేతులు మారాయి. ఇప్పుడు అవి బెంగాలీయేతర హిందువుల నివాసాలుగా మారాయి. కలకత్తా శివారు ప్రాంతాలు కూడా తమ ఆర్థిక, సామాజిక స్వభావాన్ని మార్చుకున్నాయి.

ఒబిసి, ఇబిసి జనాభాలో పెద్ద పెరుగుదల కనిపిస్తున్నప్పటికీ, బెంగాల్ రాజకీయ వ్యవస్థపై ఆర్ఎస్ఎస్, బిజెపిలు నియంత్రణ సాధించడానికి వారు ఇంకనూ వాటికి చేయి అందించలేదు. బెంగాలీ హిందువులు తమ హిందుత్వ తత్వాన్ని అంగీకరించారని ఆర్ఎస్ఎస్ చెప్పుకుంటోంది. కానీ అది తప్పుడు కథనం. వలస వచ్చిన బెంగాలీయేతర ప్రజలే దాని ప్రధాన మద్దతుదారులు. ఈ ఏడాది బెంగాల్‌లో 3000 రామ్ నవమి ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించినట్లు ఆర్ఎస్ఎస్ పేర్కొంది. కొంతమంది రాజకీయ నిబద్ధత కలిగిన బెంగాలీ హిందువులు ఈ ర్యాలీలలో పాల్గొనటం వాస్తవం. అయితే ఎక్కువగా పాల్గొన్నవారు బెంగాలీయేతర హిందువులు. ర్యాలీల సంఖ్య పెరగడం రాష్ట్రంలో వారి జనాభా పెరుగుదలను కూడా సూచిస్తుంది.

నిస్సందేహంగా గత 11 సంవత్సరాల మోదీ పాలనలో రాజకీయ దృశ్యం మారింది. మత–రాజకీయ కార్యకలాపాలు ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. కానీ ఒక పరిణామాన్ని స్పష్టంగా చూడాలి. ఈ పెరుగుదల బెంగాలీయేతరులు హిందుత్వ తత్వాన్ని అంగీకరించారని అర్థం కాదు. వారు తమ లాభాల కోసం, తమ వర్గ ప్రయోజనాలను నెరవేర్చుకోవడానికి ఆర్ఎస్ఎస్, బిజెపిని ఉపయోగించుకుంటున్నారు. రామ్ నవమి ఊరేగింపుల సంఖ్య సహజంగానే పెరగడం, హనుమాన్ దేవాలయాలు పుట్టుకరావటంబట్టి బెంగాల్‌లో ఆర్ఎస్ఎస్ బలం పెరిగినట్లు భావించకూడదు.

నిజమైన కాషాయ కార్యకర్తల కంటే బిజెపి ఫిరాయింపుదారులే రాజకీయ వాతావరణాన్ని ఎక్కువగా కలుషితం చేశారు. అసలైన కార్యకర్తలు ఇప్పటికీ పాత హిందూ సిద్ధాంతాన్ని విశ్వసిస్తారు, దుర్గామాతను పరమదైవంగా భావిస్తూనే ఉన్నారు. కానీ సువేందు అధికారి వంటి నాయకుల నేతృత్వంలోని ఫిరాయింపుదారులకు, భౌతిక ప్రయోజనాలు, రాజకీయ అధికారాన్ని పొందడానికి 'జై శ్రీరామ్' నినాదం మాత్రమే మార్గం. ఈ ఫిరాయింపుదారులే రామ్ నవమి ర్యాలీలు, హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించడానికి ప్రధా న ప్రేరణ శక్తిగా ఉన్నారు. ఈ వ్యక్తులు మతపరమైన ఆచారాలలో రాజకీయ సందేశాలను చొప్పించడం ద్వారా తమ గుర్తింపును చాటుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

ముస్లింల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. 'మనం', 'వారు' అనే రాజకీయాలు పెరుగుతున్న వైషమ్యానికి మూలంగా ఉన్నాయి. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, 'మనం', 'వారు' అనే అంశం వారి సమాజాలలో చీలికలు సృష్టించేందుకు కారణమైంది. ముర్షిదాబాద్, మాల్దా, దినాజ్‌పూర్ జిల్లాలు ముస్లింలు మెజారిటీగా ఉన్న జిల్లాలు. ఇక్కడ బిహార్ నుండి వచ్చిన వలస హిందువులు కూడా గణనీయమైన సంఖ్యలో ఉన్నారు.

2016లో తృణమూల్‌కు 51 శాతంగా ఉన్న ముస్లింల మద్దతు 2021లో 75 శాతానికి పెరిగింది, అయితే బిజెపికి హిందువుల మద్దతు 2016లో 12 శాతం నుండి 2019లో 57శాతానికి పెరిగి, ఆ తర్వాత 2021లో 50శాతానికి తగ్గింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో అది మరో 12 శాతం తగ్గింది. ఇది ఆర్ఎస్ఎస్‌ను కలవరపాటుకు గురిచేసింది. అత్యంత బలమైన శక్తిగా ఎదిగి అధికారాన్ని చేజిక్కించుకోవాలనే ప్రయత్నంలో అది ఎంతకైనా తెగించడానికి సిద్ధంగా ఉంది. బెంగాల్‌లో మార్చి/ఏప్రిల్ 2026లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. ఏడాది కంటే తక్కువ సమయం ఉంది. 2026 ఎన్నికల్లో హిందూ ఓటర్లను బిజెపి వైపు తిప్పుకోవడానికి మిగిలిన 11 నెలల్లో ఆర్ఎస్ఎస్ ఇతర కార్యక్రమాలపై పనిచేయవచ్చు. ఆర్ఎస్ఎస్‌కు బెంగాల్‌లో విశ్రాంతి తీసుకోవడానికి సమయం లేదు. మోహన్ భాగవత్ భావిస్తున్నట్లుగా అంగ, వంగ, కళింగ (బిహార్, బెంగాల్, ఒడిషా)లను సంఘ్ పరివార్ పాలించాలి. ప్రస్తుతం వంగ మినహా అంగ, కళింగ బిజెపి పాలనలో ఉన్నాయి. మమతా బెనర్జీ అధికారంలో ఉన్నంతవరకు అది ఎంత కష్టమైనా సరే, ఆర్ఎస్ఎస్ దృష్టి ఇప్పుడు 2026 అసెంబ్లీ ఎన్నికల్లో వంగను స్వాధీనం చేసుకోవడంపైనే ఉంది.

# రాజ్యాంగ పరిధిలో శాసన, కార్యనిర్వాహక, న్యాయశాఖలు

రాజ్యాంగంలోని ముఖ్యమైన మూడు అంగాలైన కార్యనిర్వాహక, శాసనసభ మరియు న్యాయవ్యవస్థల మధ్య సహకారం, సమన్వయం ఉండాలి, కానీ వీటిమధ్య కాలానుగుణ ఘర్షణ చోటు చేసుకోవటం దురదృష్టకరం. మొదటగా, తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి, శాసనసభ ఆమోదించిన 10 బిల్లులను రాజ్యాంగం ప్రకారం ఆమోదం తెలపకుండా మూలానపడేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జె.బి. పార్దీవాలా, జస్టిస్ ఆర్. మహదేవన్ తమ తీర్పులో ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్‌కు బిల్లులను ఎక్కువ కాలం ఏదో ఒక నిర్ణయం తీసుకోకుండా నిలిపివుంచే అధికారం లేదని చెప్పారు. అసాధారణ సందర్భాల్లో మాత్రమే గవర్నర్ బిల్లులను రాష్ట్రపతికి పంపాలని న్యాయమూర్తులు చెప్పారు. ఈ సందర్భంగా గవర్నర్ అలాగే రాష్ట్రపతి ఇద్దరి ప్రత్యేక అధికారాల విషయంలో సుప్రీంకోర్టు సమీక్ష జరిపింది. 1987లో కూడా శాసనసభ ఆమోదించిన బిల్లును గవర్నర్ ఆమోదించలేదు. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లింది, సుప్రీంకోర్టు గవర్నర్‌ను తీవ్రంగా మందలించింది. అయినా మన గవర్నర్‌లలో కొందరి ప్రవర్తన తీరు మారలేదు. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ను కూడ ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ నానా ఇబ్బందులూ పెట్టారు. సుప్రీంకోర్టు సూచనలు, సలహాల కంటే వారిని గవర్నర్లుగా నియమించిన కేంద్రంలోని అధికార పార్టీకి విధేయత చూపటం మేలు అన్నట్లుగా ఉంది ఆ గవర్నర్‌ల తీరు. అయితే, ఇప్పుడు సుప్రీంకోర్టు మూడు నెలల్లోపు అటువంటి బిల్లులను ఆమోదించాలని, గవర్నర్‌తో పాటు రాష్ట్రపతిని కూడా ఆదేశించ డం ద్వారా సుప్రీంకోర్టు తన అధికారాన్ని అతిక్రమించినట్లు కనిపిస్తోంది. ఇప్పుడు చర్చ ఏమిటంటే, దానికి అలా చేసే అధికారం ఉందా? లేదా? అనేది సమస్యగా ఉంది. కనీసం, దానికి కాలపరిమితిని నిర్ణయించాల్సిన అవసరం లేదు. అది పార్లమెంటు మాత్రమే చేయగల రాజ్యాంగ సవరణకు దారి తీయవచ్చు అని కొందరు. సుప్రీం కోర్టు రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తన అధికారాన్ని ఉపయోగించుకుంది అని మరికొంద రు నిపుణులు పరస్పర భిన్నంగా వాదిస్తున్నారు. రాజ్యాంగ విషయాలలో సుప్రీంకోర్టు తన న్యాయ సమీక్షాధికారాన్ని ఉపయోగించకుండా మౌనంగా ఉండలేదు. రాజ్యాంగ విషయంలో చట్టాన్ని వ్యాఖ్యానించటం దాని విధి. ఇప్పుడు, అసలు తప్పు తమిళనాడు గవర్నర్‌దే అయినా, ఇతరులు జాగ్రత్తగా వ్యవహరించి ఉండవచ్చు. గతంలో, ఇందిరాగాంధీ ప్రభుత్వం స్థిరపడిన ఆచారాలతో, ముఖ్యంగా రాష్ట్రాల ప్రాథమిక హక్కులకు సంబంధించిన విషయాలలో నిరంతర సంఘర్షణకు గురైనప్పు డు, హోం మంత్రిత్వ శాఖ కీలక మధ్యవర్తి పాత్ర పోషించడంతో విభేదాలు నిశ్శబ్దంగా పరిష్కరించబడ్డాయి. అరుదుగా ఇటువంటి విషయాలు న్యాయవ్యవస్థ జోక్యం కోసం వచ్చాయి. కానీ గత మూడు దశాబ్దాలుగా ఈ శైలి అనవసరమైన ఘర్షణ, వ్యాజ్యాల ద్వారా భర్తీ చేయబడింది. పర్యవసానంగా, కొందరు గవర్నర్ల మాదిరిగానే, సుప్రీంకోర్టు కూడా ఇప్పుడు క్రియాశీల పాత్రను పోషిస్తోంది. శాసనసభల విషయానికొస్తే, అవి బాక్సింగ్ లేదా రెజ్లింగ్ రింగులుగా మారుతున్నాయి. కార్యనిర్వాహకవర్గం పాలకపార్టీ సైద్ధాంతిక లక్ష్యాలను అనుసరిస్తోంది. అది ఘర్షణలను మరింత తీవ్రతరం చేసింది. మూడు రాజ్యాంగ అంగాలు చెక్స్ అండ్ బ్యాలెన్స్ పద్ధతిలో పరస్పర సహకారం, సమన్వయంతో తమపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి తమను తాము మంచి ఉదాహరణగా చూపించుకోవాలి.

**డాక్టర్ బైశెట్టి కవిత,**
అసిస్టెంట్ ప్రొఫెసర్ (పొలిటికల్ సైన్స్)
కెజిసి, హన్మకొండ.

# సింగరేణి మెడికల్ అటెండెన్స్ రూల్స్ సవరించాలి

లేఖ

కోల్ ఇండియాలో సవరించిన మెడికల్ అటెండెన్స్ రూల్స్ సింగరేణిలో అమలు పరచాలని సింగరేణి ఉద్యోగులు, మాజీ ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. గత సంవత్సరం డిసెంబర్‌లో ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్‌లో జరిగిన వేజ్ బోర్డ్ స్టాండర్డ్ డైజేషన్ కమిటీలో జరిగిన ఒప్పందం మేరకు ప్రస్తుతం గుర్తించిన గుండె జబ్బు, క్షయ, క్యాన్సర్, కుష్టు, పక్షవాతం, మూత్రపిండ జబ్బులు, ఎయిడ్స్, మెదడు సంబంధించిన వ్యాధులతోపాటు లివర్ సిర్రోసిస్ వ్యాధిని కూడా దీర్ఘకాలిక వ్యాధి గా గుర్తించారు. దీనివలన మెడికల్ బోర్డ్ నిర్ధారణ చేసేవరకు కార్మికుని మూల వేతనం, కరువు భత్యం, ప్రత్యేక కరువు భత్యంలో యాభై శాతం చెల్లిస్తున్నారో అదే విధంగా లివర్ సిర్రోసిస్ వ్యాధికి కూడా ప్రత్యేక సెలవుతో కూడిన వేతనం చెల్లించవలసి వస్తుంది. కార్మికుల ఆహార అలవాట్లు, అధిక శ్రమ, ప్రకృతి విరుద్ధ పని స్థలాలు, అవిశ్రాంతి, నిద్ర లేమి, అలసట వలన ఈ లివర్ సిర్రోసిస్ వ్యాధి బారిన పడుతున్నారు. కావున సింగరేణి యాజమాన్యం ఈ వ్యాధిని దీర్ఘకాలిక వ్యాధిగా గుర్తించాలి. రిటైర్డ్ కార్మికుల సిపిఆర్ఎంఎస్ మెడికల్ కార్డులో కూడా లివర్ సిర్రోసిస్ వ్యాధిని దీర్ఘకాలిక వ్యాధి జాబితాలో చేర్చి అవైద్య సౌకర్యం అందించాలని విశ్రాంత కార్మికులు వేడుకుంటున్నారు.

**ఆళవందార్ వేణు మాధవ్**

# క్షేత్రస్థాయిలో అందరికీ మేలుచేసే చట్టం భూ భారతి!



ఉజ్జిని రత్నాకర్ రావు
9490952646

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానంలో భూభారతి రికార్డ్స్ ఆఫ్ రైట్స్ 24(ఆర్వోఆర్) చట్టం తీసుకొచ్చింది. ఈ చట్టంతో భూ వివాదాలు ఇక ఉండవని, భూ యజమానులకు, ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలన్న లక్ష్యంతోని ఈ చట్టాన్ని రూపొందించామని భూ భారతి పోర్టల్‌ను అంబేద్కర్ జయంతి రోజున ఆవిష్కరిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.

'తెలంగాణ ప్రాంతంలో వందల ఏళ్ల నుంచి భూమి చుట్టూనే పోరాటాలు జరిగాయి. నాడు కొమరం భీమ్ 'జల్ జంగల్ జమీన్' నినాదంతో పోరాటాలు చేసినా.. నిజాం కు వ్యతిరేకంగా జాగిర్దారి, దేశ్ముఖ్, భూస్వామ్య దొరల కబంధహస్తాల నుంచి... భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తికోసం చేసిన పోరాటాలు.. లక్షల ఎకరాలు పంచిన చరిత్ర తెలంగాణలో ఉన్నది. ఆ పోరాటాల నేపథ్యంలోనే రక్షిత కౌలుదారీ చట్టాలు, ఇనం దారి చట్టాలు, భూ సంస్కరణల చట్టాలు వచ్చాయి. ఈ చట్టాలను కాపాడటానికి భూ కమతాలకు సంబంధించిన రికార్డుల మెయింటెనెన్స్ నిమిత్తం రెవెన్యూ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో అధికారంలోనికి వచ్చిన బిఆర్ఎస్ ప్రభుత్వం, గత కొన్ని దశాబ్దాలుగా వస్తున్న ఆర్ ఓ ఆర్ చట్టములో లోపాలను సరిదిద్దాలని, అవినీతికి, అక్రమాలకు తావు లేకుండా భూ యజమానులకు భరోసాగా ఉండే విధంగా కొత్త చట్టాన్ని ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చింది. కొత్త చట్టంపై లోతుగా పరిశీలన జరపకుండా, అభ్యంతరాలను స్వీకరించకుండా, గ్రామ స్థాయిలో దీనిపై చర్చించకుండా ధరణి పోర్టల్ ను తీసుకొచ్చింది. గ్రామస్థాయిలో ఉన్న రెవెన్యూ యంత్రాంగాన్ని లేకుండా చేసింది. దీంతో క్రింది స్థాయిలో భూమిని అమ్ముకోవాలన్న కొనుక్కోవాలన్నా అనేక సమస్యలు తలెత్తినవి. వీటిని పరిష్కరించేందుకు కూడా ధరణిలో వీలు లేకుండా చేశారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక సంవత్సరం పాటు దీనిపై వివిధ స్థాయిలలో సదస్సులు, సమీక్షలు చేపట్టి భూభారతి చట్టాన్ని రూపొందించింది. ఈ నూతన చట్టంపై గ్రామ, మండల, రెవిన్యూ డివిజన్ స్థాయిలో అవగాహన కల్పిస్తూ సదస్సు నిర్వహిస్తూ ప్రజల నుండి అభిప్రాయం సేకరిస్తూ వాటి ఆధారంగా జూన్ రెండు నుంచి అమలులోనికి తెస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

**ఈ చట్టంలో ప్రధాన అంశాలు:**

1. భూమి హక్కుల రికార్డులను మోసపూరితంగా మార్చి ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, దేవాదాయ, వక్ఫ్ భూములకు ఎవరైనా పట్టాలు పొందితే.. వాటిని రద్దు చేయాలంటూ రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్(సిసిఎల్‌ఏ)కు ఎవరైనా దరఖాస్తు చేయవచ్చని భూపార్టీ చట్టంలోని 16 వ సెక్షన్, 15వ నిబంధన స్పష్టం చేస్తుంది. ధరణిలో ఇలాంటి నిబంధన లేకుండే. ఇండ్ల స్థలాలకు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డు నిర్వహిస్తారు. భూదార్ కార్డులు జారీ చేస్తారు.

**గ్రామ రెవెన్యూ రికార్డుల వివరాలు నమోదు :**

గ్రామ రెవెన్యూ రికార్డుల గురించి ధరణి చట్టంలో ఎలాంటి ప్రస్తావన లేదు. ఈ లోపాన్ని సవరించి కొత్త భూభారతి చట్టంలో గ్రామ రెవెన్యూ రికార్డుల పేరుతో సెక్షన్ 13, నిబంధన 12 చేర్చారు. దీని ప్రకారం గ్రామ పహాణి, ప్రభుత్వ భూములు, నీటి వనరుల భూముల రికార్డులను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుంది. ఈ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్ ద్వారా నమోదు చేస్తారు. మ్యూటేషన్ జరిగిన ప్రతిసారి గ్రామ భూ లెక్కల్లో మార్పులు జరుగుతాయి. ఏటా డిసెంబర్ 31న గ్రామ రెవెన్యూ రికార్డులను ముద్రించి విడిగా భద్రపరుస్తారు. గతంలో ధరణి పోర్టల్ అమలులోనికి వచ్చిన తర్వాత గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ నిలిచిపోయింది.

**అప్పీలు వ్యవస్థ ఏర్పాటు :**

గతంలో ధరణి పోర్టల్‌లో క్రింది స్థాయి నుండి పై స్థాయికి అప్పీలు చేసుకునే అవకాశం లేకుండే. ఏమైనా కోర్టుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. నేడు తాసిల్దారులు జారీ చేసే పాస్ పుస్తకాల్లో లేదా భూధార్ పై ప్రజలు ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే రెవిన్యూ డివిజనల్ అధికారి( ఆర్డీవో )కి అప్పీలు చేసుకునేందుకు కొత్త చట్టంలో సెక్షన్ 15, నిబంధన 14 ద్వారా ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఆర్డీవో ఇచ్చిన తీర్పుపై అభ్యంతరాలు ఉంటే జిల్లా కలెక్టర్‌కు రెండోదశలో అప్పీలు చేసుకోవచ్చు. కలెక్టర్ ఇచ్చి తీర్పుపై అభ్యంతరాలు ఉంటే భూమి ట్రిబ్యునల్‌లో అప్పీలు చేసుకోవచ్చు.

* భూ భారతీ హక్కుల రికార్డుల్లో నమోదైన తర్వాత భూమి యజమాని రూ.300 రుసుము చెల్లించి దరఖాస్తు చేస్తే పట్టేదారు పుస్తకం జారీ చేస్తారు.

* భూమి యజమాని లైసెన్స్‌డ్ సర్వేయర్‌తో సర్వే చేయించుకుని పటం తయారు చేయించుకోవాలి. మండల సర్వేయర్ దాన్ని సరిచూచిన తర్వాత పట్టేదారు పుస్తకములో పటాన్ని నమోదు చేస్తారు.

* పాసు పుస్తకంలో హక్కుల రికార్డులు సరిగా లేవని అభ్యంతరాలు తెలుపుతూ దరఖాస్తు చేస్తే తహసిల్దార్ పరిశీలించి సరి చేస్తారు. దీనిపై కూడా అభ్యంతరాలు ఉంటే ఆర్డిఓకు, ఆ తర్వాత కలెక్టర్‌కు అప్పీలు చేసుకోవచ్చు.

* కాంగ్రెస్ సర్కార్ తీసుకొచ్చిన 'భూభారతి' లో అప్పీళ్లు, ట్రిబునళ్ల విఎల్‌వి, విరాసత్ తదితర అంశాలు బాగున్నవని రైతులు చెపుతున్నారు. అయితే వాలంటీర్ల వ్యవస్థ పైరవికారులకు, మధ్య దళారీలకు కేంద్రంగా మారుతుందనే ఆందోళన వ్యక్తం అవుతుంది. అలాగే కాస్తు కాలం ఏర్పాటు, సమగ్ర భూసర్వేను కొత్త చట్టంలో చేర్చకపోవడం పై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

భూభారతిలో విరాసత్ అమలు, సాంకేతిక వివాదాలకు అప్పీలు, న్యాయవివాదాలకు ల్యాండ్ ట్రిబ్యునల్స్ భూ సమస్యలకు పరిష్కారం చూపే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. విరాసత్ అమలుకు సంబంధించి కొత్త చట్టంలో అనేక మార్పులు చేశారు. ఏకకాల రిజిస్ట్రేషన్, ముటేషన్ విధానాన్ని రద్దు చేశారు.

గతంలో లాగా కాకుండా కుటుంబ సభ్యులందరికీ నోటీసులు జారీ చేసి వారి నుంచి అంగీకారం తీసుకున్న తర్వాతనే సెక్షన్ 4 ప్రకారం అమలు చేయనున్నారు. ఈ విధానంతో కుటుంబంలో గొడవలకు ఆస్కారం ఉండదని సమాచారం. రెండు దశలు ఏర్పాటు చేసిన అప్పీళ్ల వ్యవస్థ కూడా భూభారతి ద్వారా వచ్చిన పెద్ద మార్పుగా భావిస్తున్నారు. సాంకేతిక సమస్యలకు తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ స్థాయిలో అప్పీళ్ల వ్యవస్థ ఏర్పాటు చేస్తారు. న్యాయ వివాదాలకు ల్యాండ్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తారు. ఇవి జిల్లా స్థాయిలో ఏర్పాటు చేస్తారా? రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేస్తారా స్పష్టత రాలేదు. అయితే అప్పీళ్లకు ట్రిబ్యునల్స్ ఏర్పాటుతో ఇప్పటివరకు ఉన్న భూసమస్యలకు పరిష్కారం దొరకడంతోపాటు కొత్తగా సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం తక్కువగా ఉంటుందని నిపుణులు అంటున్నారు. భూ భారతిలో సాదా బైనమాలపై కూడా కీలక నిర్ణయం తీసుకున్నారు. 2014 జూన్ రెండుకు ముందు సాదా బైనామాల ద్వారా జరిగిన సెక్షన్ 6 కింద క్రమబద్ధీకరిస్తారు.

**విఆర్వో వ్యవస్థ పునరుద్ధరణ:**

ధరణి ఏర్పాటు తర్వాత తొలగించిన విఆర్వో, ఇఆర్‌ఏ వ్యవస్థ స్థానంలో విలేజ్ లెవెల్ ఆఫీసర్(విఎల్‌వో) వ్యవస్థను కొత్త చట్టంలో పొందుపరిచారు. వీరు గతంలో లాగా తమకు కేటాయించిన గ్రామాల్లో అందుబాటులో ఉండి ఆ భూ సమస్యల పరిష్కారంకోసం పనిచేస్తారు. ఇవన్నీ భూ భారతి ద్వారా వచ్చిన పెద్ద మార్పులని భావిస్తున్నారు.

**పార్ట్ బి భూములు పరిష్కారం దిశగా**

2017లో అప్పటి ప్రభుత్వం చేపట్టిన భూ దస్త్రాల పక్షాన సందర్భంగా 30కి పైగా వివాదాలు ఉన్న దాదాపు ఏడు లక్షల ఎకరాల భూములను 'పార్ట్ బి' అనే మాడ్యూల్ క్రియేట్ చేసి అందులో తోసేశారు. అప్పటి నుంచి సంబంధిత భూ యజమానులు ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. భూభారతి లో వీటిని పరిష్కరిస్తామని పేర్కొన్నా సాధ్యాసాధ్యాలపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం ఈ సమస్యలను సీరియస్ గా తీసుకొని పరిష్కారానికి పూనుకున్నా ఏండ్లు గడుస్తాయని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా రెవిన్యూ, అటవి, దేవాదాయ, వక్ఫ్ భూముల వివాదాలు మాత్రం సమగ్ర భూ సర్వే జరిగితేనే పరిష్కారం అవుతాయని భావిస్తున్నారు.

**రెవెన్యూ, అటవీ శాఖల మధ్య సమన్వయం :**

తెలంగాణలో దాదాపు రెండు లక్షల ఎకరాలు ఈ రెండు శాఖల మధ్య వివాదంలో ఉన్నాయి. ఈ భూములకు సంబంధించి రెవెన్యూ అటవీ శాఖలు పలు జిల్లాల్లో జాయింట్ సర్వే చేసిన, ఇరు శాఖల మధ్య 30 ఏళ్లుగా సమస్య కొలిక్కి రాలేదు. అలాగే వక్ఫ్ బోర్డ్ కు చెందిన భూముల్లో మూడింటి రెండు వంతులు భూములు అన్యాక్రాంతమయ్యాయి.

**కాస్తు కాలాన్ని పునరుద్ధరించాలి!**

గత బిఆర్ఎస్ సర్కార్ 2020లో ధరణి పోర్టల్ లో కాస్తు కాలాన్ని తొలగించింది. ఎవరు లీజుకు తీసుకున్న పట్టేదారును మాత్రమే అసలు యజమానిగా గుర్తించింది. పట్టేదారు ఎవరున్నా సరే భూమిని క్షేత్రస్థాయిలో దున్నే వ్యక్తిని కాస్తు దారు అంటారు. కొత్త రెవిన్యూ చట్టం భూభారతిలో కాస్తు కాలం తిరిగి పునరుద్ధరించుతామని కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల ముందు వాగ్దానం చేసింది. కాస్తుకాలం ఉండాలా వద్దా అనే అంశంపై వివిధ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కమ్యూనిస్టులు మాత్రం ఉండాల్సిందేనని పట్టుబడుతున్నారు. ధరణి ఏర్పాటు సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ కాస్తు కాలం పై వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ కాలం ఉంటే భూ సమస్యలు ఎప్పటికీ పరిష్కారం కావని తేల్చారు. ఎన్నికల సందర్భంలో కాస్తు కాలాన్ని పునరుద్ధరిస్తామన్న కాంగ్రెస్ దానిని భూ భారతిలో మాత్రం చేర్చలేదు.

**సమగ్ర భూ సర్వే నిర్వహించాలి**

రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించాలంటే సమగ్ర భూ సర్వే ఒకటే పరిష్కారం. ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న సరిహద్దు వివాదాలు పరిష్కారం అవుతాయి. గత సర్కార్ 1971 చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం ఉన్న కాస్తు కాలాన్ని తొలగించింది. ప్రస్తుత భూభారతి చట్టంలో ఈ వివాదాన్ని చేర్చలేదు.

తాతలు, తండ్రుల కాలం నుంచి భూమిని నమ్ముకున్న చిన్న, సన్నకారు రైతులకు అన్యాయం జరుగుతుంది. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్టుగా కాంగ్రెస్ సర్కార్ వెంటనే కాస్తు కాలాన్ని పునరుద్ధరించాలి. భూ వివాదాలు శాశ్వతంగా పరిష్కరించబడాలంటే సమగ్ర భూ సర్వేను వెంటనే ప్రభుత్వం చేపట్టాలి.

*(రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టంపై అవగాహన కలిగిస్తూ జిల్లా, మండల కేంద్రాల్లో రైతు సదస్సులు జరుపుతున్న నేపథ్యంలో )*

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## పాట్నా కోర్టుకు బాంబు బెదిరింపు



**పట్నా :** పట్నా కోర్టులో బాంబు పెట్టామంటూ శుక్రవారం అగంతకులు ఒక మెయిల్ పంపించారు. వివరాల్లోకి వెళితే శుక్రవారం ఉదయం జిల్లా కోర్టు జడ్జికి అతి సమీపంలో ఆర్‌డిఎక్స్ బాంబు పెట్టామని పట్నా సివిల్ కోర్టుకు ఒక మెయిల్ వచ్చిందని అడిషనల్ ఎస్‌పి దీక్ష తెలిపారు. దాన్ని ఆధారంగా చేసుకొని ఎటిఎస్, బాంబ్ డిస్పోజబుల్ స్క్వాడ్ టీమ్‌తో కలిసి కోర్టు ప్రాంగణంలో తనిఖీలు నిర్వహించామని, కానీ అక్కడ ఎలాంటి బాంబులకు సంబంధించిన ఆనవాళ్లు లేవన్నారు. ఎవరో ఆకతాయిలు బాంబు బెదిరింపులకు పాల్పడ్డారని వారిని త్వరలోనే పట్టుకొని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అడిషనల్ ఎస్‌పి తెలిపారు.

## తెరిచే ఉన్న కర్తార్‌పూర్ కారిడార్




**చండీగఢ్ :** పహల్గామ్ ఉగ్రదాడి తరువాత భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు నడుమ పాకిస్తాన్‌లోని కర్తార్‌పూర్ సాహిబ్ గురుద్వారాకు వెళ్ళే భక్తుల కోసం కర్తార్‌పూర్ కారిడార్‌ను తెరిచే ఉంచారు. సిక్కుమత వ్యవస్థాపకుడు గురు నానక్ దేవ్ చివరి రోజుల్లో నివసించిన గురుద్వారా దర్బార్ సాహిబ్‌ను భారతదేశంలోని గురుదాస్‌పూర్‌లో ఉన్న దేరా బాబా నానాక్ ఆలయాన్ని ఈ కారిడార్ కలుపుతుంది. శుక్రువారం నాడు సిక్కులు కర్తార్‌పూర్ కారిడార్ద్వారా గురుద్వారా దర్బార్ సాహిబ్‌లో ప్రార్థనలు చేశారు. ''ఈ కారిడార్‌ను భక్తుల కోసం తెరిచే ఉంచాలి'' అని షహీద్ భగత్‌సింగ్ నగర్ జిల్లాకు చెందిన సిక్కు భక్తుడు అన్నారు. కర్తార్‌పూర్ కారిడార్ 2019 నవంబర్ 19న గురునానక్ దేవ్ 550వ జయంతి రోజున ప్రారంభమైంది. ఏడాది పొడువునా పాకిస్తాన్‌లో ఉన్న చారిత్రక గురుద్వారాను భారతీయ భక్తులు దర్శించుకునేందుకు వీసా లేకుండా అనుమతిస్తారు. ఇరు దేశాల మధ్య ఒప్పందం ప్రకారం రోజుకు 5వేల మంది భక్తులను సరిహద్దు దాటి వెళ్ళేందుకు అనుమతిస్తారు. అయితే, తాజా పరిణామాల నేపథ్యంలో ఈ కారిడార్‌ను తెరిచే ఉంచుతారా? లేదా? అనే అంశంపై సిక్కు భక్తులలో ఆందోళన వ్యక్తమవుతోంది.

**పాకిస్తానీయులను పెళ్ళి చేసుకున్న మహిళలకు ఇక్కట్లు!**

పహల్గామ్ ఉగ్రదాడి తరువాత భారతదేశాన్ని 48 గంటల్లో విడిచిపోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో పలువురు పాకిస్తానీలు పంజాబ్ రాష్ట్రంలో అమృతసర్‌లోని అట్టారి–వాఘా సరిహద్దు నుంచి శుక్రవారం వారి స్వదేశానికి తిరుగుముఖం పట్టారు. అయితే, భారతదేశ పాస్ట్‌పోర్ట్ కలిగి పాకిస్తానీలను వివాహం చేసుకున్న కొంత మంది మహిళలు తమకు సరైన పత్రాలు ఉన్నప్పటికీ పాకిస్తాన్‌కు వెళ్లడంలో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. భారతదేశంలోని తమ బంధువులను కలుసుకునేందుకు వచ్చామని, అయితే పాకిస్తాన్ జాతీయులు 48 గంటల్లో దేశాన్ని విడిచిపోవాలడంతో వెనక్కి వెళ్లిపోవాల్సి వస్తుందన్నారు. పెళ్ళి చేసుకొని కరాచీకి వెళ్ళిపోయిన షానిజా అనే భారతీయ మహిళ తాను హృద్రోగి అయిన తన తల్లితో 15 రోజులు ఉండేందుకు ఢిల్లీకి వచ్చానని, అయితే, వెనక్కివెళ్లేందుకు తనను వెనక్కి వెళ్ళనివ్వడం లేదని, తన భర్త, మామ వాఘా సరిహద్దు వద్ద ఎదురుచూస్తున్నారని పిటిఐతో చెప్పారు. ఆమె తనకు భారత పాస్‌పోర్ట్ ఉన్నదని తెలిపారు. ఇద్దరు పిల్లలతో భారత్‌కు వచ్చిన మరో మహిళ కూడా తనను పాకిస్తాన్‌కు వెళ్ళేందుకు అనుమతించాలని డిమాండ్ చేశారు. ''నాకు భారత పాస్ట్‌పోర్ట్ ఉంది. నా ఇద్దరు పిల్లలకు పాకిస్తాన్ పాస్‌పోర్ట్‌లు ఉన్నాయి. మేము అన్ని పత్రాలను, నా పెళ్ళి సర్టిఫికెట్‌ను చూపించినా వారు వినడం లేదు. భారతీయ పాస్ట్‌పోర్ట్ ఉన్నవారిని అటు వైపు వెళ్ళనివ్వబోమని చెబుతున్నార''ని ఆమె అన్నారు. ''నేను నా పిల్లలను ఎలా తీసుకెళ్ళాలని'' ప్రశ్నించారు. ఇరవై ఏళ్ల క్రితం పాకిస్తాన్ వ్యక్తితో పెళ్ళి చేసుకొని అక్కడే నివసిస్తున్న అరూడా ఇమ్రాన్ కూడా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. తాను ఇప్పటికే పాకిస్తాన్ పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్నానని, తనతో వచ్చిన ఇద్దరు కుమార్తెలు పాకిస్తానీ పౌరులేనని, అన్ని పత్రాలు ఉన్న పాకిస్తాన్‌కు తిరిగి వెళ్లనివ్వడం లేదన్నారు. అరూడా ఇమ్రాన్ రాజస్తాన్‌లోని జోధ్‌పూర్‌లో నివసిస్తున్న తన తల్లిదండ్రులను చూసేందుకు వచ్చారు. పంజాబ్‌లోని మాలేర్‌కొట్లాలో తన తల్లిదండ్రులను చూసేందుకు రెండు నెలల క్రితం వచ్చిన రబియా అనే మరో మహిళదీ అదే పరిస్థితి. ఆమె మూడేళ్ళ క్రితం పాకిస్తాన్ వ్యక్తితో పెళ్ళి చేసుకొని అక్కడే ఉంటున్నారు. భారత పాకిస్తాన్ ఉన్న అఫ్షీన్ జహంగీర్ అనే మహిళ తనను పాకిస్తాన్‌కు తిరిగి వెళ్ళనీయకపోతే విషయం తాగుతానని బెదిరించారు.

## పుణెలో 111 మంది పాక్ జాతీయుల గుర్తింపు

**పుణె :** మహారాష్ట్రలోనే పుణెలో 111 మంది పాక్ జాతీయులు నివసిస్తున్నట్లు జిల్లా యంత్రాంగం గుర్తించింది. ఈనెల 27వ తేదీ నాటికి వారంతా భారత్ విడిచి వెళ్లాలని ఆదేశించింది. పాకిస్థాన్ పౌరులకు జారీ చేసిన అన్ని రకాల వీసాలు రద్దు చేసిన నేపథ్యంలో పుణెలో ఉండే పాక్ జాతీయులను వెళ్లిపోవాలని అధికార యంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది. అయితే మెడికల్ వీసాలకు మాత్రం మరో రెండు రోజుల గడువు ఉంది. కాగా, పుణె జిల్లా కలెక్టర్ జితేంద్ర దూది మీడియాతో మాట్లాడుతూ వీసా జారీ అధికారులు, పాస్‌పోర్టు కార్యాలయం నుంచి నుంచి పాకిస్థాన్ జాతీయుల డేటాను సేకరించామన్నారు. ఇప్పటి వరకు దాదాపు 111 మంది పాక్ జాతీయుల సమాచారం సేకరించామని, గడువు ముగిసే నాటికి అందరూ దేశం విడిచి వెళ్లాలని ఆదేశించామన్నారు. పర్యాటకం, వైద్య చికిత్స వంటి తదితర కారణాల కోసం వీసాలు జారీ అయ్యాయని చెప్పారు. అయితే వైద్య చికిత్స చేయించుకుంటున్న వారు మాత్రం ఈనెల 29వ తేదీ వరకు గడువు ఇచ్చామని చెప్పారు. ఇదిలా ఉండగా, ఛత్రపతి సంభాజీనగర్ పోలీసులు మాట్లాడుతూ 57 పాక్ జాతీయులు దీర్ఘకాలి వీసాలపై నివసిస్తున్నారని చెప్పారు. ఈ కేసులో తదుపరి ఆదేశాల కోసం కలెక్టర్ కార్యాలయం వేచి చూస్తోందని ఓ జిల్లా అధికారి వెల్లడించారు.



## జంతర్ మంతర్ వద్ద ఐవైసి తిరంగా ర్యాలీ

### పహల్గామ్ ఉగ్రదాడి బాధితులకు నివాళి

**న్యూఢిల్లీ :** పహల్గామ్ ఉగ్రదాడికి వ్యతిరేకంగా ఇండియన్ యూత్ కాంగ్రెస్ (ఐవైసి) ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తిరంగా ర్యాలీ నిర్వహించింది. బాధితులకు నివాళి అర్పించింది. ఐవైసి జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్, జాతీయ మీడియా ఇన్‌చార్జ్ వరుణ్ పాండేతో సహా అనేక మంది పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు జంతర్ మంతర్ స్క్వేర్ నుండి జంతర్ మంతర్ వరకు కొన్ని వందల మీటర్ల మేర ర్యాలీ నిర్వహించారు. త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తూ 'వందేమాతరం, భారత్ మాతా కీ జై' అంటూ నినాదాలు చేశారు. పాకిస్థాన్ చర్యలు ఖండించారు. మన దేశ ప్రజలను దారుణంగా హత్యచేసిన దోషులను తటస్థీకరించాలని తాము కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు భాను పిటిఐకి చెప్పారు. ఇప్పుడు దౌత్యం కాదు, ప్రత్యక్షంగా, కఠినంగా స్పందించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. దేశం మొత్తం సైన్యం, ప్రభుత్వానికి మద్దతుగా నిలిస్తుందని, అయితే ప్రతిస్పందన మాటల్లో కాకుండా సరిహద్దులో కనిపించాలన్నారు. గురువారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో కేంద్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీ తన స్పష్టమైన మద్దతును తెలియజేసిందన్నారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి ప్రభుత్వంతో సమన్వయం, సహకారం, భాగస్వామ్యం కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, తాము ఎప్పటికప్పుడు ఉగ్రవాదం, వేర్పాటువాదంతో పోరాడామని భాను చెప్పారు. ఉగ్రవాద దాడిని మానవత్వానికి వ్యతిరేక యుద్ధం అని ఆయన అభివర్ణించారు. మన దేశంలోని అంతర్గత ప్రాంతాలలోకి చొరబడటం, అమాయక ప్రజలను చంపడం, సరిహద్దు వెంబడి నక్కి ఉన్న ఉగ్రవాద సంస్థలకు పాకిస్తాన్ ప్రభుత్వం నుండి బహిరంగ మద్దతు లభించడం వల్లనే ఇదంతా సాధ్యమవుతుందన్నారు. ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేయాల్సిన అవసరం ఉందని, దౌత్యపరమైన ఒత్తిడి, సైనిక చర్య మధ్య సమతుల్యమైన కానీ నిర్ణయాత్మక విధానాన్ని అవలంబించాలని, ముఖ్యంగా ప్రతి అమరవీరుడి కుటుంబానికి న్యాయం జరగాలన్నారు. ఇది కేవలం దాడి కాదు, ఇది మానవత్వానికి వ్యతిరేకంగా జరిగిన యుద్ధమని, దీన్ని ఎలాగైనా గెలవాలన్నారు.

## 'లష్కరే' టాప్ కమాండర్ అల్తాఫ్ లల్లీ హతం?



**శ్రీనగర్ :** జమ్ముకశ్మీర్‌లో ఉగ్ర మూకలపై భద్రతా దళాలు తుపాకులు గర్జిస్తున్నాయి. తాజాగా లష్కరే టాప్ కమాండర్ అల్తాఫ్ లల్లీని మట్టుబెట్టాయి. పహల్గాం దాడిలో పాల్గొన్న వారి కోసం జల్లెడపడుతున్న భద్రతా దళాలకు బందీపోరాలో అల్తాఫ్ ఆచూకీ తెలిసింది. శుక్రవారం ఉదయం ఆర్మీపోలీసు దళాలు జాయింట్ ఆపరేషన్ చేపట్టాయి. ఈక్రమంలో ఉగ్రవాదులను గుర్తించడంతో ఎన్‌కౌంటర్ మొదలైంది. తొలుత ఓ ఉగ్రవాది గాయపడ్డాడు. ఆ తర్వాత భద్రతా దళాల్లోని అధికారి బాడీగార్డులకు తూటాలు తాకాయి. ఈక్రమంలో అల్తాఫ్‌ను మట్టుబెట్టాయి. ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది కశ్మీర్‌లో అడుగుపెట్టిన వేళ ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకోవడం గమనార్హం. పహల్గాంలో ఉగ్రదాడి వెనక లష్కరే చీఫ్ హాఫీజ్ సయీద్ పాత్ర నేరుగా ఉన్నట్లు దర్యాప్తు బృందాలు గుర్తించాయి. కశ్మీర్‌లో చురుగ్గా పనిచేస్తున్న మాడ్యూల్‌ను అతడే స్వయంగా నియంత్రిస్తున్నట్లు గుర్తించారు. దీనిలో అత్యధిక మంది విదేశీ ఉగ్రవాదులు, కొందరు మాత్రమే స్థానికులు ఉండేటట్లు చూసుకొన్నారు. వీరికి అండగా క్షేత్రస్థాయిలో సమాచార సేకరణ, లాజిస్టిక్స్, దాక్కొనేందుకు ప్రదేశాలు ఏర్పాటుచేసేందుకు కొందరు స్థానికులు పనిచేసేవారు. గత రెండేళ్లలో జరిగిన సోనమార్గ్, బూటపత్రి, గందర్బాల్ జరిగిన హైప్రొఫైల్ దాడుల్లో కూడా ఇవి పాల్గొన్నాయి. గతేడాది అక్టోబర్‌లో బూటపత్రిలో ఇద్దరు ఆర్మీ సిబ్బందిని హత్య చేసింది. అదే నెలలో సోనమార్గ్ సొరంగంలో పనిచేస్తున్న ఆరుగురు కార్మికులను కాల్చిచంపింది. ఈ ఉగ్ర బృందంలో కీలక సభ్యుడైన జునైద్ అహ్మద్ భట్ డిసెంబర్‌లో భద్రతా దళాలు దాచిగామ్ వద్ద ఎన్‌కౌంటర్ చేశాయి. మిగిలిన ఉగ్రవాదులు పారిపోయారు. ఆ తర్వాత ఈ బృందం చాలాకాలం అడవుల్లో ఎవరి కంటా పడకుండా గడిపింది. ఈ బృందం నేరుగా హాఫీజ్ సయీద్, అతడి డిప్యూటీ సైఫుల్లా నుంచే ఆర్డర్లు తీసుకొనేది. ఇంటెలిజెన్స్ బృందాల అంచనాల ప్రకారం వీరికి భావజాలంతోపాటు ఇతర ఏర్పాట్లు వ్యూహాత్మకంగా సలహాలు, సూచనలు పాక్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ, మిలిటరీ నుంచి వచ్చేవని తెలిపారు. ఈ ఉగ్రమూక పహల్గామ్‌లో మూడు ప్రదేశాల్లో అత్యధికమందిని చంపారు. ఈ ఉగ్రమూకలో హాషీమ్ మూసా, అలిభాయ్ పాక్ జాతీయులు. ఈ మొత్తం బృందంలో ప్రతి సభ్యుడిపైనా ప్రభుత్వం రూ.20 లక్షల రివార్డ్‌ను ప్రకటించింది.

## స్వాతంత్ర్య సమరయోధులను ఎగతాళి చేయొద్దు

### రాహుల్‌గాంధీకి సుప్రీంకోర్టు మందలింపు



**న్యూఢిల్లీ :** వీర్ సావర్కర్‌కు మహారాష్ట్ర ప్రజలు ఎంతో గౌరవం ఇస్తారని స్వాతంత్ర్య సమరయోధులను ఎగతాళి చేయడం తగదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. మళ్లీ ఇటువంటి వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం మందలించింది. దేశం కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధులపై ఎవరూ ఇటువంటి వ్యాఖ్యలు చేయడానికి అనుమతించమని పేర్కొంది. వారిని అపహాస్యం చేస్తే ఇకపై కోర్టు సుమోటోగా విచారణ చేపడుతుందని తెలిపింది. సావర్కర్‌పై వ్యాఖ్యల విషయంలో రాహుల్‌పై దాఖలైన కేసులో ఆయనపై క్రిమినల్ చర్యలను సుప్రీంకోర్టు నిలిపివేసింది. రాహుల్‌పై ఫిర్యాదు చేసిన నృపేంద్ర పాండేకు, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో తనకు జారీ చేసిన సమన్లను రద్దు చేయడానికి నిరాకరించిన అలహాబాద్ హైకోర్టు ఆదేశాన్ని రాహుల్ గాంధీ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. మహారాష్ట్రలో 2022లో మీడియా సమావేశంలో మాట్లాడిన రాహుల్‌గాంధీ.. వీర్ సావర్కర్ బ్రిటిష్ సేవకుడని, వారి నుంచి పెన్షన్ కూడా తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు స్వాతంత్ర్య సమరయోధుడైన వీర్ సావర్కర్‌ను కించపరిచేలా ఉన్నాయని ఆరోపిస్తూ నృపేంద్ర పాండే అనే వ్యక్తి యూపీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా రాహుల్ వ్యాఖ్యలు ఉన్నాయని అందులో పేర్కొన్నారు. అయితే, దీనిపై అనేకసార్లు విచారణకు గైర్హాజరవుతున్న నేపథ్యంలో ఉత్తర్‌ప్రదేశ్‌లోని న్యాయస్థానం (ఎసిజెఎం) రాహుల్‌కు రూ.200 జరిమానా విధించింది.

## సోనియా, రాహుల్‌కు నోటీసులివ్వలేం

### ఇడి అభ్యర్థనకు ఢిల్లీ కోర్టు తిరస్కరణ




**న్యూఢిల్లీ :** నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు నోటీసులు ఇచ్చేందుకు ఢిల్లీ కోర్టు నిరాకరించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అభ్యర్థనను న్యాయస్థానం తిరస్కరించింది. కొత్త చట్ట నిబంధనల ప్రకారం నిందితులను విచారించకుండా ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకోలేమని.. కాబట్టి విచారణకు హాజరయ్యేలా వారికి నోటీసులు ఇవ్వాలని ఇడి కోరింది. ఈ విషయంలో తాము ఏమీ దాచట్లేదని.. ఈ కేసు విచారణకు ముందు అభిప్రాయాన్ని వ్యక్తం చేయడానికి గాంధీ కుటుంబానికి అవకాశమిస్తున్నామని ఇడి అధికారులు తెలిపారు. నోటీసులు ఇచ్చే ముందు, ఏదైనా ఆర్డర్‌ను జారీ చేసేముందు అందులో ఏదైనా లోపం ఉందా అనే విషయాన్ని న్యాయస్థానం పరీక్షించాల్సి ఉంటుందని ప్రత్యేక న్యాయమూర్తి జస్టిస్ విశాల్ గోగ్నే అన్నారు. ఛార్జిషీట్‌లో సరైన పత్రాలు లేవని..ఆ పత్రాలను దాఖలు చేయాలని ఇడి అధికారులను న్యాయమూర్తి ఆదేశించారు. వాటిని పరీక్షించిన అనంతరం నోటీసుల జారీపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ కేసు విచారణను మే 2వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు కోర్టు పేర్కొంది. నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసిన ఇడి.. అందులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురి పేర్లను పేర్కొంది. ఇప్పటికే ఈ కేసుతో ముడిపడి ఉన్న ఆస్తుల స్వాధీనానికి నోటీసులు జారీ చేసిన ఈడీ అధికారులు.. తాజాగా కాంగ్రెస్ ఎంపిలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు ఆ పార్టీ నేతలు శామ్ పిట్రోడా, సుమన్ దుబే పేర్లతో ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ప్రాసిక్యూషన్ కంప్లయింట్ దాఖలు చేశారు. దీనిపై కోర్టు విచారణ చేపట్టింది.

## ఉగ్రదాడి భద్రతా లోపాలను ఎత్తిచూపుతోంది : పవార్



**పుణె :** కశ్మీర్‌లో ఉగ్రవాదం ముగిసిందని కేంద్రం చెబుతున్నప్పటికీ పహల్గామ్ ఉగ్రవాద దాడి భద్రతా లోపాలను చూపిస్తుందని ఎన్‌సిపి (ఎస్‌పి) చీఫ్ శరద్ పవార్ అన్నారు. తక్షణమే దిద్దబాటు తీసుకోవాలని సూచించారు. శుక్రవారం పవార్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ పహల్గామ్ వంటి సురక్షితమైన ప్రదేశంపై ఉగ్రదాడి జరిగిన దృష్ట్యా, కశ్మీర్‌లో ఉగ్రవాదం అంతమైందని ప్రకటించడంలో జాగ్రత్త వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఉగ్రవాద దాడి దేశానికి వ్యతిరేకంగా ఉన్నందున, ఎవరూ ఈ అంశాన్ని రాజకీయం చేయకూడదని సూచించారు. ఉగ్రదాడిపై చర్చించడానికి ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశానికి ఎన్‌సిపి (ఎస్‌పి) తరుపున ఎంపి సుప్రియా సూలే హాజరయ్యారన్నారు. ప్రభుత్వంతో సహకరించడానికి అన్ని పార్టీలు ఒక వైఖరి తీసుకున్నందు సంతోషంగా ఉందన్నారు. ఏ నిర్ణయం తీసుకున్నా, తము ప్రభుత్వంతో ఉంటామని, ఈ దాడిని ప్రభుత్వం మరింత తీవ్రంగా పరిగణించాలన్నారు. ఉగ్రవాద దాడికి నిఘా వైఫల్యం ఉగ్రవాద దాడికి దారితీసిందా అని విలేకరులు అడిగినప్పుడు ఆయన స్పందిస్తూ భద్రతా లోపాలు జరిగినట్లు కనిపిస్తోందని, దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆర్టికల్ 370 రద్దు ద్వారా కశ్మీర్‌లోని అన్ని సమస్యలు ముగిశాయని ప్రభుత్వం చిత్రించడానికి ప్రయత్నిస్తుందా అని ప్రశ్నించగా, రాజ్యాంగ నిబంధన రద్దు గురించి చెబుతున్నప్పుడు కశ్మీరీ ప్రజల అభిప్రాయం భిన్నంగా ఉందన్నారు. అయితే ఉగ్రవాద దాడి తర్వాత కశ్మీర్‌లో పర్యాటకం దెబ్బతింటుందని పవార్ భయాన్ని వ్యక్తం చేశారు. ఈ సమస్యను తీవ్రంగా పరిగణించాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించారు.

## ఇస్రో మాజీ చైర్మన్ కస్తూరిరంగన్ కన్నుమూత



**న్యూఢిల్లీ :** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ( ఇస్రో) మాజీ చైర్మన్ డా. కృష్ణస్వామి కస్తూరిరంగన్ బెంగళూరులోని తన నివాసంలో కన్నుమూశారు. శుక్రవారం ఉదయం ఆయన తుది శ్వాస విడిచినట్లు కుటుంబసభ్యులు వెల్లడించారు. కస్తూరిరంగన్ 1990–1994 వరకు యుఆర్ ఎసి డైరెక్టర్‌గా పనిచేశారు. అనంతరం ఆయన 9 ఏళ్లపాటు (1994–2003) ఇస్రో చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆయన హయాంలో ఇస్రో తొలి లూనార్ మిషన్‌కు అడుగులు పడ్డాయి. జెఎన్‌యు ఛాన్సలర్‌గా, కర్ణాటక నాలెడ్జ్ కమిషన్ చైర్మన్‌గా కస్తూరిరంగన్ పనిచేశారు. 2003–09 మధ్య రాజ్యసభ సభ్యుడిగానూ ఉన్నారు. అంతేకాకుండా ప్రణాళికా సంఘం సభ్యుడిగానూ సేవలందించారు. అలాగే, 2004 నుంచి 2009 మధ్య కాలంలో బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్‌కు డైరెక్టర్‌గా పనిచేశారు. మోదీ సర్కార్ తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం ముసాయిదా కమిటీకి అధ్యక్షుడిగా పనిచేశారు. కస్తూరిరంగన్ మృతిపట్ల ప్రధాని నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. ఆయన దార్శనిక నాయకత్వం, నిస్వార్థ సహకారం దేశానికి ఎల్లప్పుడూ గుర్తుండి పోతుందన్నారు. భారతదేశ అంతరిక్ష రంగాన్ని కొత్త శిఖరాలకు చేర్చారని కీర్తించారు. ఆయన నాయకత్వంలో ఇస్రో ప్రతిష్ఠాత్మక ఉపగ్రహ ప్రయోగాలను చేసిందని గుర్తు చేసుకున్నారు. ఇస్రో మాజీ ఛైర్మన్ మృతిపట్ల కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.


**సిఎం రేవంత్ రెడ్డి సంతాపం**

ప్రముఖ శాస్త్రవేత్త, ఇస్రో మాజీ చైర్మన్, పద్మ విభూషణ్ డాక్టర్ కృష్ణస్వామి కస్తూరి రంగన్ మృతి పట్ల తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి సంతాపం తెలియజేశారు. భారతీయ అంతరిక్ష పరిశోధనా రంగంలో కస్తూరి రంగన్ విశేష సేవలు అందించారని గుర్తుచేసుకున్నారు. 1994 నుంచి 2003 వరకు ఇస్రో ఛైర్మన్‌గా, ముఖ్యంగా పిఎస్‌ఎల్‌వి, జిఎస్‌ఎల్‌వి ప్రయోగాల్లో వారు పోషించిన పాత్ర దేశం మరిచిపోదని అన్నారు. రాజ్యసభ సభ్యుడిగా, జేఎన్‌యు వైస్ ఛాన్సలర్‌గా, కేంద్ర ప్రభుత్వ అంతరిక్ష విభాగం కార్యదర్శిగా, ప్రణాళికా సంఘం సభ్యుడిగా అనేక పదవుల్లో విశేష సేవలు అందించిన డాక్టర్ కస్తూరి రంగన్ మరణం దేశం ఒక గొప్ప ఖగోళ శాస్త్రవేత్తను కోల్పోయిందని పేర్కొన్నారు. భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సానుభూతిని తెలియజేశారు.

## ఉత్తర సిక్కింలో చిక్కుకుపోయిన పర్యాటకులు..

### గాంగ్‌టక్‌కు తిరుగుముఖం


### శరవేగంగా అధికార యంత్రాంగం సహాయక చర్యలు



**గాంగ్‌టక్ :** హిమాలయ రాష్ట్రం సిక్కింలోని చుంగ్‌థాంగ్‌లో గురువారం నాడు కొండచరియలు విరిగిపడిన ఘటన కారణంగా వందలాది పర్యాటకులు చిక్కుకుపోయారు. చిక్కుకుపోయిన పర్యాటకులు శుక్రవారం అధికార యంత్రాంగం సహాయంతో మంగాన్ వైపు ప్రయాణం ప్రారంభించారు. ఉత్తర సిక్కింలోని మంగాన్ జిల్లాలో ఉన్నటువంటి చుంగ్‌థాంగ్ సిక్కిం రాష్ట్ర రాజధాని గాంగ్‌టక్‌కు 100కి.మీ.దూరంలో ఉన్నది. గురువారం నాడు చుంగ్‌థాంగ్‌లో దాదాపు 200వాహనాలు చిక్కుకుపోయి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. వీరందరికీ ఒక గురుద్వారాలో షెల్టర్ కల్పించారు. చిక్కుకుపోయిన వందలాది పర్యాటకులను వాహనాలలో చుంగ్‌థాంగ్ నుంచి వయా సంగ్‌కలాంగ్ వద్ద పునర్నిర్మించబడిన బెయిలీ బ్రిడ్జి మీదుగా మంగాన్ జిల్లాకు తరలించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశామని అధికారులు చెప్పారు. మంగాన్ పట్టణానికి చేరుకున్న టూరిస్టులు ఆ తర్వాత అక్కడనుంచి గాంగ్‌టక్ దిశగా వెళ్లిపోయినట్లు వారు చెప్పారు.మంగాన్ జిల్లా కలెక్టర్ అనంత్ జైన్, జిల్లా ఎస్‌పి సోనం దెట్చు భుటియా చిక్కుకుపోయిన పర్యాటకులు వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకునేందుకు సహాయపడ్డారు.గురువారం కురిసిన భారీ వర్షాలమూలంగా బురద ప్రవహించి లాచెన్, లాచుంగ్ రోడ్లన్నీ మూసివేయబడ్డాయి. సాధ్యమైనంత వేగంగా మార్గాలను క్లియర్‌చేసే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని అధికారులు తెలియజేశారు. సిక్కిం గవర్నర్ ఓం ప్రకాష్ మాథుర్ మాట్లాడుతూ ఉత్తర సిక్కింలోని పలు ప్రాంతాలలో కొండచరియలు విరిగిపడిన సంఘటనా స్థలి నుంచి పర్యాటకులు అందరూ వారి వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకుంటున్నారని చెప్పారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఫుడ్ పాయిజన్

### 37 మంది పిల్లలు సహా 51 మందికి అస్వస్థత



**కోర్బా :** ఛత్తీస్‌గఢ్‌లోని కోర్బా జిల్లాలో వివాహ భోజనం తర్వాత ఫుడ్ పాయిజనింగ్ కారణంగా 37 మంది పిల్లలు సహా కనీసం 51 మంది అస్వస్థతకు గురయ్యారని పోలీసులు శుక్రవారం తెలిపారు. వారందరినీ కోర్బాలోని మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో చేర్పించామని, వారి పరిస్థితి నిలకడగా ఉందని ఒక అధికారి తెలిపారు. ఉర్గా పోలీస్ స్టేషన్ పరిధిలోని పహ్రిపారా గ్రామంలో గురువారం రాత్రి ఒక వివాహం జరిగిందని ఆయన చెప్పారు. వివాహ భోజనం తర్వాత, కొంతమంది వాంతులు, విరేచనాలు చేసినట్లు ఫిర్యాదు చేశారు. ఆసుపత్రిలో చేరిన వారిలో 14 మంది బాలికలు, 23 మంది బాలురు, 11 మంది మహిళలు, ముగ్గురు పురుషులు ఉన్నారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్ కన్వర్ తెలిపారు. వారందరి పరిస్థితి సాధారణంగానే ఉందని తెలిపారు. ఫుడ్ పాయిజనింగ్‌కు ఖచ్చితమైన కారణం ఇంకా నిర్ధారించబడలేదు. దర్యాప్తు జరుగుతోందని పోలీసు అధికారి తెలిపారు.

## సౌదీకి 100 బిలియన్ల ట్రంప్ ఆయుధ ప్యాకేజీ



**వాషింగ్టన్ :** మే నెలలో ట్రంప్ మూడు అరబ్ దేశాలలో పర్యటనకు వెళుతున్నారు. ఈ సందర్భంగా సౌదీ అరేబియాలో కూడా ఆయన పర్యటిస్తారు. ట్రంప్ అధికారంలోకి వచ్చాక ఆయన తొలి విదేశీ పర్యటన ఇదే. సౌదీ అరేబియాలో పర్యటన సందర్భంగా ఆ దేశానికి 100 బిలియన్ డాలర్లు విలువైన ఆయుధ ప్యాకేజీనీ ట్రంప్ ఆఫర్ చేస్తారని అమెరికా మీడియా పేర్కొంది. జోబైడెన్ గతంలో ఇలాంటి ప్యాకేజీని అమలు చేయడంలో విఫలమయ్యారు. సౌదీ,ఇజ్రాయెల్ సంబంధాల పునరుద్ధరణ చర్యల్లో ఆయన విఫలమయ్యారు. ఇప్పుడు ట్రంప్ సౌదీకి ఆయుధ ప్యాకేజీ ప్రతిపాదించనున్నారు. అమెరికా నుండి ఇతర దేశాలకు భారీగా ఆయుధాల ఎగుమతులు పెంచాలని ట్రంప్ యంత్రాంగం గట్టిగా కోరుకుంటున్నది. భారతదేశ ప్రధానమంత్రి మోదీ అమెరికా పర్యటన సందర్భంగా కూడా అమెరికా నుండి భారీగా ఆయుధాలు భారత్ కొనుగోలు చేస్తుందని ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. తైవాన్‌కు కూడా ట్రంప్ ఆయుధాలను భారీగా ఎగుమతి చేస్తున్నది.



# జనరల్

STATE & REGIONAL NEWS

## కెటిఆర్ కేసులో తీన్మార్ మల్లన్నకు నోటీసు

హైదరాబాద్ : మేడిపల్లి పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసును కొట్టివేయాలని బిఆర్‌ఎస్ కార్యానిర్వాహక అధ్యక్షుడు, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారకరామారావు వేసిన కేసులో ఎమ్మెల్సీ చింతపండు నవీన్‌కుమార్ అలియాస్ తీన్మార్ మల్లన్నకు హైకోర్టు నోటీసులు ఇచ్చింది.

ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్న తనకు వ్యతిరేకంగా నకిలీ వీడియోలతో ప్రతిష్టను దెబ్బతీశారని తీన్మార్ మల్లన్న ఫిర్యాదు చేశారు. దీనిపై మేడిపల్లి పోలీసులు కేటీఆర్, సూర్యాపేట బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డిలపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. దీనిని కొట్టేయాలంటూ ఆ ఇద్దరు నేతలు వేసిన పిటిషన్ జస్టిస్ మౌసమీ భట్టాచార్య శుక్రవారం విచారించారు. ప్రతివాదులైన తీన్మార్ మల్లన్న, పోలీసులకు నోటీసులు ఇచ్చిన హైకోర్టు, విచారణను జూన్ 13కు వాయిదా వేసింది.

## పహల్గామ్ ఉగ్ర ఘాతుకంపై భారత్ సమ్మిట్ తీవ్ర దిగ్భ్రాంతి

ఐక్యత.. సామరస్యం, రాజ్యాంగ విలువలపై దాడిగా ప్రకటన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పహల్గామ్‌లో జరిగిన అనాగరిక ఉగ్రవాద దాడిపై భారత్ సమ్మిట్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. హైదరాబాద్‌లో శుక్రవారం ప్రారంభమైన సదస్సులో పాల్గొన్న వంద దేశాలకు చెందిన ప్రగతిశీల పార్టీలకు చెందిన ప్రతినిధులు, ప్రముఖులు ఈ మేరకు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ''పహల్గామ్‌లో జరిగిన అనాగరిక ఉగ్రవాద దాడి పట్ల మేం తీవ్ర దిగ్భ్రాంతి చెందుతున్నాం. ఉగ్రదాడిలో 26 మంది అమాయక పౌరులు మరణించారు, అనేక మంది గాయపడ్డారు. భారత ప్రజలకు మేం సంఘీభావాన్ని తెలియజేస్తున్నాం. ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. శాంతియుత పౌరులపై ఇటువంటి క్రూరమైన చర్యలకు సమాజంలో స్థానం లేదు.. ఈ క్రూర దాడులు ఐక్యత, శాంతి, సామరస్యం అనే రాజ్యాంగ విలువలపై చేసిన ప్రత్యక్ష దాడి'' అని పేర్కొన్నారు.

## స్టీల్ రీబార్‌కు ప్రత్యామ్నాయంగా ఒలెక్ట్రా జిఎఫ్‌ఆర్‌పి రీబార్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మౌలిక సదుపాయాల రంగంలో ప్రముఖ ఎలెక్ట్రిక్ బస్సుల తయారీ సంస్థ ఒలెక్ట్రా కీలకమైన సాంకేతిక పురోగతిని సాధించింది. కాంక్రీట్‌లో వినియోగించే స్టీల్ రీబార్‌కు ప్రత్యామ్నాయంగా అత్యాధునిక గ్లాస్ ఫైబర్ రీఇన్‌ఫోర్స్డ్ పాలిమర్ రీబార్ (జిఎఫ్‌ఆర్‌పి)ని ఆవిష్కరించింది. ఈ ఆవిష్కరణ నిర్మాణ రంగంలో కాంక్రీట్ రీఇన్‌ఫోర్సమెంట్‌లో ఒక నూతన శకాన్ని నెలకొల్పటంతో పాటు, అసమానమైన బలం, మన్నిక , సుస్థిరతను అందిస్తుందని ఒలెక్ట్రా ప్రకటించింది. హైదరాబాద్‌లో జరుగుతున్న మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) వార్షిక బడ్జెట్ సమావేశాల్లో సంస్థ ఎండి పి.వి.కృష్ణారెడ్డి శుక్రవారం జిఎఫ్‌ఆర్‌పి రీబార్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఒలెక్ట్రా సిఎండి కె.వి.ప్రదీప్, మేఘా గ్రూప్ డైరెక్టర్లు సి.హెచ్.సుబ్బయ్య, బి. శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒలెక్ట్రా సిఎండి ప్రదీప్ మాట్లాడుతూ అత్యుత్తమ ప్రయోజనాలతో కూడిన ఒలెక్ట్రా జిఎఫ్‌ఆర్‌పి రీబార్ వినియోగం వల్ల ఖర్చు ఆదా అవుతుందన్నారు. నిర్వహణ వ్యయం తక్కువని, నిర్మాణాల జీవితకాలం గణనీయంగా పెరుగుతుందని, దీనిని ఇండస్ట్రియల్ ఫ్లోరింగ్, పేవ్‌మెంట్లు, వంతెన డెక్కు, ప్రీకాస్ట్ నిర్మాణాల్లో వినియోగించవచ్చని వివరించారు. పర్యావరణ అనుకూల తుప్పు పట్టని ఒలెక్ట్రా జిఎఫ్‌ఆర్‌పి సముద్ర సంబంధమైన ప్రాజెక్టులలో ఉపయోగించే సాధారణ ఉక్కుకు ప్రత్యామ్నాయంగా నిలుస్తుందన్నారు.

## రైతులు ధాన్యాన్ని శుభ్రంగా తీసుకువచ్చి మద్దతు ధర పొందాలి

**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి:** రైతులు తమ ధాన్యాన్ని శుభ్రంగా తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని, దళారులను నమ్మి మోసపోవద్దని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కన్స్యూమర్ ఫుడ్ అండ్ సివిల్ సప్లై జాయింట్ సెక్రెటరీ ప్రియాంక ఆల తెలిపారు. శుక్రవారం మెదక్ జిల్లా పర్యటనలో భాగంగా మెదక్ మండలంలో అదనపు కలెక్టర్ నగేష్‌తో కలిసి కోంటూరు, రాజ్ పల్లి, బాలనగర్ కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో డీఆర్డిఓ, సివిల్ సప్లై, వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులతో జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోళ్లు వేగంగా పూర్తి చేయాలని, జిల్లా కలెక్టర్, ఆదేశాల అనుసరిస్తూ సివిల్ సప్లై యంత్రాంగం మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

## భారతదేశపు ప్రపంచ ప్రొఫైల్‌ను నిర్మించడానికే

# 'భారత్ సమ్మిట్'



లింగ సమానత్వాన్ని, న్యాయాన్ని ముందుకు తీసుకెళ్లాలని వక్తలు ఉద్ఘాటన

**ప్రజాపక్షం /హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'భారత్ సమ్మిట్–2025' 'ప్రపంచ న్యాయం అందించడం' అనే థీమ్‌తో హైదరాబాద్‌లో శుక్రవారం ప్రారంభమైంది. ఈ సదస్సులో అంతర్జాతీయ రాజకీయ నాయకులు, విధాన నిర్ణేతలు, లింగ సమానత్వం, సామాజిక న్యాయం, సమ్మిళిత పాలనను ముందుకు తీసుకెళ్లడానికి కట్టుబడి ఉన్న న్యాయవాదులు పాల్గొన్నారు. లింగ సమాన త్వాన్ని, న్యాయాన్ని ముందుకు తీసుకెళ్లాలని వక్తలు నొక్కి చెప్పారు. తప్పుడు సమాచారం ప్రజాస్వామ్యాన్ని బెదిరిస్తుందని, డిజిటల్ అక్షరాస్యత, బలమైన సైబర్ చట్టాల కోసం కృషి చేయాలని వక్తలు ఉద్ఘాటించారు. భారతదేశపు ప్రపంచ ప్రొఫైల్‌ను నిర్మించడానికే 'భారత్ సమ్మిట్–2025' అని, మహిళల ఉపాధిని పెంచడానికి పన్ను ప్రోత్సాహకాలు ఇవ్వాల్సిన అవసరముందని మాజీ కేంద్ర మంత్రి సల్మాన్ ఖుర్షీద్ అన్నారు. పన్ను సంస్కరణలు, సార్వత్రిక పిల్లల సంరక్షణ కోసం మాజీ స్వీడన్ విదేశాంగ మంత్రి ఆన్ లిండే పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య విలువలను రక్షించడంలో భారత్ సమ్మిట్ ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. ఆఫ్‌లైన్‌లో చట్టవిరుద్ధమైనది ఆన్‌లైన్‌లో కూడా చట్టవిరుద్ధమని ఈయు పార్లమెంటు మాజీ సభ్యుడు మియాపెట్రా కుంపుల నాత్రి అన్నారు. డీప్‌ఫేక్ బెదిరింపును దిగ్విజయ్ సింగ్ విమర్శించారు. తాను ఎప్పుడూ చెప్పని మాటలు తనకు ఆపాదించబడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. 100 దేశాల నుండి 450 మందికి పైగా విదేశీ ప్రతినిధులు పహల్గామ్ బాధితుల పట్ల తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. సదస్సులో మాజీ కేంద్ర మంత్రి సల్మాన్ ఖుర్షీద్, మాట్లాడుతూ సామాజిక న్యాయం దృక్పథాన్ని సాధించడానికి డేటా, విశ్లేషణ చాలా అవసరమని, సారూప్యత కలిగిన దేశాలు గొప్ప మద్దతును చూపి ంచాయన్నారు. ప్రగతిశీల ఉదారవాద విలువలను కాం గ్రెస్ పార్టీ, తెలంగాణ ప్రభుత్వం గౌరవిస్తున్నాయని పేర్కొంటూ, రానున్న రోజుల్లో శిఖరాగ్ర సమావేశం ఒక సాధారణ లక్షణంగా మారుతుందని ఆశిస్తున్నా మన్నారు. ప్రపంచ క్రమం ఉదారవాద, ప్రగతిశీల ఆలోచనను స్వీకరిస్తుందని భావిస్తున్నామన్నారు.


'లింగ న్యాయం, స్త్రీవాద భవిష్యత్తు' అంశంపైజరిగిన ప్యానెల్ చర్చలో స్వీడన్ విదేశాంగ మాజీ మంత్రి ఆన్ లిండే, టాంజానియాలోని చామా చా మాపిండుజీ (సిసిఎం) పార్టీ నుండి సీనియర్ నాయకురాలు రబియా అబ్దల్లా, అర్జెంటీనాలోని సోషలిస్ట్ పార్టీ రాజకీయ నాయకురాలు మోనికా ఫీన్, హమీద్ మైసూన్, వేల్ అలాటూమ్, పనామా రిపబ్లిక్ మహిళా వ్యవహారాల మంత్రి మరియా అలెజాండ్రా పనాయ్, మంగోలియాకు చెందిన పార్లమెంటు సభ్యుడు ఉండ్రామ్ చిన్బత్, భారత సీనియర్ రాజకీయ నాయకులు సల్మాన్ ఖుర్షీద్, ఎం.ఎం.పల్లం రాజు ప్రసంగించారు. సమాజాలను ఉద్ధరించడంలో విద్య, చలనశీలత శక్తిని పల్లంరాజు నొక్కి చెప్పారు. మాజీ కేంద్ర మంత్రి సల్మాన్ ఖుర్షీద్ మాట్లాడుతూ మహిళల ఉపాధిని పెంచడానికి పన్ను ప్రోత్సాహకాల కోసం వాదించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి భారీ పరిశ్రమలలో మహిళా భాగస్వామ్యం లేకపోవడాన్ని ప్రశ్నించారు. 'ప్రతి రంగంలో మహిళలు భాగం కావాలి. దీనికి సమాధానం సరైన చట్టాలు మాత్రమే కాదు సరైన మనస్తత్వం, ఈ లక్ష్యం కోసం నిలబడే సరైన పురుషులు' అని ఆయన అన్నారు. మాజీ స్వీడన్ విదేశాంగ మంత్రి ఆన్ లిండే మాట్లాడుతూ యూరప్ ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి, ముఖ్యంగా జనన రేట్ల తగ్గుదల, శ్రామిక మహిళలకు నిర్మాణాత్మక ప్రోత్సాహకాల గురించి మాట్లాడారు. పన్ను విధానాల లో సంస్కరణలు అవసరమని, పిల్లల సంరక్షణకు సార్వత్రికత తక్షణ అవసరాన్ని ఆమె నొక్కి చెప్పారు. 'కుటుంబాలు పని, తల్లిదండ్రులను కలపలేకపోతే, లింగ సమానత్వం అందుబాటులో ఉండదు' అని ఆమె అన్నారు, స్త్రీవాదానికి వ్యతిరేకంగా వచ్చే ఏవైనా వ్యతిరే కతలను గట్టిగా ఎదుర్కోవాలన్నారు. ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టడానికి స్వరాలను ఏకం చేయడంలో భారత్ సమ్మిట్ కీలక పాత్ర పోషిస్తుందని ఆమె పేర్కొన్నారు.

'ప్రపంచవ్యాప్తంగా చాలా పార్లమెంటులలో, మహిళలు ఇప్పటికీ తక్కువ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. నిరంతర లింగ పక్షపాతాలు ఉన్నాయి. నా దేశం, స్వీడన్‌లో, మహిళలు సమాన హక్కులు, వనరులు, ప్రాతినిధ్యం అనుభవిస్తున్నారు. కానీ ప్రతిచోటా అలా కాదు' అని ఆమె వ్యాఖ్యానించారు. అర్థవంతమైన ప్రాతి నిధ్యాన్ని నిర్ధారించడానికి స్త్రీవాద ఆధారిత విధానాలు, నిర్మాణాత్మక సంస్కరణలకు లిండే పిలుపునిచ్చారు. 'యుఎన్‌కు ఎప్పుడూ మహిళా సెక్రటరీ జనరల్ లేరు. తదుపరి ఎన్నికల్లో మార్పులు వస్తాయని నేను ఆశిస్తు న్నాను' అని ఆమె పేర్కొన్నారు. లింగ ప్రాతినిధ్యంలో భారతదేశ నాయకత్వాన్ని కూడా ఆమె గుర్తించింది, 'భారతదేశంలో స్వీడన్ కంటే ఎక్కువ మంది మహిళా నాయకులు ఉన్నారు' అని పేర్కొంది. టాంజానియా నుండి సిసిఎం పార్టీ సీనియర్ నాయకురాలు రబియా అబ్దల్లా మాట్లాడుతూ ప్రాంతీయ సంభాషణ విలువను, స్థిరమైన ప్రపంచ న్యాయాన్ని నిర్ధారించడానికి రాజకీయ నిర్మాణాలలో మహిళా నాయకత్వాన్ని పొందుపరచడం ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. మంగోలియా పార్లమెం టు సభ్యురాలు ఉండ్రామ్ చిన్బాట్ మాఈట్లాడుతూ బాలికలకు 'ఎస్‌టిఇఎం' విద్య, ఎడారీకరణ వల్ల ప్రభా వితమైన గ్రామీణ మహిళలకు వాతావరణ, స్థితిస్థాపక శిక్షణపై మంగోలియా ద్వంద్వ దృష్టిని హైలైట్ చేశారు. మంగోలియాలో నిర్వహించనున్న రాబోయే సిఓపి సమ్మిట్, లింగ సమానత్వంతో కూడిన కొత్త వాతావరణ విధానాలను ప్రదర్శిస్తుందని ఆమె ప్రకటించారు. పనా మా రిపబ్లిక్లోని మహిళా వ్యవహారాల మంత్రి మరియా అలెజాండ్రా పనాయ్ మాట్లాడుతూ లాటిన్ అమెరికన్ మహిళలు ఎదుర్కొంటున్న వ్యవస్థాగత అసమానతలను గుర్తు చేశారు. ముగ్గురు మహిళల్లో ఒకరు లైంగిక వేధింపులను అనుభవిస్తున్నారని, అనేక మంది స్వదేశీ, వలస, యువతులు ప్రధాన స్రవంతి విధాన రూప కల్పనలో కనిపించకుండానే ఉన్నారు అని ఆమె అన్నారు. ముఖ్యంగా ఎల్‌జిబిటిక్యూ ప్లస్ కమ్యూనిటీకి, కలుపుగోలుతనం ఎలా అమలు చేయబడుతుందో నిర్మాణా త్మక సంస్కరణల అవసరాన్ని భారత శాసనసభ్యురాలు, న్యాయవాది ప్రణితి షిండే నొక్కిచెప్పారు. తెలంగాణలో చట్ట అమలు పాత్రలలో ట్రాన్స్ వ్యక్తులకు మద్దతు ఇచ్చే మైత్రి పథకాన్ని ఉటంకిస్తూ 'మనకు తక్కువ చర్చ, ఎక్కువ చర్య అవసరం. ఉపాధి, బడ్జెట్, పాలనలో చేరిక కనిపించాలి' అన్నారు.

'వాస్తవాలు – కల్పితాలు – తప్పుడు సమాచారాన్ని ఎదుర్కోవడం'పై జరిగిన చర్చలో పంచ్ అప్, వీవిస్, థాయిలాండ్, సిఈఓ, సహ వ్యవస్థాపకుడు థానిసారా రువాంగ్దేజ్, యూరోపియన్ యూనియన్ పార్లమెంట్ మాజీ సభ్యుడు మియాపెట్రా కుంపుల నాత్రి, ఇంగ్లాండ్ లేబర్ పార్టీ మలేషియా, ప్రతినిధుల సభ సభ్యుడు రామ్కర్పాల్ సింగ్, పార్లమెంటు సభ్యుడు డాక్టర్ మల్లు రవి, లూయిస్ బ్లాండన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దిగ్విజయ సింగ్ పాల్గొన్నారు. అదుపులేని తప్పుడు సమాచారం కారణంగా ప్రజాస్వామ్య విలువలు క్షీణిస్తాయని దిగ్విజయ సింగ్ అన్నారు. నేడు టెక్ కంపెనీలు ప్రపంచ కథనాలను నియంత్రిస్తాయి, పౌరుల హక్కులను ఆక్రమించాయని, నేను కూడా డీప్ ఫేక్‌లకు, నకిలీ వార్తలకు వ్యక్తిగత బాధితుడినన్నారు. తాను ఎప్పుడూ చెప్పని పదాలు తనపై ఆపాదించబ డ్డాయని, ఒక బటన్ క్లిక్ చేయడంతో ద్వేషం పెరుగు తోందన్నారు. డిజిటల్ యుగంలో సమాచార ఓవర్ లోడ్‌ను, రాజకీయ, భౌగోళిక రాజకీయ నటులు నకిలీ కంటెంట్‌ను ఉద్దేశపూర్వకంగా ఆయుధంగా ఉపయో గించడాన్ని థానిసారా రువాంగ్‌దేజ్ నొక్కి చెప్పారు. అటువంటి కంటెంట్‌ను ఎదుర్కోవడానికి డేటా విశ్లేషణ, వాస్తవ తనిఖీ ప్రాముఖ్యతను ఆమె నొక్కి చెప్పారు. డిజిటల్ అక్షరాస్యత, మీడియా నియంత్రణ, ప్రజా విద్యపై ఈయు విధానాలను వివరిస్తూ, 'ఆఫ్‌లైన్‌లో చట్టవిరుద్ధమైనది ఆన్‌లైన్‌లో కూడా చట్టవిరుద్ధం' అని మియాపెట్రా కుంపుల న్రాతి నొక్కి చెప్పారు. యువ పౌరులు తమ సమాచారం ఎక్కడ, ఎలా లభిస్తుందో విమర్శనాత్మకంగా అంచనా వేయాలని ఆమె కోరారు. ఎఐ సృష్టించిన వీడియోలు, వైరల్ తప్పుడు సమా చారంతో యుకె అనుభవాన్ని మాథ్యూ విలియం ఫాల్డిం గ్ పంచుకున్నారు, వాస్తవ ప్రపంచ ప్రభావం, భావో ద్వేగ హానిని నొక్కి చెప్పారు. 'అబద్ధాలు వేగంగా ప్రయా ణిస్తాయి. నకిలీ వార్తలు జీవితాలను నాశనం చేస్తాయి' అని ఆయన హెచ్చరించారు. మలేషియా కఠినమైన లైసెన్సింగ్ చట్టాలను ప్రవేశపెట్టాలని, మీడియా కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని రామ్‌పాల్ సింగ్ ప్రకటించారు. 'స్వేచ్ఛా ప్రసంగాన్ని అరికట్టకుండా, వాటాదారులను జవాబుదారీగా చేసే బలమైన చట్టపరమైన చట్రాలకు మేము మద్దతు ఇస్తున్నాము' అని ఆయన అన్నారు. భారత పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ పాఠశాలల్లో డిజిటల్ అక్షరాస్యత అత్యవసర అవసరాన్ని నొక్కి చెప్పారు. 'సిగరెట్లు ఆరోగ్య హెచ్చరికను కలిగి ఉన్నట్లే, ధృవీకరించబడని కంటెంట్ నిరాకరణలతో రావాలి. తప్పుడు సమాచారం ద్వేషాన్ని వ్యాపింపజేస్తుంది. సమాజాన్ని విభజిస్తుంది. చాలా ఆలస్యం కాకముందే మనం చర్య తీసుకోవాలి' అని కోరారు.

'యువత, భవిష్యత్ రాజకీయాలు' అంశంపై జరిగిన చర్చలో ఉదయ్ భాను చిబ్, వరుణ్ చౌదరి, న్యూజిలాండ్‌కు చెందిన యువ మహిళా ఎంపి అరీనా విలియమ్స్, లినేష్ సెల్లువాండన్, మెరీనా హే, జేమ్స్ స్టీవ్ సెరానో, జీసస్ టాపియా పాల్గొన్నారు. రాజకీయాల భవిష్యత్తును రూపొందించడంలో యువత పాత్ర గురించి చర్చించడానికి వివిధ దేశాల నుండి యువ నాయకులు సమావేశమయ్యారు. 'రాజకీయాలు ఒక సేవ, ఉద్యోగం కాదు, యువత కేవలం మార్పును సృష్టించేవారు మాత్రమే కాదని, మెరుగైన భవిష్యత్తుకు పునాది' అని లీనేష్ సెల్లుండన్ నొక్కి చెప్పారు. మార్పు తీసుకురావడానికి ప్రస్తుత వ్యవస్థల్లోనే అవకాశాలను సృష్టించాలని పేర్కొంటూ, రాజకీయ సంస్థలలో యువతను పాల్గొనేలా చేయడం ప్రాముఖ్యతను మెరీనా పేర్కొన్నారు. రాజకీయాల ద్వారా సానుకూల మార్పును తీసుకురావడానికి వారి సామర్థ్యం గురించి విద్యా ర్థులకు బోధించడానికి విద్యా వ్యవస్థల అవసరాన్ని ఇద్దరు నాయకులు నొక్కి చెప్పారు.

## సత్ప్రవర్తన కారణంగా మేధాపాట్కర్ శిక్ష రద్దు



**న్యూఢిల్లీ :** ప్రజా ఉద్యమాల జాతీయ కూటమి (ఎన్‌ఎపిఎం) వ్యవస్థాపకసభ్యురాలు, నర్మదా బచావో ఉద్యమ నాయకురాలు మేధాపాట్కర్‌కు ఢిల్లీ హైకోర్టు నుండి ఉపశమనం లభించింది. ప్రస్తుత ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా 23 సంవత్సరాల క్రితం మేధాపాట్కర్‌పై దాఖలు చేసిన పరువు నష్టం దావా కేసులో శిక్షను కోర్టు శుక్రవారంనాడు నిలిపివేసింది. తొలుత ఆమెను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. సక్సేనా గుజరాత్‌లో ఒక స్వచ్ఛంధ సంస్థను నడుపుతున్న సమయంలో నర్మదానదిపై డ్యామ్ నిర్మాణానికి సంబంధించిన విషయంలో సక్సేనాపై మేధాపాట్కర్ విమర్శలు చేశారు. దాంతో ఆయన స్థానిక కోర్టులో కేసు వేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలమేరకు తర్వాత ఆ కేసు ఢిల్లీ హైకోర్టుకు చేరింది. ఏప్రిల్ రెండో తేదీన సెషన్స్ కోర్టు ఈ పరువునష్టం దావాకేసులో తీర్పును సమర్థించింది. కానీ ఆమెకు విధించిన శిక్షలో మార్పులు చేసి ఆమెను సత్ప్రవర్తన కేటగిరీ కింద విడుదల చేసింది. ఈనెల ఎనిమిదో తేదీన ఆమెను ప్రొబేషన్ బాండు కింద రూ.25వేలు చెల్లించాలని ఆదేశించింది. ముందస్తు షరతు కింద రూ.ఒక లక్ష జరిమానా విధించింది. మంచి ప్రవర్తన కారణంగా జైలుకు పంపకుండా బాండును ఆధారం చేసుకుని శిక్షపడినవారిని విడుదల చేయడం ఒక ప్రొబేషన్ విధానం. ఐనప్పటికీ కూడా ఆమెపై నాన్ బెయిలబుల్ వారెంటు జారీ చేశారు. ఎందుకంటే నిర్ణీత తేదీలోపు ఈ షరతులను ఆమె గౌరవించి అమలు చేయలేకపోయారు. శుక్రవారంనాడు మేధాపాట్కర్‌ను అరెస్టు చేసి సెషన్స్ కోర్టు ఎదుట హాజరుపరిచారు. బాండ్లను సమర్పించడానికి సంబంధించి న్యాయమూర్తి నోటి మాట ద్వారా ఆదేశాలు ఇచ్చిన తర్వాత ఆమెను విడుదల చేశారు. తనను శిక్షించడాన్ని సవాలు చేస్తూ ఆమె దాఖలు చేసిన రివిజన్ పిటిషన్‌కు అనుగుణంగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శైలిందర్ కౌర్ ఈ లోపే ఆమెకు నోటీసు జారీ చేశారు. ఐతే తర్వాత ఆ నోటీసును రద్దుచేశారు. శిక్షను రద్దుచేశారు. రూ.25 వేలు పూచీకత్తుపై మేధాపాట్కర్‌కు బెయిలు మంజూరైంది.ఆమెపై నిరంతరాయంగా ఉన్న సమస్యల కారణంగా కోర్టు ఆమెను అదుపులోకి తీసుకుని ఎన్‌బిడబ్ల్యు అములు చేయాలని కోరింది. ప్రస్తుతం ఉన్న పరిస్థితులు, ఆమె ఆరోగ్యం రీత్యా తాత్కాలికంగా పిటిషనర్‌ను పూచీకత్తుపై విడుదల చేశారు. రివిజన్ పిటిషన్‌పై సమాధానం చెప్పడానికి సక్సేనా తరపు న్యాయవాదికి రెండు వారాలు కోర్టు గడువు ఇచ్చింది. ఈ కేసు మే 20వ తేదీన తిరిగి విచారణకు వస్తుంది. అప్పటివరకూ మేధాపాట్కర్‌కు తాత్కాలికంగా శిక్షను వాయిదా వేస్తారు. మెజిస్ట్రీరియల్ కోర్టు ఆమెకు విధించిన శిక్షను సెషన్స్ కోర్టు సమర్థించింది. దీనిని ఆమె సవాలు చేశారు. ఆమె ప్రొబేషన్ బాండును సెషన్స్ కోర్టుకు సమర్పిస్తే ఈ రివిజన్ పిటిషన్ చెల్లుబాటు కాదు, దాంతో ఆమె శిక్ష రద్దు అవుతుంది. ఐతే సక్సేనా తరపు న్యాయవాది మాత్రం దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. ఆమె అనుసరించిన ఈ ప్రక్రియ చట్టానికి విరుద్ధమని వాదిస్తున్నారు. గత ఏడాది మెజిస్టీరియల్ కోర్టు ఆమెకు పరువునష్టం కేసులో ఐదు నెలలు సాధారణ శిక్ష విధించింది. రూ.10 లక్షలు జరిమానా విధించింది. 2000 సంవత్సరంలో తనకు వ్యతిరేకంగా ఒక పత్రికా ప్రకటన విడుదల చేసినందుకుగాను సక్సేనా ఆమెపై పరువునష్టం దావా వేశారు.

## దేశవ్యాప్తంగా కశ్మీరీ విద్యార్థులు, వ్యాపారులకు


# హిందూ ఉన్మాదుల బెదిరింపులు

వామపక్షాల ఆందోళన

**న్యూఢిల్లీ :** పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడి తర్వాత దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో ఉన్న కశ్మీరీ విద్యార్థులకు ఎదురవుతున్న బెరింపుల పట్ల వామపక్షాలు శుక్రవారంనాడు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. హిందూరక్ష దళ్, సంబంధిత మత గ్రూపులు ఈ బెదిరింపులకు పాల్పడుతున్నాయి. కశ్మీరీ విద్యార్థులను బెదిరింపులకు గురిచేస్తే అది ఉగ్రవాదుల ఎజెండాకు మరింతగా సహకరిస్తుంది తప్ప దేశంలో ఉగ్రవాద సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదని వామపక్షాలు పేర్కొన్నాయి. ఈ ఘటనలవెనుక ఉన్న సూత్రధారులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంది. సిపిఐ(ఎం) ఒక ప్రకటన చేస్తూ కశ్మీరీ విద్యార్థులకు బెదిరింపులతోపాటు వేధింపులకు గురిచేస్తే ఉగ్రవాదులకు మరింత ప్రయోజనం కలుగుతుందని పేర్కొంది.ఈ విధంగా విద్యార్థులను వేధించడం తుచ్ఛమైన చర్య మాత్రమేకాకుండా, విద్వేషాన్ని నింపుతుందని సిపిఐ (మార్క్సిస్టు–లెనినిస్టు)పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. ''పహల్గామ్ ఘటనతో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశమంతా ఏకతాటిపైకి వచ్చిన తర్వాత జమ్మూ కశ్మీరుకు చెందిన వ్యాపారులు, విద్యార్థులకు దేశంలోని వివిధ రాష్ట్రాలలో వేధింపులు, బెదిరింపులు ఎదురవుతున్నాయన్న వార్తలు వచ్చాయి. ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలలో ఉన్న కశ్మీరీ విద్యార్థులు, వ్యాపారులకు ఈ వేధింపులు ఎదురవుతున్నాయన్న వార్తలు వచ్చాయి'' అని సిపిఐ(ఎం) విడుదల చేసిన ప్రకటన పేర్కొంది. ''డెహ్రాడూన్‌లో బెదిరింపుల కారణంగా ఒక మతోన్మాద సంస్థ హెచ్చరిక జారిచేసిన కారణంగా చాలామంది కశ్మీరీ విద్యార్థులు వారి ఇళ్ళ నుండి వెళ్ళిపోయారు, అదేవిధంగా సోషల్ మీడియాలో కశ్మీరీ విద్యార్థులను, మైనారిటీ వర్గాలను లక్ష్యంగా చేసుకుని విద్వేష ప్రచారం కూడా జరుగుతోంది'' అని ఆ ప్రకటన పేర్కొంది. పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద చర్యను యావత్ కశ్మీరీ ప్రజలు ఏ విధంగా వీధుల్లోకి వచ్చి వ్యతిరేకించి నిరసన ప్రదర్శనలు చేశారో యావత్ ప్రపంచం ప్రత్యక్షంగా చూసిందని వామపక్షాలు పేర్కొన్నాయి. అందువల్ల ఇతర రాష్ట్రాలలో కశ్మీరీ విద్యార్థులను, వ్యాపారులను వేధింపులకు గురిచేస్తే విద్వేషాలకు దారితీస్తాయని, సంబంధిత అధికారులు అనివార్యంగా కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని వామపక్షాలు కోరాయి. వారిని బెదిరించేవిధంగా విధ్వంస చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరాయి. ఈ విధంగా భయంతో ఉన్నవారినిని పార్టీ సభ్యులు కలిసి వారితో అనుసంధానంలో ఉండాలని సిపిఐ(ఎం) తమ పార్టీ సభ్యులకు తెలియజేసింది. సిపిఐ(ఎంఎల్) కూడా ఒక ప్రకటనలో కశ్మీరీ లోయ వెలుపల ఉన్న వారిపై ఈ విధమైన వేధింపులు సమాజాన్ని విభజిస్తాయని పేర్కొంది. ఇది సిగ్గుమాలిన చర్యలనీ, మతపరమైన విషాదాన్ని ఇతర ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేయడమే అవుతుందని పేర్కొంది. సిపిఐ(ఎంఎల్) ఉత్తరాఖండ్ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రేశ్ కుమార్ ఆ రాష్ట్ర డిజిపికి ఒక లేఖ సమర్పించారు. ఈ విధంగా వేధింపులు చేసే హిందూ రక్ష దళ్, ఇతరులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ సహా వారికి అనుబంధంగా ఉండే అనేక సోషల్ మీడియా గ్రూపులు నకిలీ వార్తలు సృష్టించి కశ్మీరీయులు, ముస్లింలకు వ్యతిరేకంగా విద్వేషాన్ని రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్నాయని వామపక్షాలు పేర్కొన్నాయి.


## లేబర్ కోడ్స్ రద్దు చేయకుంటే బిజెపిని తరిమికొట్టుడే

జిల్లా కార్మిక సంఘాల సదస్సులో పలువురు నేతల హెచ్చరిక



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** విదేశీ స్వదేశీ కార్పొరేట్ యజమానులకు అనుకూలంగా తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మికవర్గానికి తీరని అన్యాయం చేసిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని జిల్లా కార్మిక సంఘాల సద స్సు పిలుపునిచ్చింది. శుక్రవారం కరీంనగర్ లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఎఐటియుసి, సిఐటియు, బిఆర్‌టియు, టిఎన్‌టియుసి, ఇతర కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంఘాల ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లాకార్మిక సంఘాల జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి సమ్మయ్య, బిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డిలు హాజరై మాట్లాడారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్‌ల కోసం పనిచేసేందుకు 29కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు చేసి కార్మికులకు తీరని అన్యాయం చేశారని, లేబర్ కోడ్స్ ద్వారా కార్మికులకు యూనియన్ రిజిస్ట్రేషన్, సమ్మెచేసే, పనిగంటల, ఉపాధి భద్రత హక్కులతో పాటు సామాజిక రక్షణ తదితర అనేక కార్మిక సంక్షేమ పథకాలకు దూరంగా నెట్టే పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. కేవలం యజమానులకు మాత్రమే అనుకూలంగా రూపొందించి కార్మిక వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని, నాయకులను జిల్లాలోని కార్మిక వర్గం పెద్ద ఎత్తున మే20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చాప్టర్ ఆఫ్ డిమాండ్లను విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ మోడీ ప్రభుత్వంపై ప్రతిఘటించాలని కోరారు. కరీంనగర్ జి ల్లాలో కార్మికవర్గానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న కేంద్ర మం త్రి బండి సంజయ్ కుమార్ లేబర్ కోడ్లను వ్యతిరేకించే విధ ంగా కృషి చేయాలని, లేని పక్షం లో జిల్లా కార్మిక వర్గం బండి సం జయ్‌పై తిరుగుబాటు మొదలుపెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గీట్ల ముకుందరెడ్డి, ఎడ్ల రమేష్, ఎఐటియుసి జిల్లా అ ధ్యక్ష కార్యదర్శులు బుచ్చన్న యాదవ్, మల్ల సమ్మయ్య, పిట్ట ల శ్రీనివాస్, దాసరి ప్రభాకర్, రాజేందర్, రజిత, రాజయ్య, పోశయ్య, ఉమాశంకర్, కిరణ్, బిఆర్‌టి యు జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రాఘవు లు, టిఎస్టీయుసి జిల్లా ఇంచార్జి కళ్యాడపు ఆగ య్య, నాయకులు జనగాం రాజమల్లు, యు.శ్రీనివాస్, పుల్లెలమల్లయ్య, విద్యాసాగర్ పాల్గొన్నారు.

## డిజిటల్ లైబ్రరీ సద్వినియోగం



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి:** డిజిటల్ లైబ్రరీని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని, అందరూ ప్రయోజకులు కావాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రంలో గ్రంథాలయంలో నూతన డిజిటల్ లైబ్రరీని విభాగాన్ని జిల్లా కలెక్టర్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుమల సుహాసిని రెడ్డితో కలిసి ప్రారంభించారు. లైబ్రరీని పరిశీలించి ఇంటర్నెట్ సౌకర్యం, వసతులు గురించి ఆరా తీశారు. కలెక్టర్ స్వయంగా కంప్యూటర్ ఆన్ చేసి ఇంటర్నెట్ వసతిని పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, డిజిటల్ లైబ్రరీని ప్రారంభించడం ద్వారా, ప్రజలకు సమాచారం మరియు విద్యా వనరులను అందించడం ద్వారా, వారి జ్ఞానాన్ని పెంచడానికి సహాయపడుతుంది. గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుమల సుహాసిని రెడ్డి మాట్లాడుతూ, మెదక్ జిల్లా గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలుగా తీర్చిదిద్దుతున్నట్లు విద్యార్థులు, నిరుద్యోగ యువతకు అవసరమైన మరిన్ని బుక్స్, జర్నల్స్‌ను సమకూర్చడంతో యువతీ యువకులు పోటీ పరీక్షలలో ప్రతిభను చాటి వివిధ శాఖలలో ప్రభుత్వ కొలువులు సాధిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సెక్రెటరీ వంశీకృష్ణ, సిబ్బంది నరేందర్ రెడ్డి, శంకర్, యాదగిరి, మురళి, ఉమాదేవి పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులు భారీ ర్యాలీ




**ప్రజాపక్షం/పరిగి:** పహల్ గమ్ ఉగ్రదాడిని ఖండిస్తూ, దోషులను వెంటనే శిక్షించాలని కోరుతూ శుక్రవారం పరిగి పట్టణంలో ముస్లిం సోదరులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మృతి చెందిన వారికి నివాళులు, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తు మస్జీద్ కమీటి ఆధ్వర్యంలో జామియా మజీద్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమాయకులైన టూరిస్ట్‌లను కాల్చి చంపిన టెర్రరిస్ట్‌లను విడిచిపెట్టవద్దనీ భారత ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని కోరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మజీద్‌కమిటి సదర్ అబ్దుల్ మోయిజ్, మీర్ మహమ్మద్ , సయ్యద్ అయూబ్, బషీర్ తదితరులు పాల్గోన్నారు.

## శరణ్యకు అభినందనలు



**ప్రజాపక్షం/చర్లపల్లి:** కుషాయిగూడలోని జమ్మిగడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ రమాదేవి కమార్తె గుమ్మడిదల్ల శరణ్య చదువులో చక్కని రికార్డు నెలకొల్పింది. ఇద్దరూ వైద్యులైన తల్లిదండ్రులు డాక్టర్ రాఘవేంద్ర, తల్లి రమాదేవిలు చూపించిన మార్గంలో ముందుకెళ్తు శరణ్య మేడ్చల్ జిల్లాలోని ఓ ప్రైవేట్ కళాశాలలో బైపిసి గ్రూపులో 437/440 మార్కులతో అద్భుత ప్రతిభను చాటి తన కృషితో స్టేట్ సెకండ్ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు శరణ్యకు అభినందనలు తెలిపారు.



## జనవిజ్ఞాన వేదిక వేసవి సైన్స్ శిబిరాలు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి సైన్స్ శిబిరం విద్యార్థుల ఉత్సాహంతో రెండవ రోజు కొనసాగుతుంది. ఈ కార్యక్రమానికి ప్రముఖ విజ్ఞానవేత్త శివకుమార్ మాయాజాలం వెనుక ఉన్న శాస్త్రీయ రహస్యాలు అనే అంశంపై ఆసక్తికరమైన ప్రదర్శన నిర్వహించారు. మూఢ నమ్మకాలు సమాజంలో వేగంగా వ్యాప్తిస్తున్న ఈ తరుణంలో ప్రజలను మోసం చేయడానికి కొందరు చిన్నచిన్న ట్రిక్కులను మహిమలుగా ప్రదర్శిస్తున్నారని నిజానికి అలాంటి అద్భుతాలు వెనుక శాస్త్రమే ఉందని శివకుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జెవివి సభ్యులు జెన్నీ, ప్రభాకర్,పిట్టల నాగరాజు,శివశంకర్‌రెడ్డి,తాహిర్ తదితరులు పాల్గొన్నారు.



## ఇసిఐఎల్ రిటైర్డ్ ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/కాప్రా:**ఇసిఐఎల్ రిటైర్డ్ ఉద్యోగుల డైరీని హెచ్‌బి కాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్ శుక్రవారం ఆవిష్కరించారు. రాజీవ్ పార్కులో జరిగిన సమావేశంలో జమ్ముకాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడి మృతులకు మౌనం పాటించి నివాళులర్పించారు. స్థానిక కాలనీల సంక్షేమ సంఘం నాయకులు ప్రతాపరెడ్డి, మల్లేష్‌గౌడ్, వీరభద్రారావు, రామశర్మ, షేక్‌లాల్, నర్సింగరావు, చిట్టిబాబు, పాండు, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల శుభ్రత అవసరం

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** మలేరియా వ్యాధి సోకకుండా ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పరిసరాల శుభ్రత విషయంలో జాగ్రత్తలు పాటిస్తూ దోమలు వ్యాపించకుండా చూడాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఉమాగౌరి సూచించారు. ఉప్పల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ మలేరియా దినోత్సవ సందర్భంగా నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. దోమల నివారణ విషయంలో ఆశా కార్యకర్తలు, వైద్యారోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించే విధంగా శిబిరాలు నిర్వహించాలన్నారు. తమ పరిసరాల్లో ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చూడాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డా.శ్రీదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డిహెచ్ఎంఒ డా.శోభారాణి, డా.సత్యవతి, డా.చంద్రకళ,గీత,తదితరులు పాల్గొన్నారు.




## అంతర్జాతీయ పోటీల్లో రాణించేలా చెస్ శిక్షణ : మైనంపల్లి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** అంతర్జాతీయ పోటీల్లో రాణించే లక్ష్యంగా శిక్షణ పొంది దేశానికి వన్నె తేవాలని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సూచించారు. సైనిక్‌పురిలో అంతర్జాతీయ చెస్ క్రీడాకారులు ఏర్పాటు చేసిన డైమండ్ చెస్ అకాడమిని ఆయన శుక్రవారం ప్రారంభించారు. క్రీడాకారులకు అనుకూలమైన వాతావరణంలో నైపుణ్యతతో కూడిన శిక్షణ చెస్‌లో అవసరమని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు స్వర్ణరాజు, ప్రేమ్‌కుమార్, వెంకటేష్ యాదవ్, ఎస్ఆర్ ప్రసాద్, యాది, చంద్రశేఖర్, ఇందిరా ప్రియదర్శిని, పల్లె రాంచంద్ర గౌడ్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఇంటర్‌లో ఫెయిల్...విద్యార్థి ఆత్మహత్య

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** ఇంటర్‌లో ఫెయిల్ అవటంతో మనస్తాపానికి గురైన ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డా డు. మేడ్చల్ జిల్లా పోచారం ఐటి కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్నోజిగూడ నారాయణ జూనియర్ కాలేజిలో జగిత్యాల హనుమాన్‌వాడకు చెందిన జశ్వంత్ (17) ఇటీవల జరిగిన పరీక్షల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో మూడు సబ్జక్టుల్లో ఫెయిలయ్యాడు. దీంతో కళాశాల ప్రిన్సిపాల్ పిలిచి మందలించటంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తీసుకొని ఆత్మహత్యకు పాల్పడటం తో కళాశాల సిబ్బంది చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు వైద్య లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా కళాశాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసారు.



## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఎఇ టి బాలరాజు తెలిపారు. చర్లపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి సాయి నగర్ ఫీడర్‌ను మధ్యాహ్నం 3.30గంటల నుండి 5.30 గంటల వరకు నిలిపి వేయడంతో కృష్ణారెడ్డి నగర్, సాయి నగర్, ఇందిరా నగర్, నాగార్జున నగర్ కాలనీ రోడ్ నంబర్ 1,2,3,4,5,6,చక్రీపురం తదితన ప్రాంతాలలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని ఎఇ కోరారు.

# గిరిజన సమస్యలపై అలుపెరగని పోరాటం

### తెలంగాణా గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధానకార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** గిరిజన సమస్యలపై రాజీలేని పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉండాలని తెలంగాణా గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ పిలుపిచ్చారు. కాప్రా మండలం జవహర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని గిరిప్రసాద్‌నగర్ సిపిఐ పార్టీ కార్యాలయంలో స్వరూప నాయక్, శ్యామల లత అధ్యక్షతన శుక్రవారం మేడ్చల్ జిల్లా మహాసభలు జరిగాయి. ఈ కార్యక్రమంలో సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి సాయిలు గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్, కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, డిహెచ్‌పిఎస్ జిల్లా నాయకులు మహేష్, ఎన్ఎఫ్ఐడబ్ల్యు కుదాసు జయమ్మ, ఎఐటియుసి ఎల్లయ్య, కొండా సత్యం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించామని, గిరిజన హక్కులన్ని కూడా తమ పోరాటాల ఫలితమే అని తెలిపారు. గిరిజన సమాఖ్య నూతన కౌన్సిల్ 21 మందిని ఎన్నుకొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా స్వరూప నాయక్, అధ్యక్షులుగా శ్యామల లత, ఉపాధ్యక్షులుగా దేవరాయ బాలరాజు, మూడావత్ అంజి, వేణు, కుతాడి లక్ష్మి, సహాయ కార్యదర్శులుగా రాజు నాయక్, నవనీత, అరుణకుమారి, విశ్వనాథ్, అశ్విని, కౌన్సిల్ సభ్యులుగా సిద్ధు, రాణి, జ్యోతి, శ్రీనివాస్, సునీతలు ఎన్నికైన వారిలో ఉన్నారు.



## భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

### కలెక్టర్ గౌతం




**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** ధరణి స్థానంలో ప్రభుత్వం తాజాగా ప్రవేశ పెట్టిన భూభారతి చట్టం ద్వారా తమ భూ సంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం లభింస్తుందని జిల్లా కలెక్టర్ గౌతం పేర్కొన్నారు. ఘట్‌కేసర్ మండలంలోని ఏదులాబాద్ గ్రామంలోని డిఎస్ఆర్ ఫంక్షన్ హాలులో శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడుతూ ఈ చట్టం గురించి వివరించా రు. రెవెన్యూ అధికారు కు భూభారతి చట్టం ద్వారా సంక్రమిస్తున్న అధికారాల ద్వారా ఇకపై పరిష్కారాలు సులభంగా దక్కుతాయన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి,కీసర ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి, ఘట్‌కేసర్ తహసీల్దార్ రజనీలతో పాటు రెవెన్యూ సిబ్బంది, రైతులు ప్రజలు పాల్గొన్నారు.

## మలేరియా నిర్మూలనకు తగిన జాగ్రత్తలు

### సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్






**ప్రజాపక్షం/కాప్రా :** మలేరియా నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్ డిప్యూటి కమిషనర్ జగన్ సూచించారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా సర్కిల్ ఎంటమాలజీ, శానిటేషన్ విభాగాల ఆధ్వర్యంలో సర్కిల్ కార్యాలయం నుండి ఈసిఐఎల్ చౌరాస్తా వరకు పాదయాత్ర నిర్వహించారు. మలేరియా నిర్మూలనకోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించి ప్లేకార్డులు ప్రదర్శించారు. సర్కిల్ కార్యాలయ ప్రాంగణంలో మలేరియా నిర్మూలన కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచిస్తూ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసారు. దోమ కాటు ద్వారా మలేరియా ఏ విధంగా సంక్రమిస్తుందన్న విషయాలను వివరించారు. మస్కిటోలార్వాను చూపిస్తూ అనాఫిలిస్ మస్కిటో ద్వారా మలేరియా వ్యాధి వ్యాప్తి చెందుతోందని, లార్వా అభివృద్ధి చెందకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, ఎంటమాలజీ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

# కొడంగల్‌లో ఇసుక మాఫియా హల్‌చల్

### వత్తాసు పలుకుతున్న అధికారులు



**ప్రజాపక్షం / కొడంగల్ :** అధికార పార్టీ ఇసుక దందా కొడంగల్ నియోజకవర్గంలో మూడుపువ్వులు ఆరు కాయలుగా సాఫీగా సాగుతున్న దీనిని అరికట్టే అధికారులు కరువయ్యారని బిఆర్ఎస్ పార్టీ నాయకులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. శుక్రవారం స్థానిక విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతు కొడంగల్ నియోజకవర్గంలో అభివృద్ధి పేరుతో అధికార పార్టీ నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి పేర్లు వాడుకుంటు అధికారులను సైతం భయభ్రాంతులకు గురిచేస్తు ఇష్టానుసారంగా ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారని మండిపడ్డారు. బోంరాస్‌పేట మండలంలోని దుప్‌చర్ల గ్రామ శివారులోని కాగ్నా వాగు నుంచి కొడంగల్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులకు అధికారులు 20 ట్రాక్టర్‌లకు గాను ఒక్కో ట్రాక్టర్‌కి ఒకటి చొప్పున అనుమతులు ఇవ్వడం జరిగింది. అయితే కాంగ్రెస్ పార్టీ నాయకులు 21 ట్రాక్టర్‌లను ఏర్పాటు చేసి గ్రామ శివారులో డంపింగ్ చేసి అక్కడి నుంచి టిప్పర్‌ల సహాయంతో అటు పరిగి నియోజకవర్గానికి, ఇటు వికారాబాద్ నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలకు రవాణా చేయడం జరిగినట్లు సమాచారం.

అభివృద్ధి పేరుతో అనుమతులు తీసుకుని ఇలాంటి అవినీతి అక్రమాల కు పాల్పడుతున్న కాంగ్రెస్ నేతలపై ఎందుకు అధికారులు చర్యలు తీసుకుంటలేరో సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని డిమాండ్ చేశారు. దొరికిందే అవకాశం అంటు ఓ గిరిజన నాయకుడు ఎక్కడ బడితే అక్కడ డంపింగ్‌లు చేసుకుంటు కోట్ల రూపాయలను వెనకేసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

**అనుమతులకు అనుగుణంగా రవాణా : ఎస్ఐ రహూఫ్**

అనుమతులకు అనుగుణంగానే ఇసుక రవాణా చేయించడం జరుగుతుందని ఎక్కడ ఎలాంటి అవినీతికి తావునివ్వకుండ తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ రాహూఫ్ తెలిపారు. వాగులో నుంచి కేవలం 20 ట్రాక్టర్‌లకు మాత్రమే అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు. అనుమతులు లేని వాహనాలను సీజ్‌చేసి చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య

### సిపిఐ నాయకుడు గంటి సురేష్

**ప్రజాపక్షం / కొడంగల్ :** జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులు అమాయకులను పొట్టన పెట్టుకోవడం ఒక పిరికిపంద చర్య అని కొడంగల్ నియోజకర్గ సిపిఐ నాయకుడు గంటి సురేష్ అన్నారు. శుక్రవారం కొడంగల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతు ఉగ్రవాదుల దాడి ఘటనను కేంద్ర ప్రభుత్వం అన్ని కోణాల్లో క్షుణ్ణంగా పరిశీలన చేయాలన్నారు. ఉగ్రవాదానికి బలి అయిన అమాయకుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని మృతి చెందిన బాధితులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ ఘటనలో సయ్యద్ అదిల్ హూసేన్ ఉగ్రవాదులతో పోరాడి భారత పర్యటకులను రక్షించే ప్రయత్నం చేసే క్రమంలో ఉగ్రవాదుల చేతిలో బలైపోయాడని పేర్కొన్నారు. మానవత్వం మరిచి హిందు, ముస్లిం అనే తేడా లేకుండా ఉగ్రవాదులు అందరిని చంపారని అన్నారు. మతాల మధ్య రాజకీయాలు చేయకుండా వాస్తవాలను పరిశీలించి ఉగ్రవాదులను అంతమొందించే లక్ష్యం భారత్‌కు ఉండాలన్నారు. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించాలని కోరారు. ఇలాంటి ఘటనలు మరోమారు పునారవృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

## మే 26 వరకు జడ్‌ఆర్టీఐ సిగ్నల్ నుండి మౌలాలి కమాన్ రోడ్ బంద్

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** మౌలాలి కమాన్ సమీపంలో గోపాల్‌నగర్ నుండి లైఫ్ స్ప్రింగ్ హాస్పిటల్ వరకు సిసి రోడ్డు పనులు చేపడుతున్న దృష్ట్యా ఈ నెల 27 నుండి మే 26 వరకు జడ్‌ఆర్టీఐ నుండి మౌలాలి కమాన్ మీదు గా రమాదేవి హాస్పటల్ రోడ్డు మార్గాన్ని తాత్కాలికంగా మూసేస్తున్నారు. ఈ కారణంగా తార్నాక నుండి ఈసిఐఎల్ వెళ్లే వారు జడ్‌ఆర్టీఐ సిగ్నల్ నుండి హెచ్‌బి కాలనీ, ఎన్టీఆర్ స్టాచ్యూ మీదుగా రమాదేవి హాస్పిటల్ నుండి వెళ్లాల్సి ఉంటుంది. అదే విధంగా ఈసిఐఎల్ నుండి తార్నాక వైపు వెళ్లే ప్రయాణీకులు రమాదేవి హాస్పిటల్ నుండి హెచిబ కాలనీ, ఎన్టీఆర్ స్టాచ్యూ మీదుగా మౌలాలి వైపు వెళ్లాల్సి ఉంటుందని పోలీసులు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.



## విద్యార్థినుల వీడియోలు చిత్రీకరిస్తున్న హాస్టల్ వార్డెన్

### విబిఐటి కాలేజిలో ధర్నాకు దిగిన విద్యార్థినులు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** ప్రయివేట్ ఇంజనీరింగ్ కళాశాల వార్డెన్ తమ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థినుల వీడియోలు చిత్రీకరించటం బయట పడటంతో విద్యార్థినులు ఆందోళనకు దిగటంతో స్వల్ప ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వివరాల్లోకి వెళితే....ఘట్‌కేసర్ మండలం విజ్ఞాన భారతి ఇంజనీరింగ్ కళాశాల (విబిఐటి) ప్రాంగణంలో విద్యార్థినుల హాస్టల్ సైతం ఉంది. శుక్రవారం హాస్టల్ వార్డెన్‌గా పని చేస్తున్నరూప తన మొబైల్ ఫోన్‌తో తమ వీడియోలు చిత్రీకరించటాన్ని ఓ విద్యార్థిని గమనించి తోటి విద్యార్థినులకు తెలిపింది. వెంటనే విద్యార్థినులు అక్కడికి చేరుకొని వార్డెన్ ఫోన్ తీసుకొని చూడగా విద్యార్థినులకు చెందిన ప్రయివేట్ వీడియోలు మరిన్నిఉండటాన్ని గమనించారు. దీంతో ఒక్కసారిగా విద్యార్థినులంతా కళాశాల వద్దకు చేరుకొని తమ వీడియోలు చిత్రీకరిస్తున్న హాస్టల్ వార్డెన్‌ను తొలగించాలంటూ ధర్నాకు దిగారు. ఈ విషయం తెలిసిన పోలీసులు విద్యార్థినులకు నచ్చచెప్పి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకొంటామని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు.

## భారత రాజ్యాంగ విలువలను గౌరవించాలి : మహేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/బంట్వారం :** యాచారం, సుల్తాన్‌పూర్ గ్రామంలో జై బాపు, జై బీమ్, జై సాధన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిచారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మర్పల్లి మార్కెట్ కమిటి అధ్యక్షులు మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరు గౌరవించాలన్నారు. ప్రపంచ దేశాల్లోనే భారత రాజ్యాంగం అతి పెద్ద రాజ్యంగమని, మహనీయులు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాజ్యంగ రూప శిల్పి స్పూర్తితో ముందుకు నడవలన్నారు. భారత రాజ్యంగం పట్ల ప్రజలకు పూర్తి అవగహన కల్పించాలని, కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో విజయవంతం చేయాలని పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు వేంకటేశం, ఎంఎంసి డైరెక్టర్‌లు యాదగిరి, ఇసాక్, శాకం నర్సిములు, కాంగ్రెస్ పార్టీ యుత్ కాంగ్రెస్ జనరల్ సేక్రటరి హరీశ్వర్ రెడ్డి, నాయకులు శివకూమార్, ఎన్ నర్సిములు, శ్రీనివాస్, సుదర్శన్, వేంకటయ్య, తౌఫిక్ పాష, తదితరులు ఉన్నారు.

# గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

### కలెక్టర్ ప్రతీక్‌జైన్




**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా గ్రామల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ సంబంధిత శాఖ అధికారులను అదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్టిలో పెట్టుకోని నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యాన్మాయ చార్యలు తీసుకోవాలని అన్నారు. పైపులు మరమ్మత్తుల పనులు ,బోర్లు మోటర్లు కొనుగోలు తదితర పనులు చేపట్టాలని కలెక్టర్ అదికారులను అదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన స్థానిక వనరులను కూడా ఉపయోగించుకోవాలని, దీనికి సంబంధించి కావలసిన నిధులు మంజురు చేస్తామని కలెక్టర్ తెలిపారు. పాత ఓహెచ్ఎస్ఆర్ లను కూడా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్ జిల్లా పంచాయతీఅధికారి జయసుద తదితరులు పాల్గోన్నారు.

**ప్రజావాణి కార్యక్రమం వాయిదా :** ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యాక్రమంను తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగింది అని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా భూ భారతీ చట్టంపై అవగాహన కార్యాక్రమం నిర్వహించ డం జరుగుతుంది కావున ఈ నెల 28నుండి మే 5వరకు ఉండదిని తెలిపారు అనంతరం యాదవిదిగా కొనసాగుతుంది అని అన్నారు.

**ఔట్‌సోర్సింగ్ ద్వారా సీల్ టెండర్లు :** వికారాబాద్ జిల్లాలోని వివిధ శాఖలకు సంబంధించి అన్ని ఔట్సోర్సింగ్ సర్వీసులు ఏర్పాటు చేయడం నిమిత్తం రిజిస్టేషన్ అయిన ఉన్న ఔట్సోర్సింగ్ ఏజెన్సీలను సీల్ టెండర్లు కోరుతున్నాట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్.ఐన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28నుండి మే 06 మధ్యాహం 1గంటల వర కు స్వీకరించడం జరుగుతుంది అని అన్నారు. ఇతర వివరాల కోసం 9177607016 ను సంప్రదించవలసిందిగా కలెక్టర్ తెలిపారు.

## నీటి సంరక్షణ, భూగర్భ జలాలను పెంచడమే లక్ష్యం

### డిఆర్‌డిఒ శ్రీనివాస్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతి-నిధి:** వికారాబాద్ మండల పరిధిలోని పులుమద్ది గ్రామంలో వాట ర్ షెడ్ యాత్ర కార్యక్రమంను డిఆర్‌డిఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాటర్ షెడ్ పథకం కింద చేపట్టిన పలు పనులను ప్రదర్శించారు. రాబోయే తరాల వారికి సురక్షిత మంచినీటిని అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మొక్కలు నాటి ఇంకుడు గుంత ల ద్వారా భూమిలోకి నీటిని ఇంకించే పద్ధతిని అలవాటు చేసుకోవాలన్నారు. ప్రజలు కూడా నీటిని పొదుపు గా వాడాలన్నారు. నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ పూనుకోవాలని పిలుపునిస్తూ ఈ సందర్భంగా ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. నీటి సంరక్షణపై విద్యార్థులు వ్యాసరచన, పెయింటింగ్స్ పలువురుని ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో డిపివో జయసుధ, ఎడి గ్రౌండ్ వాటర్ రవి, ఎంపిడిఓ వినయ్‌కుమార్, ఎంపివో దానియల్, సతీష్‌రెడ్డి, లక్ష్మి , ఎపిఓ శ్రీనివాస్ తదితరులు పాల్గోన్నారు.

## చర్లపల్లి కేంద్ర కారాగారంలో 28న సివిల్ ఆర్టికల్స్ వేలం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కేంద్ర కారాగారంలో సివిల్ ఆర్టికల్స్‌ను హైదరాబాద్ రేంజ్ డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్(డిఐజి) ఆదేశానుసారం వేలం వేస్తున్నట్లు జైలు పర్యవేక్షణాధికారి ఓ ప్రకటనలో తెలిపారు. చర్లపల్లి కేంద్ర కారాగారంలో ఈ నెల 28వ తేదీన సివిల్ ఆర్టికల్స్‌ను ఉదయం 10.30 గంటలకు చర్లపల్లి కేంద్ర కారాగారంలో బహిరంగా వేలం వేయనున్నామని ఆసక్తి గత వ్యక్తులు రూ. 5వేలు ధరావత్ చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆయన తెలిపారు. ఇతర వివరాలకు 9966211175నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## భూభారతి చట్టంపై నేడు సదస్సు

### కొత్తూరు తహసీల్దార్ రవీందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/కొత్తూరు:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కొత్తూరు తహసీల్దార్ రవీందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కొత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూభారతి నూతన చట్టంలో పొందుపరిచిన అంశాలు రైతుల సమస్యల పరిష్కారానికి మేలు చేస్తాయన్నారు. ఈ నెల 26వ తేది శనివారం కొత్తూరు మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నూతన భూ భారతి చట్టంపై అన్నదాతలకు అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు, అందుకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌లు ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల నుండి రైతులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## కార్పొరేటర్‌పై పోలీసులకు ఫిర్యాదు

**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని మార్ఫింగ్ చేసిన లింగోజిగుడ కాంగ్రెస్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పహల్గామ్‌లో జరిగిన దారుణమైన ఉగ్రవాద దాడిని నిరసిస్తూ బిజెపి రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎల్‌బినగర్ చౌరస్తాలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేసినట్లు తెలిపారు. నిరసన కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నాయకుల మనోభావాలు దెబ్బతినే విధంగా తీవ్రవాదుల దిష్టిబొమ్మను మార్ఫింగ్ చేస్తూ ప్రధాని నరేంద్రమోడీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్నట్లు చిత్రీకరించి సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులను అప్‌లోడ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. తప్పుడు పోస్టులను అప్‌లోడ్ చేసిన కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని యన కోరారు. కార్యక్రమంలో బిజెపి గడ్డిఅన్నారం డివిజన్ అధ్యక్షులు దాసరి జయప్రకాష్, ఏనుగు శ్రీధర్‌రెడ్డి, కృష్ణంరాజు, కిరణ్, శ్రావణ్‌గౌడ్, దామ రాకేష్‌యాదవ్, సతీష్, శివరామ్, గిరీష్, టింకు, వినయ్ పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

### హయత్ నగర్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి




**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని హయత్‌నగర్ డివిజన కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హయత్‌నగర్‌లో అంతర్జాతీయ మలేరియా దినోత్సవం సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మలేరియా డిపార్ట్మెంట్ సిబ్బంది నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యంగా దోమల వ్యాప్తి చెందకుండా, నీటి నిల్వ లేకుండా చూడాలని, అదే విధంగా ప్రతి ఒక్కరు వారి వారి పరిసర ప్రాంతాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంటమాలజీ అధికారులు రవీందర్, బండారి భాస్కర్, గంగాని శ్రీను, పొరండ మహేష్ పాల్గొన్నారు.

## జెడ్సన్ యూనివర్సిటీలో అడ్మిషన్లు

### యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నిక్కి ఫెనర్ను




**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** ఉన్నత విద్య, గ్లోబల్ కేర్ అవకాశాల కోసం ప్రయత్నిస్తున్న విద్యార్థుల కోసం అమెరికాలోని జడ్సన్ యూనివర్సిటీ 2025గాను స్పాట్ అడ్మిషన్స్ అవకాశం కల్పిస్తుందని యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ డా.నిక్కి ఫెనర్ను తెలిపారు. శుక్రవారం చైతన్యపురిలోని కెరీర్‌వింగ్స్ కన్సల్టెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అమెరికాకు చెందిన జెడ్సన్ యూనివర్సిటీతో అనుసంధానమై స్పాట్ అడ్మిషన్స్ ఈవెంట్‌ను ఏప్రిల్ 26న హిమాయత్‌నగర్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9052000710, 7995866681 లకు సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో ఇంటర్‌నేషనల్ యూఎస్‌ఏ కౌన్సిలర్ నవ్య, డైరెక్టర్ అహ్మద్, మార్కెటింగ్ మేనేజర్ అబ్దుల్ సలాం తదితరులు పాల్గొన్నారు.

## అత్యాధునిక సదుపాయలతో స్మైలైన్ డెంటల్ హాస్పిటల్ ఏర్పాటు

### స్మైలైన్ డెంటల్ హస్పటల్ ఎండి రామకృష్ణ




**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి;** అత్యాధునిక సదుపాయలతో నానక్‌రామ్ గూడలో స్మైలైన్ డెంటల్ హాస్పిటల్ ఏర్పాటు చేశామని స్మైలైన్ డెంటల్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ రామకృష్ణ తెలిపారు. శుక్రవారం నానక్‌గూడలో స్మైలైన్ డెంటల్ హస్పటల్ మూడవ బ్రాంచిని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డెంటల్ హాస్పిటల్ ఎండి డా. రామకృష్ణ, స్మైలైన్ డెంటల్ హాస్పిటల్ వ్యవస్థాపకులు, డైరెక్టర్ సునీత, స్పెషాలిస్టు సీనియర్ డాక్టర్లు కీర్తి, ప్రీతి, అమూల్యా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం డా. రామకృష్ణ మాట్లాడుతూ గత మూడు దశాబ్దలుగా దంత వైద్య రంగంలో సరికొత్త ప్రమాణాలు పాటిస్తూ వస్తున్నామని పంజాగుట్ట, హైటెక్ సీటి ప్రాంతాలలో ఇప్పటికే సేవలందిస్తూ వస్తున్నామని తెలిపారు. ఆసుపత్రిలో జనరల్, కాస్మెటిక, డెంటిస్ట్రీ, ఆర్థోడాంటిక్స్, పెడియాట్రిక్, ఎండోడాంటెక్స్, పెరియోడాంటెక్స్,ప్రోస్తోడాంటెక్స్, ఓరల్, మ్యాక్సిలోఫేషియల్ సర్జరీ వరకు విస్తృత సేవలు అందిస్తున్నామని తెలిపారు.

## భారత్ సమ్మిట్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రాతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్ వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. శుక్రవారం హైదారాబాద్‌లోని హెచ్‌సిసిలో నిర్వహించిన భారత్ సమ్మిట్‌లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాకు పలు అంశాలను తెలియజేశారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ సదస్సులో వందకు పైగా వివిధ దేశాల నుండి ప్రతినిధులు హాజరయ్యారని, సుమారు 450మంది ప్రతినిధులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులు, ఆర్థికాభివృద్ధి, మేథో నాయకత్వంలో ఆగ్రగామిగా నిలిపేందుకు ఈ సదస్సు కీలకం కానున్నట్లు తెలిపారు. సదస్సులో రాష్ట్రంలోని వనరులు, అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించేందుకు స్లాట్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

## రైతులు కౌలు చెల్లించాలి

**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలోని ఓంకారేశ్వర దేవాలయం భూములను సాగు చేసుకుంటున్న రైతులు ఈ నెల 26, 27 వ తేదిల్లో కౌలు చెల్లించాలని ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు పప్పు వెంకట శివకుమార్ కాశ్యపన్ తెలిపారు. శుక్రవారం అయన విలేకరులతో మాట్లాడుతూ నందివనపర్తి,తాడిపర్తి, కుర్మిద్ద, నజ్జిక్‌సింగారం గ్రామాలకు చెందిన రైతులందరు సహకరించాలని కోరారు. కౌలు వసూలు కార్యక్రమానికి ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బత్తిన శ్రీనివాస్‌రావు హాజరౌతున్నారన్నారు. రైతులందరు సమిష్టిగా చెల్లిస్తేనే అలయం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ విషయాన్ని అర్థం చేసుకొని అందరు సహకరించాలని అన్నారు. రైతులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# బిఆర్ఎస్ అధ్యక్ష పదవి బిసిలకివ్వాలి

### మాజీ సిఎం కెసిఆర్‌కు జాజుల లేఖ



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** బిఆర్ఎస్ అధ్యక్ష పదవిని బిసిలకు ఇవ్వాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ నెల 27 జరిగే బిఆర్ఎస్ రజతోత్సవాల సభలో బిసి రాజకీయ పాలసీని ప్రకటించాలని కోరారు. ఈ మేరకు '25 ఏళ్ల బిఆర్ఎస్ పుట్టుక – సామాజిక న్యాయం– వరంగల్ బహిరంగసభ ' అనే అంశంపై శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో కుల్కచర్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిఎం కెసిఆర్‌కు బహిరంగ లేఖ ను జాజుల శ్రీనివాస్‌గౌడ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ గత 16 నెలల కాలంలో ప్రజా సమస్యలను పట్టించుకోని కెసిఆర్ సభకు బిసి, ఎస్‌సి, ఎస్‌టిలు ఎందుకు వెళ్లాలని ఆయన ప్రశ్నించారు. చరిత్రలో ఎక్కడా లేని విధంగా ఒకే పార్టీకి వరుసగా 12సార్లు అధ్యక్షుడిగా ఉన్న కెసిఆర్ ఎప్పుడూ సామాజిక న్యాయం పాటించలేదన్నారు. 25 ఏళ్లుగా బిసి, ఎస్‌సి, ఎస్‌టిలు బిఆర్ఎస్ జెండా మోస్తున్నారని, పదవులు మాత్రం ఒకే కుటుంబానికి చెందినవారే అనుభవిస్తున్నారని ఆయన ఆరోపిం చారు. బిఆర్ఎస్ ప్రాంతీయ పార్టీనా? జాతీయ పార్టీనా? రజతోత్సవ సభలో స్పష్టం చేయాలని ఆయన కెసిఆర్‌ను డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లను తగ్గింపు, బిసిలకు బడ్జెట్‌లో, అన్ని రంగాల్లో అన్యాయం చేసిన కెసిఆర్ సభలో బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన కోరారు. సమావేశంలో బిసి కుల సంఘాల జెఎసి కన్వీనర్ బాలరాజ్ గౌడ్, బిసి నేతలు కనకాల శ్యాం కుర్మ, ఎలికట్టే విజయ్‌కుమార్ గౌడ్, అయిలి వెంకన్నగౌడ్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ రజతోత్సవ సభను వ్యతిరేకిద్దాం

### తెలంగాణ ఉద్యమకారుల జెఎసి

**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** తెలంగాణను లక్షల కోట్ల అప్పుల్లో ముంచింది చాలక, మరోసారి నమ్మించి, తడిబట్టతో గొంతు కోయాలని చూస్తున్న బిఆర్ఎస్ రజతోత్సవ సభను వ్యతిరేకిద్దామని తెలంగాణ ఉద్యమకారుల జెఎసి చైర్మన్ సుల్తాన్ యాదగిరి, సెక్రటరీ జనరల్ తుమ్మల ప్రఫుల్ రాం రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చాలని మాట్లాడిన, ప్రశ్నించిన ఉద్యమకారులపై ఉపా కేసులు పెట్టి నిర్బంధించిన చరిత్ర కెసిఆర్‌దేనని మండిపడ్డారు. ఉద్యమకారులు, బిఆర్ఎస్ కార్యకర్తలు ఆ సభకు వెళ్లొదని కోరారు. కెసిఆర్ కుటుంబ అక్రమ ఆస్తులపై సిబిఐతో విచారణ జరపాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమకారులపై పెట్టిన కేసులన్నింటిని ఎత్తివేయాలని వారు కోరారు. సమావేశంలో జెఎసి నేతలు చంద్రన్న ప్రసాద్, వేముల యాదగిరి, కమల్ తదితరులు పాల్గొన్నారు.




## ఆదర్శంగా మోడల్ కళాశాల

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** తెలంగాణ రాష్ట్రానికే ఆదర్శంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలను నిర్మించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న కళాశాల రెండవ స్లాబ్‌కు, గ్రౌండ్ ఫ్లోర్‌లో గోడల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ విద్యార్థులకు పూర్తి స్థాయిలో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అనంతరం పట్టణంలోని మినీ స్టేడియంలో షాద్‌నగర్ క్రికెట్ ఆకాడమీ ఆధ్వర్యంలో సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంప్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింలు, రాజు, కృష్ణారెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, చెంది తిరుపతిరెడ్డి, గోపాల్‌నాయర్ యాదగిరి యాదవ్, రాయికల్ శ్రీను, అందె మోహన్, పులిమామిడి రాజేష్‌గౌడ్, లింగారెడ్డిగూడ అశోక్, సీతారాములు పాల్గొన్నారు.




# భూభారతిలో బాధితులకు న్యాయ సలహా వ్యవస్థ





### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** భూభారతి చట్టంలో బాధితులకు న్యాయ సలహా వ్యవస్థ ఉందని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా మాడుగుల్,ఆమనగల్ మండలాలలో భూభారతి నూతన ఆర్ ఒఆర్ చట్టంపై మాడుగుల వాసవీ ఫంక్షన్ హాల్,ఆమనగల్ లక్ష్మీ గార్డెన్ లో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి కలెక్టర్ సి.నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూమి అనేది ఒక రైతు జీవితానికి చాలా పెద్ద ఆధారమని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూభారతి నూతన చట్టంలో పొందుపరిచిన అంశాలు రైతుల సమస్యల పరిష్కారానికి మేలు చేస్తాయన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ ధరణి చట్టంలో భూమి విషయాలలో కుటుంబ సభ్యుల మధ్య గొడవలు జరిగేవని, ఇప్పుడు అలాంటి సమస్య ఉండదని, ప్రతి రైతుకు న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం 34 మంది లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. స్థానికంగా లంబాడీలకు ట్రైబల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో 54 బోరు మోటర్లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### శిల్పారామంలో ఏర్పాట్ల పరిశీలన

హైదరాబాద్ హైటెక్స్‌లోని శిల్పారామంలో మహిళ శక్తి బజార్‌ను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి పరిశీలించి, సంబంధిత అధికారులకు తగు సూచనలు చేశారు. భరత్ సమ్మిట్‌లో పాల్గొన్న దేశ, విదేశాల ప్రతినిధులకు చూపించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దేశ విదేశాల ప్రతినిధులు వస్తున్న సందర్భంగా ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఇఒ కృష్ణారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.వెంకటేశ్వర రావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి, శ్రీలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి సుసింధర్ రావు, రెవెన్యూ ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతు సమస్యలు పరిష్కరించాలి : సిపిఐ

**ప్రజాపక్షం/తుర్కయాంజల్ :** రైతుల సమస్యలు పరిష్కరించాలని సిపిఐ రాష్ట్ర నాయకులు ముత్యాల యాదిరెడ్డి, రంగారెడ్డి జిల్లా రైతు సంఘం అధ్యక్షులు కొంతం మాధవరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రంగారెడ్డి జిల్లా రైతు సంఘం ప్రతినిధి బృందంతో కిలిసి తుర్కయంజాల్ రైతు సేవ సహకార సంఘం కార్యాలయంలో డిసిసిబి చైర్మన్, టెస్కాబ్ వైస్ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్యను కలిసి జిల్లా రైతు సమస్యలపై వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో రైతులకు ఇప్పటివరకు 1,2,ఎకరాల వరకు కూడా రైతు భరోసా ఇవ్వలేదని, రైతులకు రూ.2లక్షల రుణ మాఫీ సంపూర్ణంగా చేయలేదన్నారు. 55 సంవత్సరాలు నిండిన ప్రతి రైతుకు పదివేల పింఛను ఇవ్వాలని, రెండు లక్షల వరకు ఇన్సూరెన్స్ కల్పించాలన్నారు. రైతులకు లోను తీసుకునేటప్పుడు పాన్ కార్డు నిబంధన ఎత్తివేయాలని, కల్తీ లేని నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై ఇవ్వాలని, వడగండ్ల వానకు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందచేయలన్నారు. సహకార బ్యాంకు సభ్యులు అకారణంగా మరణించితే దహన సంస్కారాలకు ఖర్చుల నిమిత్తం ఆ కుటుంబానికి రూ.50వేల ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బాల్ రెడ్డి, జంగారెడ్డి, బాలరాజు, బాలయ్య, శ్రీనివాస్ రెడ్డి, ప్రణీత్ రెడ్డి, వినోద్ రెడ్డి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు



## ఎన్నికల హామీలు అమలు చేయండి



**ప్రజాపక్షం/షాబాద్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జి రామస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం చేవెళ్ళ మండలం అంతారం గ్రామంలో గ్రామ శాఖ కార్యదర్శి జయమ్మ అధ్యక్షతన మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం వచ్చిన తరువాత రైతు ఆత్మహత్యలు పెరిగిపోయాయన్నారు. ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నేటికి 11సంవత్సరాలు గడుస్తున్నా నేటికి కల్పించలేదని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అంతారం గ్రామశాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా జయమ్మ, సహాయ కార్యదర్శిగా లక్ష్మీ , అమృత, నరసింహా, చంద్రయ్య, గంగమ్మ, పద్మమ్మ, చంద్రమ్మలను ఎన్నుకున్నా రు. కార్యక్రమంలో మండల కార్యదర్శి సత్తిరెడ్డి, సహాయ కార్యదర్శి ఎండి మక్బూల్, వడ్ల మంజుల పాల్గొన్నారు.

# కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రదాడి అమానుషం

### సిపిఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ




**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** జమ్ముకశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు అమానుషమని సిపిఐ, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులు తీవ్రంగా ఖండించారు. గురువారం రాత్రి హయత్ నగర్‌లో సిపిఐ, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్, ఎఐటియుసి ఆధ్వర్యంలో విజయవాడ జాతీయ రహదారిపై కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎల్‌బి నగర్ నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి శేషురాజుపల్లి శ్రీదేవి, మర్రి శోభన్, బొంగు అరుణ్ కుమార్ గౌడ్, రమావత్ సక్రు నాయక్, సుజాత, సరిత, నాగరాజు, కృష్ణ, సౌజన్య, శివ జ్యోతి, సుశీల, సరిత, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

### దేశ సమగ్రత కోసం త్యాగాలకు సిద్ధం

**ఫరూఖ్‌నగర్:** షాద్‌నగర్ పట్టణంలో శుక్రవారం ముస్లింలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో భారత్ వెంటనే ముస్లింలు అంటూ నినాదాలు చేశారు. దేశ రక్షణకు, సమగ్రతకు ముస్లింలు త్యాగాలకు సిద్ధంగా ఉంటారన్నారు. కొత్తూరు మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో శుక్రవారం నమాజ్ అనంతరం ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. పాకిస్తాన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కార్యక్రమంలో హాఫిజ్ సయ్యద్ మునవ్వర్ అలీ, సయ్యద్ అజార్, సయ్యద్ ఇబ్రహీం, బాబర్ అలీఖాన్, సర్వర్‌పాషా, షాద్‌నగర్ క్రిష్టియన్ అసోసియేషన్ అధ్యక్షుడు స్వామిదాస్, ముస్లిం నేతలు జమ్మద్‌ఖాన్, రబ్‌జామి. జాకీర్ హుస్సేన్, అసద్, గౌస్ జానీ, ముబీన్‌ఖాన్, ముబారక్ అలీఖాన్, ఖదీర్, సలీం పాల్గొన్నారు.

### సరూర్‌నగర్‌లో కాంగ్రెస్ నాయకుల నివాళి

**సరూర్‌నగర్ :** పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అమానుషమని, ఉగ్రవాదులపై కేంద్ర ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోని శిక్షించాలని హైదరాబాద్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ బోయిని మహేందర్‌యాదవ్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యధర్శి చిక్కుళ్ల శివప్రసాద్ అన్నారు. శుక్రవారం సరూర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోయిని శంకర్‌యాదవ్ ఆధ్వర్యంలో పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ, దాడిలో మరణించిన వారికి నివాళులర్పిస్తూ కాంగ్రెస్ నాయకులు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి ఇంతియాజ్ గుల్షాన్, ఉపాధ్యక్షులు గంధం కిషోర్, ఇమ్రాన్ అలీ, తాండ్ర భాస్కర్, అరుణ, రవలి, నర్సింగ్, సమీర్, సుబ్బారావు, శైలజా, నయీం, కరీం తదితరులు పాల్గొన్నారు.

### ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

### సిపిఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

**షాబాద్:** పర్యాటకులపై ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని కుర్వగూడ సిపిఐ శాఖ సమావేశంలో జంగయ్య మాట్లాడుతూ పహల్గామా ఉగ్రవాద కదలికలను పసిగట్టడంలో కేంద్ర నిఘా వర్గాలు విఫలమయ్యాయని ఆరోపించారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి నక్కలి జంగయ్య పాల్గొన్నారు.














## తొలి క్వాంటం కంప్యూటర్ సింధు



మన దేశంలో పూర్తి స్థాయి క్వాంటం కంప్యూటర్ క్యుపిఐ ఎఐ–సింధు (QpiAI–Indus) అందరి దృష్టిని ఆకట్టుకుంటున్నది. జాతీయ క్వాంటం మిషన్ (ఎన్‌క్యుఎం)లో ఈ ఆవిష్కరణను ఒక ప్రధాన మైలురాయిగా పేర్కోవాలి. బెంగళూరుకు చెందిన క్యుపిఐ ఎఐ సంస్థ ఈ కంప్యూటర్‌ను అభివృద్ధి చేసింది. ఇది పూర్తిగా భారతదేశంలో నిర్మించిన మొట్టమొదటి పూర్తి స్థాయి క్వాంటం కంప్యూటింగ్ వ్యవస్థ. ఇందులో హార్డ్‌వేర్‌తోపాటు సాఫ్ట్‌వేర్ కూడా ఉంటుంది. క్వాంటం ప్రాసెసర్ నుండి క్వాంటం అప్లికేషన్‌లను సమర్థవంతంగా అమలు చేయడానికి కృత్రిమ మేధ (AI/ ఎఐ) ఆధారిత అప్లికేషన్ సాధనాల వరకు ప్రతిదీ కవర్ చేస్తుంది. ఈ వ్యవస్థ 25 క్విట్‌లను కలిగి ఉంది. ఇది అధిక పనితీరు గల క్వాంటం కంప్యూటింగ్‌కు కీలకమైనదిగా పేర్కొంటున్నారు. సాంప్రదాయ కంప్యూటర్లతో పోలిస్తే మెరుగైన స్థిరత్వం, కనిష్ట దోష రేట్లతో వేగవంతమైన సంక్లిష్ట గణనలను అనుమతిస్తుంది. ఈ క్వాంటం కంప్యూటర్ జీవ శాస్త్రాలలో (ఔషధ ఆవిష్కరణ, జన్యుశాస్త్రం), పదార్థ శాస్త్రం (కొత్త పదార్థాల రూపకల్పన), చలనశీలత, లాజిస్టిక్స్ (మార్గం, సరఫరా గొలుసు ఆప్టిమైజేషన్) సంభావ్య ఉపయోగాలను కలిగి ఉంటుంది. క్వాంటం భౌతిక శాస్త్రంలో ప్రాథమిక పరిమాణమమైన ప్లాంక్ స్థిరాంకం (4.14) జ్ఞాపకార్థం, క్వాంటం సైన్స్, దాని సాంకేతిక ప్రభావంపై అవగాహనను ప్రోత్సహించడానికి ఈ ప్రాజెక్టును 2021లో ప్రారంభించారు. ఈ నెల 14వ తేదీన దీని ఆవిష్కరణ జరిగింది. నాలుగో నెల... 14వ తేదీని ఎంపిక చేసుకోవడానికి ప్రత్యేక కారణం ఉంది. ప్లాంక్ స్థిరాంకం (4.14 × 10 eV)లోని మొదటి మూడు అంకెలను (4.14) ఇది సూచిస్తుంది. ఐక్యరాజ్యసమితి 2025 సంవత్సరాన్ని అంతర్జాతీయ క్వాంటం సైన్స్ అండ్ టెక్నాలజీ సంవత్సరంగా ప్రకటించిన విషయం తెలిసిందే.


## మాంటిస్ రొయ్యల్లో రీకోయిల్–డంపనింగ్ వ్యవస్థ!

మాంటిస్ రొయ్యల సుత్తి లాంటి అవయవం శక్తివంతమైన దెబ్బలను కొట్టడానికి ఉపయోగపడుతుందని, సహజమైన రీకోయిల్–డంపనింగ్ వ్యవస్థను ఉపయోగిస్తుందని తాజా అధ్యయనం స్పష్టం చేస్తున్నది. మెటామెటీరియల్స్, శక్తి నియంత్రణ గురించి ఇప్పటివరకూ ఉన్న సిద్ధాంతాలు, నమ్మకాలను ఈ కొత్త అధ్యయనం సవాలు చేసున్నది. మాంటిస్ రొయ్యలు స్టోమాటోపోడా క్రమానికి చెందిన పురాతన సముద్ర క్రస్టేసియన్లు , ఇవి పీతలు, ఎండ్రకాయలతో దగ్గరి సంబంధం కలిగి ఉంటాయి. వీటిలో 450కిపైగా జాతులు ఉన్నాయి. అవి 10 సెంటీ మీటర్ల నుండి దాదాపు 46 సెంటీ మీట్రు వరకు పరిమాణంలో ఉంటాయి. రొయ్య అనే పేరు ఉన్నప్పటికీ, ఇవి నిజమైన రొయ్యలు కావు. వాటి శక్తివంతమైన రంగులు , సంక్లిష్టమైన ప్రవర్తన, శక్తివంతమైన వేట అనుబంధాల ఆధారంగా, రొయ్యల జాతి నుంచి వేరుచేశారు. తాజా అధ్యయనం మాంటిస్ రొయ్యల పరిణామాత్మక ప్రతిభను హైలైట్ చేయడమే కాకుండా, భౌతిక శాస్త్రం, బయో ఇంజనీరింగ్‌లో కొత్త సరిహద్దులను తెరుస్తున్నది. మాంటిస్ రొయ్యల అద్భుతమైన అనుబంధం సహజ ఫోనోనిక్ మెటామెటీరియల్ (ధ్వని లేదా కంపనాలు వంటి యాంత్రిక తరంగాలను నిరోధించే లేదా నియంత్రించే పదార్థాలు)గా పనిచేస్తుందని పరిశోధకులు కనుగొన్నారు. ఇది క్లబ్ నిర్మాణం ద్వంద్వ యాంత్రిక ప్రయోజనాలను అందిస్తుంది. శక్తిని తట్టుకుంటుంది. శక్తి ప్రచారాన్ని నియంత్రిస్తుంది. మాంటిస్ రొయ్యల క్రమానుగత నిర్మాణంలో ఇవి ఉన్నాయి. హైడ్రాక్సీఅపటైట్ ఉపరితలం (మానవ ఎముకలు, దంతాలలో కూడా కనిపించే గట్టి ఖనిజం) ప్రభావాన్ని చెదరగొడుతుంది. స్ప్రింగ్ లాంటి స్నాయువులు (షాక్‌ను గ్రహించడంలో సహాయపడే సాగే నిర్మాణాలు), బయోపాలిమర్ ఫైబర్‌లు ఒక ఆవర్తన నమూనాలో అమర్చబడి ఉంటాయి (పునరావృత దాడుల నుండి ప్రభావ నష్టాన్ని తగ్గించే పునరావృత సహజ ఫైబర్‌లు). కాగా, ప్రకృతి మెటామెటీరియల్‌లను అభివృద్ధి చేసిందని, శాస్త్రవేత్తలు జీవ పదార్థ రూపకల్పనను అర్థం చేసుకునే విధానాన్ని మారుస్తుందని ఈ అధ్యయనం నిర్ధారిస్తుంది.



ఇలావుంటే, మాంటిస్ రొయ్యలు వెచ్చని, నిస్సార ఉష్ణమండల, ఉప ఉష్ణమండల జలాల్లో నివసిస్తాయి. ముఖ్యంగా భారతీయ, పసిఫిక్ మహా సముద్రాలలో, స్వయంగా తవ్వుకున్న బొరియలలో నివసిస్తాయి. మాంటిస్ రొయ్యలను వాటి వేట అనుకూలతల ఆధారంగా రెండు ప్రధాన రకాలుగా వర్గీకరించారు. మొదటిది స్పియరర్స్ రకం. చేపలు, స్క్విడ్, పురుగులు వంటి మృదువైన శరీరాన్ని కలిగి ఉన్న జంతువులను వేటాడేందుకు ఉపయోగించే ముళ్ళు, ముళ్ల ముందరి కాళ్ళను కలిగి ఉంటాయి. రెండవది స్మాషర్లు. ఇవి భారీగా కాల్సియమ్ చేయబడిన, క్లబ్ లాంటి అనుబంధాలను కలిగి ఉంటాయి., ఇవి జంతు రాజ్యంలో అత్యంత వేగవంతమైన దాడులను అందించగలవు. ఇవి నత్తలు, పీతలు మరియు క్లామ్స్ వంటి గట్టి పెంకు కలిగిన జంతువులను పగలగొట్టడానికి ఉపయోగించబడతాయి. ఈ రొయ్యల వాటి క్లబ్ యంత్రాంగం కవచం ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో బయోమిమిక్రీని ప్రేరేపించడానికి ఉపయోగపడుతుంది. వీటి కంటి నిర్మాణం ఆప్టికల్ సెన్సార్, క్యాన్సర్ డిటెక్షన్ టెక్నాలజీని ప్రభావితం చేస్తోంది. అవి దిబ్బల పర్యావరణ వ్యవస్థలలో ఎర జనాభాను నియంత్రించడంలో సహాయపడతాయి. పోషక చక్రానికి దోహదం చేస్తాయి.

## మాస్ బ్లాక్ హోల్ ద్రవ్యరాశిని కొలిచేశారు..



భారత్‌కు చెందిన ఖగోళ శాస్త్రవేత్తలు దేవస్థల్ ఆప్టికల్ టెలిస్కోప్ (డిఒటి) సాయంతో, 4.3 మిలియన్ కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న ఒక మందమైన గెలాక్సీలో ఇంటర్మీడియట్ మాస్ బ్లాక్ హోల్ (ఐఎంబిహెచ్) ద్రవ్యరాశిని గుర్తించి ఖచ్చితంగా కొలిచారు. ఐఎంబిహెచ్‌లు మందమైన, మధ్యస్థపరిమాణ కాల రంధ్రాలు (మన సూర్యుని ద్రవ్యరాశికి 100 నుండి 100,000 రెట్లు), తరచుగా చిన్న గెలాక్సీలలో ఉంటాయి. పదార్థాన్ని చురుకుగా వినియోగిస్తున్నప్పుడు మాత్రమే బలమైన సంకేతాలను విడుదల చేస్తాయి. ఈ ఐఎంబిహెచ్ సూర్యుడి కంటే దాదాపు 22,000 రెట్లు ద్రవ్యరాశిని కలిగి ఉంది. చుట్టుపక్కల ఉన్న వాయు మేఘాలు 2.25 బిలియన్ కిలో మీటర్ల దూరంలో దాని చుట్టూ తిరుగుతున్నాయి. ఇది దాని గరిష్ట సైద్ధాంతిక రేటులో కేవలం 6 శాతం పదార్థాన్ని మాత్రమే వినియోగిస్తోంది. ఈ వివరాలను భారతదేశంలో అతిపెద్ద ఆప్టికల్ టెలిస్కోపైన డిఒటి గుర్తించింది. ఈ టెలిస్కోప్ ఉత్తరాఖండ్‌లోని నైనిటాల్‌లోని దేవస్థల్‌లో ఉంది. దీనిని 2016లో ప్రారంభించారు. దీనిని ఆర్యభట్ట రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అబ్జర్వేషనల్ సైన్సెస్ (ఎఆర్ఐఇఎస్) నిర్వహిస్తోంది. బ్లాక్‌హోల్స్ లేదా కృష్ణ బిలాలను గుర్తించడం, అధ్యయనం చేయడంలో ఈ టెలిస్కోప్ కీలక పాత్ర పోషిస్తున్నది. కృష్ణ బిలాలు అంతరిక్షంలో గురుత్వాకర్షణ శక్తి చాలా తీవ్రంగా ఉండటం వలన కాంతి కూడా తప్పించుకోలేని ప్రాంతాలు. ఒక భారీ నక్షత్రం దాని జీవితాంతం దాని స్వంత గురుత్వాకర్షణ శక్తి కింద కూలిపోయినప్పుడు బ్లాక్ హోల్స్ ఏర్పడతాయని శాస్త్రవేత్తల అభిప్రాయం. ఇవి చాలా దట్టమైన వస్తువును సృష్టిస్తాయి. దాని నుంచి కాంతి కూడా ప్రసరించలేదంటే, ఆ గాఢతను ఊహించుకోవచ్చు.

## గురుత్వాకర్షణ శక్తిలో వైవిధ్యాలు..



భూమిపై గురుత్వాకర్షణ శక్తిలో స్వల్ప వైవిధ్యాలు ఉన్నట్టు శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఇలాంటి తేడాలను గుర్తించడానికి తక్కువ భూమి కక్ష్యలో ఉన్న ఉపగ్రహంలో క్వాంటం గ్రావిటీ గ్రేడియోమీటర్ (క్యుజిజి)ని మోహరించాలని అమెరికన్ నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా) శాస్త్రవేత్తల బృందం ప్రతిపాదించింది. ఇది గ్రహం యొక్క ఉపరితల ద్రవ్యరాశి పంపిణీని ఖచ్చితంగా పర్యవేక్షించడానికి, వాతావరణ అధ్యయనాలకు సహాయపడటానికి, జాతీయ భద్రతను పెంచడానికి వీలు కల్పిస్తుంది. గురుత్వాకర్షణ శక్తి అనేది ద్రవ్యరాశి ఉన్న రెండు వస్తువుల మధ్య సహజ ఆకర్షణ శక్తి. వస్తువులను ఒకదానికొకటి ఆకర్షించుకోవడానికి, గ్రహాలను కక్ష్యలో ఉంచడానికి, వస్తువులను నేలపై పడేలా చేయడానికి, భౌతిక శరీరాలకు బరువును కల్పించడానికి ఉపయోగపడుతుంది. గురుత్వాకర్షణ శక్తి ఒక వస్తువు ద్రవ్యరాశికి నేరుగా అనులోమానుపాతంలో ఉంటుంది. భూమి ద్రవ్యరాశి పంపిణీని బట్టి మారుతుంది. ఈ వైవిధ్యాలు సున్నితమైన పరికరాలు లేకుండా గుర్తించలేనంత సూక్ష్మంగా ఉంటాయి. గురుత్వాకర్షణ శక్తి రెండు వస్తువుల మధ్య దూరం యొక్క వర్గానికి విలోమానుపాతంలో ఉంటుంది (దూరం పెరిగే కొద్దీ, గురుత్వాకర్షణ ఆకర్షణ బలహీనపడుతుంది). కాగా, గురుత్వాకర్షణ శక్తి వైవిధ్యాలను గుర్తించడానికి గ్రావిటీ గ్రేడియోమీటర్‌ను ఉపయోగిస్తారు. ఇది ఒక నిర్దిష్ట దూరంలో గురుత్వాకర్షణ త్వరణంలో వైవిధ్యాన్ని కొలవడానికి ఉపయోగించే అత్యంత సున్నితమైన శాస్త్రీయ పరికరం. న్యూటన్ రెండవ సిద్ధాంతం ఎఫ్= ఎంఎ (F = ma) ఆధారంగా, గ్రావిటీ గ్రాడియోమీటర్ స్థానిక ద్రవ్యరాశి పంపిణీలో మార్పుల వల్ల కలిగే గురుత్వాకర్షణ శక్తి , త్వరణంలో వైవిధ్యాలను గుర్తిస్తుంది. వేగంగా పడిపోవడం అంటే కింద ఎక్కువ ద్రవ్యరాశి (ఉదా. పర్వతాలు), నెమ్మదిగా పడిపోవడం అంటే తక్కువ ద్రవ్యరాశి (ఉదా. గాలి పాకెట్స్ లేదా చమురు నిల్వలు) అని సూచిస్తుంది. న్యూటన్ రెండవ నియమం ప్రకారం, ఒక వస్తువుపై పనిచేసే శక్తి దాని ద్రవ్యరాశిని దాని త్వరణం (F = ma) తో గుణించగా వచ్చే దానికి సమానమని గుర్తుంచుకోవాలి. ఇలావుంటే, క్వాంటం గ్రావిటీ గ్రేడియోమీటర్ లేదా క్యుజిజి అంతరిక్షంలోని వివిధ పాయింట్ల వద్ద గురుత్వాకర్షణ త్వరణంలో తేడాలను కొలుస్తుంది. భూమిపై లేదా ఇతర ఖగోళ వస్తువులపై ద్రవ్యరాశి పంపిణీలో వైవిధ్యాల కారణంగా గురుత్వాకర్షణ ఎలా మారుతుందో ఇది గుర్తిస్తుంది. క్యుజిజి అణువులను దాదాపు సంపూర్ణ సున్నాకి (0 కెల్విన్, లేదా 273.15 C) చల్లబరుస్తుంది, దీనివల్ల అవి తరంగాల వలె ప్రవర్తిస్తాయి. లేజర్‌లు ఈ అణువులను తారుమారు చేస్తాయి. వాటి దశ మార్పు గురుత్వాకర్షణ శక్తులకు సున్నితంగా మారుతుంది. తరువాత ఇది గురుత్వాకర్షణ వ్యత్యాసాలను 10 m/s వరకు కొలుస్తుంది. గురుత్వాకర్షణలో సూక్ష్మ వైవిధ్యాలను గుర్తించడానికి వీలు కల్పిస్తుంది. హిమాలయాల వంటి పెద్ద భూరూపాల ద్రవ్యరాశి బలమైన గురుత్వాకర్షణ శక్తిని సృష్టిస్తుంది కాబట్టి , క్యుజిజి వాటి గురుత్వాకర్షణ ఆకర్షణను గుర్తించగలదు . ఇది వాటి ద్రవ్యరాశిపై ఖచ్చితమైన డేటాను అందించడానికి ఈ వైవిధ్యాలను కొలుస్తుంది. నీరు, మంచు, భూభాగాలలో మార్పులను ట్రాక్ చేయగలదు. ఇది వాతావరణ మార్పు, హిమనదీయ ద్రవీభవనాన్ని అధ్యయనం చేయడంలో కీలక భూమిక పోషిస్తుంది. అదనంగా, భూగర్భ హైడ్రోకార్బన్‌లు, ఖనిజాలు, జలాశయాలను గుర్తించడంలో సహాయపడుతుంది. వనరుల అన్వేషణకు మద్దతు ఇస్తుంది. ఇది వ్యూహాత్మక మౌలిక సదుపాయాలను, భౌగోళిక ముప్పులను కూడా పర్యవేక్షించగలదు. జాతీయ భద్రతను మెరుగుపరుస్తుంది. ఖననమైన శిథిలాలు లేదా పురాతన నిర్మాణాలను తవ్వకం లేకుండా, విధ్వంసకాకుండా గుర్తించడానికి పురావస్తు శాస్త్రం, వారసత్వ పరిరక్షణలో కూడా క్యుజిజిని సాంకేతికతను ఉపయోగించవచ్చు. ఇది క్వాంటం సెన్సార్లు, ఉపగ్రహ సాంకేతికత, జియోఫిజిక్స్‌లో పురోగతిని కూడా పెంచుతుంది.

# ఉగ్రవాదం దేశానికి ప్రమాదకరం

### శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్
### సిపిఐ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం



సూర్యాపేట



వరంగల్


కరీంనగర్

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్ :** జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో యాత్రికులపై ఉగ్రవాదులు చేసిన మారణహోమం హేయమైన చర్య అని, ఇది దేశానికి ప్రమాదకరమని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఐప్సో) రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉగ్రవాదం దిష్టిబొమ్మ ను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదం కన్నా మానవత్వం గొప్పదని, మనిషి మానవత్వంతో జీవించాలని ప్రగతిని కాక్షించాలన్నారు. పహల్గాం దాడిలో మరణించిన, గాయపడిన వారి కుటుంబాలను ప్రభుత్వాలు అదుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బొమ్మగాని శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు తొగటి మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మంపాటి రాము, కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, దేవర మల్లేశ్వరి, దేశగాని హేమలత, పెంద్ర కృష్మ, తాళ్ళ సైదులు, నాగరాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

**కరీంనగర్ ప్రతినిధి :** ఉగ్రవాదులను, ఉగ్రవాద సంస్థలను తుదముట్టించేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, ఉగ్రవాదుల కాల్పుల్లో మృతి చెందిన కుటుంబాలను ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ శుక్రవారం సిపిఐ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కమాన్ చౌరస్తా వద్ద ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి ఉగ్రవాద సంస్థలను తుదముట్టించేందుకు కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, దొడ్డి సమ్మయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, కిన్నెర మల్లవ్వ, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, బ్రాహ్మండ్లపెల్లి యుగేందర్, బోనగిరి మహేందర్, నలువాల సదానందం, సాయవేణి రాయమల్లు, నాయకులు గామినేని సత్యం, పిట్టల శ్రీనివాస్, కొట్టె అంజలి, భారతి, తంగెళ్ల సంపత్, నల్లగొండ శ్రీనివాస్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

**వరంగల్ ప్రతినిధి :** కశ్మీర్‌లో సామాన్యులపై ఉగ్రదాడిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి అన్నారు. వరంగల్ పట్టణంలోని చౌరాస్తా, హెడ్ పోస్టాఫీస్ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో పెహల్గాం మృతులకు నివాళలర్పించారు. కార్యక్రమంలో సిపిఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ బాష్ మియా, పనాస ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు దండు లక్ష్మ ణ్, బుస రవీందర్, గుండె భద్రి, ల్యాదల్ల శరత్, యండి అక్బర్‌పాష, జాన్ పాల్, పరికరాల రమేష్, నాయకులు సుంకరి భవాని, నల్లతీగల కుమార్, యండి యాకుబ్, సువర్ణ చిరంజీవి, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**కొత్తగూడెం టౌన్ :** పెహల్గాంలో జరిగిన పాక్ ప్రేరేపిత ఉగ్రదాడి భారతదేశ సమగ్రత, సమైక్యతను, మత సామరస్యాన్ని దెబ్బతీసే కుట్రని, ఈ కుట్రలను సమిష్టిగా తిప్పికొట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా, సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, ఉర్దూ ఘర్ చైర్మన్ నయీమ్ ఖురేషి, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, ఆళ్ల మురళి అన్నారు. పెహల్గాంలో యాత్రికులపై జరుగిన టెర్రరిస్టుల దాడికి నిరసనగా, మృతులకు నివాళులర్పిస్తూ కొత్తగూడెం ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రైల్వేస్టేషన్ సెంటర్లో మానవహారం నిర్మించి మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉమర్ ఫరూక్, అబ్దుల్ రబ్, ఎండి షరీఫ్, ఎండి అబిద్, అమీర్ ఖాద్రి, జావేద్, ఎండి అయూబ్, అన్వర్, బాబు జానీ పాల్గొన్నారు.

**హనుమకొండ ప్రతినిధి :** పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల కాల్పులను ప్రతి ఒక్కరూ ఖండించాలని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. హనుమకొండలోని అంబేద్కర్ సెంటర్‌లో అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఐప్సో), అరసం, ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరమ్ వరంగల్, హనుమకొండ జిల్లాల ఆధ్వర్యంలో ఉగ్రవాదుల కాల్పులలో మృతిచెందిన వారికి కొవ్వొత్తులను వెలిగించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదుల దుశ్చర్యను ఖండించాలని, ఉగ్రవాదం నశించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో డిటిఎఫ్ పూర్వ రాష్ట్రకార్యదర్శి సోమయ్య, భారత్ బచావో జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎం. వెంగళ్‌రెడ్డి, అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ మార్క శంకర్ నారాయణ, అయిప్సో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. శ్రీహరి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, న్యాయవాది వేణు గోపాల్‌రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, అరసం జిల్లా అధ్యక్షుడు నిధి, మహిళా సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మండ సదాలక్ష్మి, డాక్టర్ ఎం.సారంగపాణి, సిపిఐ జిల్లా నాయకులు నేదునూరి రాజమౌళి, వేల్పుల సారంగపాణి, బి. ప్రవీణ్ కుమార్, ఎండి. రఫి, ఉస్మాన్ పాషా, గోపి తదితరులు పాల్గొన్నారు.

**నిజామాబాద్ ప్రతినిధి :** కుల మతాలకతీతంగా ఉన్న లౌకిక భారత దేశంలో ఉగ్రదాడులకు సహించేది లేదని సిపిఐ నగర కార్యదర్శి ఓమయ్య అటన్నారు. సిపిఐ, ఎఐటియుసి, ఎఐఎస్ఎఫ్‌ల ఆధ్వర్యంలో జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడులకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎన్టీఆర్ చౌరస్తా వద్ద అమరులైన భారత పౌరులకు నివాళులర్పించామన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్, నర్సింగరావు, చక్రపాణి, హన్మాండ్లు, అజీజ్, భానుచందర్, రఘురాంనాయక్, అంజలి, సభ్యులు పాల్గొన్నారు.



కొత్తగూడెం


హనుమకొండ



నిజామాబాద్

# బిజెపిని గద్దెనెక్కించాలన్నదే బిఆర్‌ఎస్ ప్రయత్నం

### సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి




**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి :** బిజెపిని గద్దెనెక్కించాలన్నదే బిఆర్ఎస్ ప్రయత్నమని సిపిఐ మహబూబాబాద్ జిల్లా సెక్రటరి బి.విజయసారథి ఆరోపించారు. శుక్రవారం సిపిఐ జిల్లా విస్తృత కౌన్సిల్ సమావేశం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.విజయసారథిరెడ్డి అధ్యక్షతన స్థానిక వీరభవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా విజయసారథి మాటాడుతూ రాష్ట్రంలో బిజెపి బిఆర్ఎస్ ఒక్కటేనని, లోపాయకార ఒప్పందం చేసుకున్నరని, రానున్న ఎన్నికల్లో బిజెపిని గద్దెనెక్కించేందుకు బిఆర్ఎస్ పార్టీ నానా ప్రయత్నాలు చేస్తోందన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా 3వ మహాసభలు జూలై 5,6తేదీల్లో కురవి మండల కేంద్రంలో జరుగుతాయని, ఈ మహాసభ విజయంతం చేయడానికి, వేలాదిగా కార్యకర్తలు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈమహాసభల్లో ప్రజలు సమస్యలను భవిష్యత్ పోరాటాలను చర్చించి ముందుకు పోతామని దిశా నిర్దేశం చేశారు. కశ్మీర్‌లో జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, పెహల్గాంలో మరణించిన వారికి సిపిఐ జిల్లా సమితి రెండు నిముషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు. 26న జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో శాంతి ర్యాలీలు చేయాలన్నారు. మే డే వేడుకలను వాడవాడలా ఘనంగా నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆత్మ డివిజన్ చైర్మన్‌గా ఎన్నికైన సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, వరిపల్లి వెంకన్న, కట్లోజు పాండురంగాచారి, నెల్లూరు నాగేశ్వరావు, తండ సందీప్,చొప్పరి శేఖర్, బైస స్వామి, సారిక శ్రీనిఆవస్, జంపాల వెంకన్న, వెలుగు శ్రావణ్, బానోతు లింగ్యానాయక్, ఎండి ఫాతిమా, మాలోతు రవీందర్, జలగం ప్రవీణ్, చిర్ర సత్యానారాయణ, లక్ష్మ ణ్, వంకాయలపాటి చిరంజీవి, నాదెండ్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.

# మేడే స్ఫూర్తితో హక్కుల రక్షణకు పోరాడుదాం

### ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్




**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** మే డే స్ఫూర్తితో కార్మికుల హక్కుల రక్షణకు కార్మిక లోకం పోరాడాలని ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ పిలుపునిచ్చారు. మేడే పోస్టర్లు శివనగర్ తమ్మరభవన్‌లో శుకవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గన్నారపు రమేష్ మాట్లాడుతూ మేడే వరంగల్ జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో, నియోజకవర్గ కేంద్రాలలో కార్మికుల ప్రాంతాలలో మేడే జెండాలు ఎగురవేయాలని కార్మిక శ్రేణులకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయంగా దాదాపు 180 దేశాలు మేడే దినోత్సవాన్ని జరుపుకుంటాయన్నా రు. 1886 వ సంవత్సరంలో పని గంటల కొరకు చికాగోలో మొదలైన పోరాటంలో కార్మికుల రక్తం నుండి ఉద్భవించిందే ఎర్రజెండా అన్నారు. దేశంలో మొదటిసారిగా ఎఐటియుసి నాయకులు, కమ్యూనిస్టు నేత సింగారవేలి శెట్టి ఆర్ 1923వ సంవత్సరంలో మద్రాసు నగరంలో మేడే జెండా ఎగరవేశారన్నారు. మే డే స్ఫూర్తితో భవిష్యత్తులో కార్మికుల హక్కుల సాధనకు పోరాడాలన్నారు. ఎందరో మహా మహానీయులు కార్మికుల హక్కుల సాధనకు, 12 గంటల పని దినాలు పోయి ఎనిమిది గంటల పని దినాలు రావాలని అమరత్వం పొందారని, వాటి త్యాగాలతోనే నేడు మేడే జెండా అని, ప్రపంచ కార్మికులకు మే డే పండుగ దినోత్సవం మే1 ఘనంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు, ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు లక్ష్మ ణ్, ఎండి యాకోబ్, గోవర్ధన్, పరికిరాల రమేష్, ఉప్పుల రవి తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## సమయాన్ని వృథా చేసుకోవద్దు

**ప్రజాపక్షం/వెల్దండ :** మండలంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో వందే మాతరం ఫౌండేషన్ , శృతిలయ కల్చరల్ అకాడమీవారి సంయుక్త ఆధ్వ ర్యంలో జరుగుతున్న ఎల్ఎల్ఎల్ ప్రోగ్రాం వేసవిశిక్షణ శిబిరాన్ని మండల పరిధిలోని చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకో వాలని ఎస్ఐ కురుమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం ప్రోగ్రాం కోఆర్డినేటర్ల తోకలిసి బ్రోచర్లు విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈయొక్క అవకాశాన్ని వినియోగించుకోవాలని స్థానికంగా, మండలపరి ధిలో ఉన్న విద్యార్థిని, విద్యార్థులు సద్వినియోగం చేసుకో వాలని కోరారు. కార్యక్రమం లో జోనల్ ఇంచార్జీ శ్రీరామ్, మండల ఇంచార్జీ మల్లేష్, బ్రాంచి ఇంచార్జీలు రవళి, శ్రీకళ, కోఆర్డినేటర్స్ పావని, ప్రేమలత, మహేశ్వరి తది తరులు పాల్గొన్నారు.



## మానవత్వం చాటుకున్న వైనం

**ప్రజాపక్షం/బిజినేపల్లి :** బిజినేపల్లిగ్రామంలో ఎస్సికాలనీలో గుంపాల లక్ష్మమ్మ(55) అకాలమరణం చెందడం జరిగింది. మండల మాజీరైతుస మితి అధ్యక్షులు నెల్లికంటి మహేశ్వర్‌రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయంగా రూ.5వేలు అందజేశారు. వారివెంట మాజీ ఎంపిటిసి బాల స్వామి, మంగికృపయ్య, మంగిమురళి, మంగిపెద్దనర్సింహ్మా, గుంపాలకృ ష్ణయ్య, గుంపాలరాములు, ముల్గర పరుషరాములు, ప్రశాంత్, అర్జున్, సాయిబాబు, మహ్మద్‌రిజ్వాన్, మంగిరాము పరామర్శించారు.

## క్రికెట్ పోటీలు ప్రారంభం



**ప్రజాపక్షం/ మక్తల్ :** మక్తల్ నియోజకవర్గ కేంద్రం స్థానిక ప్రభుత్వ క్రీడా మైదానంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కోళ్ళ వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న మక్తల్ సూపర్ ప్రీమియం లీగ్ క్రికెట టౌర్నమెంట్ ను ప్రారంభిం చిన మక్తల్ నియోజకవర్గ శాసన సభ్యులు డా॥ వాకిటి శ్రీహరి. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మారెడ్డి, చంద్రకాంత్ గౌడ్, కట్ట సురేష్, కావలి శ్రీహరి, లక్ష్మణ్ సింగ్, విఘ్నేష్, వాకిటి శ్యామ్, కల్లూరి హన్మంతు, బోయ వెంకటేష్ , నాగరాజ్, రాజేందర్ , శాలం, రహీం పటేల వాకిటి భాస్కర్, వర్కూరు అంజి, కావలి తాయప్ప, శంశోద్దీన్, కావలి ఆంజ నేయులు తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ సభకు తరలిరండి



**ప్రజాపక్షం/ నారాయణపేట్:** ఈనెల 27 న వరంగల్ జిల్లా కేంద్రంలో జరిగే బిఆర్ఎస్ పార్టీ బహిరంగ సభకు గులాబీ జెండా పెద్ద ఎత్తున తరలిరా వాలని మాజీ శాసన సభ్యులు చిట్టెం రామ్మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్ర వారం ఉదయం మక్తల్ పట్టణంలోని జాతీయ రోడ్డు పైన వరంగల్ సభకు సంబంధించిన గోడ పోస్టర్ వేసి అనంతరం ఆయన మాట్లాడారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి. నరసింహ గౌడ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు చిన్న హనుమంతు , మాజీ మున్సిపల్ కౌన్సిలర్ అన్వర్ హుస్సేన్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు గోవిందరావు, జుట్లశంకరు, గుర్లపల్లి గాలిరెడ్డి, బండారి ఆనందు, కర్రెమ్ ఆంజనేయులు, మామిళ్ళ అమ్రేష్, భూత్పూర నర్సిం హులు తదితరులు పాల్గొన్నారు.



**వెల్దండ :** ఈనెల 27న వరంగల్ జిల్లాలో జరిగే బిఆర్ఎస్ రజతోత్సవసభను విజయవంతం చేయడానికి పార్టీశ్రేణులు సమయాత్తంకావాలని యువజన విభాగం మండలఅధ్యక్షుడు జంగిల్‌యాదగిరి, యువనాయకులు జంగిలి ఆనంద్, తగులకొండల్‌యాదవ్ కోరారు. మండలపరిధిలోని ఆయా గ్రామా లలో బిఆర్ఎస్ రజతోత్సవసభ పోస్టర్లను పంపిణీచేశారు. యువనాయకులు జంగిలి ఆనంద్, వెంకటయ్య, జంగిలిరవికుమార్, అంజయ్య, సంజీవ్, బాలునాయక్, సజ్జన్‌నాయక్ పాల్గొన్నారు.

## కళాకారులకు ఆర్థికసాయం



**ప్రజాపక్షం/వెల్దండ :** మండల పరిధిలోని పోతేపల్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ కళా బృందం సభ్యులు గతమూడు రోజులనుండిమునిరంగస్వామి స్టేజినాటక ప్రదర్శన చేశారు. దీంతో బిఆర్ఎస్ యువనాయ కుడు తగుళ్ల కొండల్‌యాదవ్ రూ.10,116 విరాళం అందజేశారు. సంస్కృతి , సాంప్రదాయాలకు కళాపోషణ అంతరించిపోకుండా చూడాలని కళా కారులకు సూచించారు. మార్కేండేయుడు, చిన్నసైదయ్య, గోపాల్, వెంక టయ్య, కళాకారులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

**ప్రజాపక్షం/జడ్చర్ల:** జడ్చర్ల పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కి చెందిన దోనూర్ శ్రీనివాస్ రెడ్డి మాతృమూర్తి సుధేష్టమ్మ మృతి చెందారు.తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి శుక్రవారంబాధితకుటుంబాన్ని పరామర్శిం చారు. శుక్రవారం నాడు జడ్చర్ల పట్టణంలోని శ్రీనివాస్‌రెడ్డి నివాసానికి వెళ్లి సంతాపం తెలిపారు. మాజీ జడ్పీవైస్ చైర్మన్ కొడుగల్ యాదయ్య, రఘుపతి రెడ్డి, ప్రనిల్ చందర్, ప్రభాకర్ గౌడ్, పర్వత్‌రెడ్డి, పరమటయ్య పాల్గొన్నారు.

## 'ఆవోప' ఆధ్వర్యంలో వేసవి శిక్షణ

**ప్రజాపక్షం/ జడ్చర్ల :** జడ్చర్ల ఆవోపా ఆధ్వర్యంలో వచ్చే విద్యా సంవత్స రంలో పదవ తరగతి చదవబోవు విద్యార్థులకు ఆర్యవైశ్య ప్రోఫెషనల్ అండ్ అఫీషియల్స్ అసోసియేషన్ వారిచే శుక్రవారం ఉదయం మెమోరియల్ పాఠ శాలలో 200 మంది తెలుగు, ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్న ఆవోప సభ్యులకు స్థానిక ఉదయం మెమోరియల్ ప్రిన్సిపాల్ వీణ శివకుమార్ అభినందనలు తెలియజేశారు. జడ్చర్ల , తిమ్మాజిపేట మండల విద్యాధికారులే పాల్గొన్నారు. తిమ్మాజిపేట మండల విద్యాధికారి సత్యనారాయణ శెట్టి నిర్వహణలో పేద విద్యార్థులకు ఎన్నో విద్యాసంబంధ కార్యక్రమాలు గత 20 సంవత్సరాలుగా చేపడుతున్నా మని తెలియజేశారు. జడ్చర్ల మండల విద్యాధికారిని మంజులాదేవి మాట్లా డుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ సెలవుల్లో పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వడం అభినందనీయమని, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మురళీ కృష్ణ,శివకుమార్, వారి కార్యవర్గ సభ్యులను అభినందించారు. అవోప అధ్య క్షుడు మురళీకృష్ణ మాట్లాడుతూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆవోప రాష్ట్ర బాధ్యులు గుండ్ల శ్రీనివాసులు, తిరుపతయ్య, సతీష్ కుమార్, వజ్ర లింగం, శ్రీధర్, రామకృష్ణ ఉన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పరిశీలన

**ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ :** కల్వకుర్తి మండలంలో తర్నికల్‌తండా తర్ని కల్ గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇండ్ల వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభిం చడం జరిగిందని ఎంపిడిఓ వెంకట్‌రాములు తెలిపారు. అందులోభాగంగా తర్నికల్‌తండాలో 20మంది లబ్దిదారులను గ్రామపంచాయతీ తర్నికల్‌లో 65మంది లబ్దిదారులను వెరిఫై చేయడం జరిగిందన్నారు. ఆయనవెంట పంచాయతీ కార్యదర్శులు సుష్మ, బాలరాజు, సీనియర్ సహాయకులు ఫిరోజ్ ఖాన్,జూనియర్ సహాయకులు రమేష్ ఉన్నారు.

# సన్నవడ్లకు రూ.500 బోనస్

## చౌదర్పల్లిలో కొనుగోళ్లు పరిశీలన, మందగతిపై ఆరా

### కలెక్టర్ విజయేందిర బోయి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్‌ప్రతినిధి:** దేవరకద్ర మండలంలో శుక్రవారం చౌదర్పల్లి గ్రామంలో ఐ.కె.పి ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొను గోలు కేంద్రం ను మండలం వ్యవసాయ మార్కెట్ యార్డు లో ఏర్పాటు చేసిన పి.ఏ.సి.ఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, శుక్రవారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తనిఖీ చేశారు. చౌదర్ పల్లిలో ఐ.కె.పి ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోళ్లు పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లు మందగతిన ఉండడం గమనించి కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుండి ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం ఎప్పటికప్పుడు రైస్ మిల్లుకు తర లించాలని ఆదేశించారు. ప్యాడి క్లీనర్ గురించి నిర్వాహకులకు కలెక్టర్ ప్రశ్నించారు. ప్యాడి క్లీనర్ రిపేరింగ్ వచ్చింది తీసుకుని రావాలి చెప్ప డంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ప్యాడి క్లీనర్ ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు ఆదేశించారు.ప్రభుత్వం సన్న వడ్లకు క్వింటాల్ కు 500 రూ.లు బోనస్ అందచేస్తున్నట్లు తెలి పారు. రైతునుండి ధాన్యం కొనుగోలు తర్వాత కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పూర్తి బాధ్యత వహించాలని, ట్యాగ్ చేసిన మిల్లుకు రవాణా చేయాలని సూచించారు. వర్షాల వలన ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దేవరకద్ర మండల వ్యవసాయ మార్కెట్ యార్డు లో.పి. ఏ.సి.ఎస్ సెంటర్ లో ధాన్యం నిల్వలు పరిశీలిం చారు. ఇప్పటివరకు ఎన్ని సంచులు రైస్ మిల్లుకి తరలించారు. ఇప్పటివ రకు 10 వేల బ్యాగ్ లు రైస్ మిల్ కు వెళ్లిపోయాయని ఇంకా 10 వేల సంచుల ధాన్యం మార్కెట్ యార్డులో ఉందని తెలిపారు. గన్ని లను వెంటనే సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ పౌర సరఫరాల సంస్థ అధికారితో మాట్లాడి ఆదేశిం చారు. రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచిం చారు. కచ్చితంగా ప్యాడి క్లీనర్ లను ఉపయో గించి చెత్త, తాలు లేని ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చి ప్రభుత్వం మద్దతు ధర పొందాలని సూచించారు.

## 'భూభారతి' రైతన్నలకు వరం

### కలెక్టర్ సిక్తా పట్నాయక్



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** ఎన్నో సంవత్సరాలుగా రైతు లు ఎదుర్కోంటున్న భూ సమ స్యలకు భూ భారతి చట్టం ద్వారా పరిష్కరం లభిస్తుందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ స్పష్టం చేశారు. రైతులు ఈ కొత్త చట్టం లోని సెక్షన్ల పై అవగాహన పెంచుకోవాలని ఆమె సూచించారు. భూ భారతి చట్టం పై రైతులకు అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న అవగాహన సదస్సు లలో భాగంగా శుక్రవారం కొడంగల్ నియోజకవర్గం కోస్గి మండల కేంద్రం లోని లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాల్ లో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భూ భారతి అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజ రయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. ధరణిలో ఉన్న సమస్యలను గుర్తించి ధరణి స్థానంలో రైతులకు మేలైన చట్టం తేవాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ధరణిని రద్దుచేసి రైతు సంఘాలు, రెవెన్యూ అధికారులు, మేధావు లతో చర్చలు జరిపి ధరణి స్థానంలో భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చింద న్నారు. కింది స్థాయి అధికారుల వద్ద పొరపాట్ల జరిగితే లేదా పని కాకపో యినా పై స్థాయి అధికారులు న్యాయం చేసే అవకాశం భూ భారతిలో ఉంద న్నారు. ధరణిలో రూల్స్ లేవని, కానీ భూ భారతిలో నిర్దిష్టమైన రూల్స్ ఉన్నా యని తెలిపారు.జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయ కుమార్, సింగిల్ విండో అధ్యోక్షుడు భీమ్ రెడ్డి. తహసిల్దార్లు బక్క శ్రీనివాస్, భాస్కర్ స్వామి, ఎంపీడీవో శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, కోస్గి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రఘు వర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యలపై దరఖాస్తుల స్వీకరణ వేగవంతం

### కలెక్టర్ సిక్తా పట్నాయక్



**ప్రజాపక్షం/మద్దూర్:** రైతుల నుంచి భూ సమస్యలపై దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నా యక్ సూచించారు. భూ భారతి చట్టం అమలుకు పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన మద్దూర్ మండలంలోని అన్ని గ్రామాలలో భూ భారతి రెవెన్యూ అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ మద్దూరు మండలంలోని దమగన్‌పూర్, నాగిరెడ్డి పల్లి గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులను జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బేన్ షాలోమ్ తో కలిసి సందర్శించారు. దమగాన్‌పూర్ సదస్సులో 42 మందికి గతంలో ఇళ్ల పట్టాలు ఇచ్చినా నేటికి స్థలాలను మాత్రం కేటాయించలేదని బాధి తులు సదస్సులో కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన కలెక్టర్ బాధితులను నుంచి దరఖాస్తులు తీసుకుని, సమస్య పరిష్కారానికి కృషి చేయాలని తాహసీల్దార్ మహేష్ గౌడ్ కు సూచించారు. గ్రామాలలో ఎక్కువగా రైతులు ఎలాంటి భూ సమస్యలపై దరఖాస్తులు ఇస్తున్నారని అక్కడి రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులు చిన్న చిన్న సమస్యలను అధికారులు పరిష్కరించాలన్నారు. అనంతరం కలె క్టర్ మద్దూరు తాహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని భూ భారతి పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఇంతవరకు మండలంలో నిర్వహించి రెవెన్యూ సదస్సులలో గ్రామాల వారీగా రైతులు ఇచ్చిన దరఖాస్తులు, వాటి పరిష్కారానికి అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై గంట పాటు అదనపు కలెక్టర్ బేన్ షాలోమ్, ఆర్డీఓ రామచంద్రనాయక్, పైలెట్ ప్రాజెక్టు ప్రత్యేక అధికారి యాదగిరి, రెవెన్యూ అధికారుల బృందంతో సుదీర్ఘంగా చర్చించి తగిన సలహాలు సూచనలు ఇచ్చారు.

## రైతు కుటుంబానికి ప్రమాదబీమా అందజేత



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** గత సంవత్సరం మహాదేవునిపేట గ్రామానికిచెందిన బోయ చిన్నచెన్నయ్య వ్యవసాయపొలంలో విద్యుదాఘాతంతో నీటిగుంతలోపడి చనిపోవ డంతో తెలంగాణ గ్రామీణబ్యాంక్ అధికారులు గురువారం బాధిత కుటుంబానికి రూ.20లక్షల చెక్కును అందజేశారు. చనిపోయిన బోయచిన్న చెన్నయ్య బిజినేపల్లి లోగల తెలంగాణ గ్రామీణబ్యాంకులో రూ.వెయ్యి చెల్లించి ప్రమాదబీమా పాలసీతీ సుకొని ఉన్నందున అతని కుటుంబానికి రూ.20లక్షల ప్రమాదబీమా చెక్కును అతని కుటుంబానికి అందజేశారు. బ్రాంచ్‌మేనేజర్ చంద్రశేఖర్, ఫీల్డ్ ఆఫీసర్ త్రినాథ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోరైతులు ప్రతిరైతు వ్యక్తిగత ప్రమాదపాలసీ, హెల్త్ పాలసీలు తీసుకోవాలని రైతులకు వివరించారు. ఎస్‌బిఐ రీజినల్ మేనేజర్ జిలానీ భాష, ఎస్‌బిఐ బిడిఎం సంతోష్, శ్యామ్, గ్రామస్తులు రాజేందర్‌రెడ్డి, బాలపీరు, నారాయణచారి, బాలస్వామి, రవి,రాము, శేఖర్, వెంకటయ్య, పర్వతాలు, కృష్ణ, బాల్‌నాగయ్య, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాధవరెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

## 2030నాటికి మలేరియా పూర్తిగా నిర్మూలన




**ప్రజాపక్షం/బిజినేపల్లి :** మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పాలెంగ్రామంలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన అవగాహన ర్యాలీని స్థానిక వైద్యా ధికారి డాక్టర్ ప్రియాంక ప్రారంభించారు. ప్రపంచ మలేరియా దినోత్సవం ర్యాలీ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలనుండి అంబే ద్కర్ విగ్రహం వరకు నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ 2030నాటికి మలేరియా పూర్తిగా నిర్మూలనకై వైద్యసిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. కార్య క్రమంలో డాక్టర్ సత్యలక్ష్మి , డాక్టర్ సాయిరాంగౌడ్, సిహెచ్ఓ లీలావతి, ఎంపిహెచ్ఓ బాదంరాజేశ్వర్, హెల్త్ అసిస్టెంట్ గోవ ర్ధన్, ఎఎన్ఎం గజవర్ధనమ్మ, ఆరోగ్యమిత్ర మౌలాలి, ల్యాబ్‌టె క్నిషియన్ వెంకటేష్, స్టాఫ్‌నర్సు శాంతి, ఆశావర్కర్ జయమ్మ, పార్వతి, షమీం, విజయలీల పాల్గొన్నారు.

## పెట్రోల్ పంపులలో సౌకర్యాల్లేవ్!



**ప్రజాపక్షం / పెబ్బేరు :** పెబ్బేరు మండల పరిధిలోని పెట్రోల్ బంకులలో వినియోగదారులకు కనీస సౌకర్యాలు బంక్ నిర్వా హకులు కల్పించాలని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ సంఘం ప్రతినిధులు తరుణ్ ఆంజనేయులు వనపర్తి జిల్లా సప్లై ఆఫీసర్ కాశీ విశ్వనాథ్‌కు విజ్ఞాపన పత్రాన్ని అందించారు. పెబ్బేరు మండలంలోని కాక జిల్లాలో పెట్రోల్ పంపులు కనీస వసతు లన తాగునీరు, మరుగుదొడ్లు, వాహనాలకు ఉచిత గాలి, మెడి కల్ కిట్ , అత్యవసర సమయాలలో మొబైల్ ఫోన్స్ సౌకర్యం, అగ్నిమాపక నిధోక యంత్రాలు ఖచ్చితంగా ఏర్పాటు చేయిం చాలని కోరారు. డిఎస్ఓ కాశి విశ్వనాథ్ స్పందించి వినియో గదారులకు కనీస సౌకర్యాలు కల్పించాలని పెట్రోల్ బంకు యజమానులకు ఆదేశాలిస్తానన్నారు.

## శాంతి సామరస్యంతోనే మానవ మనుగడ

### సామాజికవేత్త, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హనీఫ్ అహ్మద్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** జమ్మూ కాశ్మీర్ లోయలోని పహల్గాం వద్ద పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి ఘటన మానవత్వం పై జరిగిన దాడిగా భావిస్తున్నామని ఇలాంటి ఘటనలు పున రావృతం కాకుండా భారత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ఉక్కు పాదంతో అణిచివేయాలని తెలంగాణ ఉద్య మకారుడు ప్రముఖ సామాజిక వేత్త కాంగ్రెస్ సీని యర్ నాయకుడు హనీఫ్ అహ్మద్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మహబూబ్‌నగర్‌లో మాట్లా డుతూ అమాయకులైన పర్యాటకుల ప్రానాలను బలిగొనడం సంఘవిద్రోహశక్తుల పైశాచిక ఆనం దానికి పరాకష్టగా పేర్కొన్నారు. ఇలాంటి ఘటన లను ఉగ్రవాద చర్యలను భారత ప్రభుత్వం అణచి వేయాలని కోరారు. ఈ అమానవీయ ఘటనపై కేంద్ర ప్రభుత్వం హై లెవెల్ కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. బాధిత కుటుంబాలకు దేశ ప్రజలందరూ అండగా ఉన్నారని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. శాంతి సామరస్యంతోనే ఈ భూగోళంపై మానవ మనుగడ సాధ్యమని చెప్పారు. ఇస్లాం మతం తీవ్ర వాదానికి పూర్తి వ్యతి రేకమని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. నెలలో వేల మంది పర్యాటకులు సందర్శించే ప్రదే శంలో ఒక్క కానిస్టేబుల్ కూడా భద్రత కోసం ఏర్పాటు చేయకపోవడం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. దేశ సరి హద్దులోని అన్ని చెక్‌పోస్టుల వద్ద భద్రతను పటిష్ట వంతం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయ పడ్డారు. సున్నితమైన ఇలాంటి క్లిష్టమైన సమ యంలో సంయమనముతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజల మధ్య మతాల మధ్య విద్వేషాన్ని రెచ్చగొట్టే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు.

## కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయండి



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** మేడే అమరవీరులస్ఫూ ర్తితో గ్రామగ్రామాన ఉత్సవాలను జరుపుకుందామని ఎఐటి యూసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్ అన్నారు. ఎఐటి యూసి ముఖ్యకార్యకర్తల సమావేశం భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లాకార్యదర్శి చాంగట్లవెంకటస్వామి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఎఐటియూసి జిల్లాప్రధాన కార్య దర్శి శివశంకర్ పాల్గొని మాట్లాడుతూ మేడే ఉత్సవాలను ఘనంగా గ్రామగ్రామాన జరుపుకోవాలని అమరవీరులస్ఫూ ర్తితో 139వ మేడే సందర్భంగా కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు చొరవ చూపి కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్‌చేయాలన్నారు. కాంట్రాక్టు వ్యవస్థనురద్దుచేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిం చాలని 44చట్టాలను సవరించి నాలుగుకోడ్‌లుగా విభజించా లన్నారు. ప్రైవేట్‌సంస్థలు విచ్చలవిడిగా అభివృద్ధిచెందిన తరు ణంలో ప్రైవేట్‌రంగంలోకూడా రిజర్వేషన్లు కల్పించాలన్నారు. మేడేను నాగర్‌కర్నూల్ జిల్లావ్యాప్తంగా అన్నిగ్రామాలలోఘ నంగా నిర్వహించాలన్నారు. ఎఐటియూసి జిల్లాసహాయ కార్యదర్శి బండిలక్ష్మిపతి, ఎఐటియూసి పెయింటర్ ఆసోసి యేషన్ , జిల్లా నాయకులు కేశముల శివకృష్ణ, హమాలియూ నియన్ నాయకులు గొర్లసత్యం, ఆటోడ్రైవర్ నాయకులు పరు షరాం పాల్గొన్నారు.

## ప్రజాపాలనలో అభివృద్ధి సుభిక్షం



**ప్రజాపక్షం/వెల్దండ :** రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ ప్రజా పాలనలో గ్రామాలు, గిరిజన తండాల్లో సంక్షేమపథకా లను అమలుజరిపి ప్రజలకు అభివృద్ధిని సుభిక్షం చేస్తు న్నారని మండలకాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు ఎం.మోతిలా ల్‌నాయక్ అన్నారు. శుక్రవారం ఎఐసిసి పిలుపుమే రకు గానుగట్టుతండాల్లో జైబాపు, జైభీమ్, జైసంవి ధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వహయాంలోనే గ్రామీణ ప్రాంతాలలో, గిరిజన తండాల్లో దళిత, గిరిజన అణగారినవర్గాల ప్రజ లకు అనేక రాజ్యాంగహక్కులతో ఆర్థిక, రాజకీయ, సామాజికరంగాలలో అభివృద్ధితోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించిందన్నారు. గత బిఆర్ఎస్ పాలనలో ప్రజాభివృద్ధిని ఆటకెక్కించి దళారుల చేతిలో రాష్ట్రసంపదను దాచిపెట్టి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టివేశారన్నారు.కిసాన్‌సెల్ తాలుకా అధ్య క్షులు పర్వత్‌రెడ్డి, యువజనకాంగ్రెస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి తక్కళ్లపల్లి శేఖర్, మాజీ సర్పంచ్ పత్యానా యక్, పట్టణకాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు ఎర్రశ్రీను, యువజన కాంగ్రెస్ మండలమాజీ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, మహిళా నాయకురాలు రాణి పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### దేవరకద్ర ఎమ్మెల్యేమధుసూదన్‌రెడ్డి



**ప్రజాపక్షం/ మహబుబ్ నగర్ ప్రతినిధి:** రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుం దనిదేవరకద్ర శాసనసభ్యులు జి. మధు సూధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం దేవరకద్ర మండలం శ్రీనివాస ఫంక్షన్ హాల్ లో భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టం పై రైతులకు అవగాహన కార్య క్రమం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ ఈ చట్టం పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. గ్రామాల్లో చర్చించాలని రైతులు, మహిళా సంఘాలను కోరారు. ధరణి అనే మహమ్మారిని కే.సీ.ఆర్ నెత్తిన రుద్దారని, ధరణి లో లక్షల భూ ములు నిషేధిత జాబితా లో వెళ్లినట్లు తెలిపారు. కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వ హించే ప్రజా వాణి కార్యక్రమంలో వచ్చే దరఖా స్తులలో 80 శాతం భూ సంబంధిత సమస్యలు వస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఎలాంటి భూ సమస్యలున్నప్పటికీ కోర్టులను ఆశ్రయించ కుండా అధికారుల స్థాయి లోనే సమస్యలు పరిష్కరించే వెసులు బాటును భూ భారతి చట్టం తీసుకువచ్చిందన్నారు. రెవెన్యూ అదనపు కలె క్టర్ మోహన్ రావు, ఆర.డి.ఓ నవీన్, నియోజక వర్గ ప్రత్యేక అధికారి, జిల్లా సహకార అధికారి శంకరాచారి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, తహశీల్దార్ కృష్ణయ్య, ఎం.పి.డి.ఓ శ్రీనివాస్ రావు, తదితరులు పాల్గోన్నారు.

## దళారులతో.. జాగ్రత్త!

**ప్రజాపక్షం / వీపనగండ్ల:** రైతులు కష్టపడి పండిం చిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్నివిక్రయించాలని మండల మహిళా సమైక్య ఏపిఎం బుచ్చన్న, అధ్యక్షురాలు శాంతమ్మ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పుల్గర్ చర్లలో మహిళా సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. తాళ్లు లేకుండా ఉండాలని, 14 శాతం తేమ ఉండా లని వారు సూచించారు. కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం, సేదతీరెందుకు నీడ సౌకర్యం, గన్ని బ్యా గుల కొరత లేకుండా చూడాలని, తేమ నిర్ధారణ విష యంలో అన్నదాతలను ఇబ్బందులకు గురి చేయ కూడదన్నారు. డబ్బులను వారి ఖాతాల్లో వెంటనే జమ చేయాలన్నారు. గ్రామ మాజీ సర్పంచ్ బిజ్జు నరేష్ , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోటి రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్య దర్శి నాగరాజు, నాయకులు గురుక కురుమయ్య, నర్సింహరెడ్డి, నరేష్ తదితరులు ఉన్నారు.



## నకిలీ మందులు అమ్మితే చర్యలు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** రైతులకు నకిలీ క్రిమిసంహారక మందులు, విత్తనాలు విక్రయిస్తేచర్యలు తప్పవని వ్యవసాయ కమిషన్ డై రెక్టర్ కెవిఎన్‌రెడ్డి హెచ్చరించారు. వరిపంటకు క్రిమి సంహారకమందు వినియోగించి నష్టపోయిన నాగర్‌కర్నూల్ మండలం చందుబట్ల, నర్సా యిపల్లి గ్రామాలలో శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి అనే రైతులవరిపంటలను కెవిఎన్‌రెడ్డి వ్యవసాయశాఖ అధికారులు , పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన క్షేత్రం శాస్త్రవేత్తలతో కలిసి శుక్రవారం పరిశీలించారు. కెవిఎ న్‌రెడ్డి మాట్లాడుతూ రైతులను మోసంచేసి నష్టంచేకూర్చే ఏజేన్సీల చర్య లను సహించేదిలేదని హెచ్చరించారు. నకిలి విత్తనాలు క్రిమిసంహారక మందులు విక్రయించే ఏజేన్సీలపై ప్రభుత్వపరంగా కఠిన చర్యలు తీసు కుంటామన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## గుండాల మండలానికి తహసీల్దార్‌ను నియమించాలి



ప్రజాపక్షం/గుండాల: యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలానికి తహశీల్దార్‌ను నియమించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కుసుమాని హరిచంద్ర ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్‌తో పాటు, ఆర్ఐ కూడా లేకపోవ దంతో డిప్యూటి తహశీల్దార్‌తోనే ప్రభుత్వ కార్యక్రమాలు నెట్టుకొస్తున్న పరిస్థితి నెలకొంది. మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం చాలా మంది ప్రజలు, రైతులు తహశీల్దార్ కార్యాలయానికి వస్తూ ఉంటారని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్, ఆర్ఐలు లేకపోవడంతో పనులు ముందుకు సాగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు నెలకొంటున్నాయని, ప్రభుత్వ కార్యక్రమాలు సైతం ముందుకు సాగలేని పరిస్థితి నెలకొందని తక్షణమే మండలానికి తహశీల్దార్‌ను, ఆర్ఐను అధికారులను నియమించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

## జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాతి సవీందర్‌కు సన్మానం



ప్రజాపక్షం/సూర్యాపేట: కేసుల్లో ఉన్న నేరస్తులకు శిక్షల అమలు పెరిగిందని జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. శుక్రవారం మోతె పోలీస్ స్టేషన్ పరిధిలో 2021లో మూఢనమ్మకాలకు పోయి కన్న కూతిరిని నరబలి ఇచ్చిన కేసులో సూర్యాపేట జిల్లా మొదటి అదనపు సెషన్స్ కోర్టు నేరానికి పాల్పడిన తల్లికి ఉరి శిక్ష విధిస్తూ ఈనెల 11న ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కేసులో బాధితుల తరపున కేసు వాదనలు వినిపించిన జిల్లా మొదటి పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాతి సవీందర్‌ను శుక్రవారం జిల్లా ఎస్‌పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసు దర్యాప్తులో పోలీస్ శాఖ సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ నాణ్యమైన దర్యాప్తును కొనసాగిస్తుందన్నారు. జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్‌లో కోర్టు డ్యూటీ పోలీస్ అధికారి విధులను సమర్ధవంతంగా నిర్వహిస్తూ కోర్టులతో సమన్వయంతో పని చేస్తున్నారని తెలిపారు. నేరాల్లో పక్కా ఆధారాలు సేకరించి రికార్డ్స్ నమోదు చేసి కేసుల దర్యాప్తులో జోడిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు పోలీస్, లైజన్ అధికారి, హెడ్ కానిస్టేబుల్ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

## యువజనులకు ఉపాధి కల్పన రక్షణ సాధనకు పోరాడుదాం

ఈనెల 29 యాదగిరిగుట్టలో జరుగు ఎఐవైఎఫ్ మూడవ మహాసభకు తరలిరండి



ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : యువజన యువకులకు ఉపాధి కల్పన రక్షణ సాధనకై పోరాడుదాం అని, ఈనెల 29 యాదగిరిగుట్టలో జరుగు ఏవైఎఫ్ మూడవ మహాసభకు తరలి రావాలని తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్ అన్నారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా తెలంగాణ ప్రజానాట్యమండలి ముఖ్య కార్యకర్తల సమావేశం భుషపాక నరసింహ అధ్యక్షతన జరిగింది. యువకులకు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఉపాధి అవకాశాలు కల్పించాలని నిరుద్యోగ భృతి పెన్షన్ అమలు చేయాలని చెక్క వెంకటేష్ తెలిపారు. బడుగు బలహీన వర్గాల యువకులకు రెండు ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతంలో నిరుద్యోగులు ఉన్న యువకుల సమస్యలు చర్చించ బడతాయని వాళ్ల సమస్యల పరిష్కారం కోసం మహాసభలో చర్చించబడతాయని అన్నారు. ఈ మహాసభకు ర్యాలీకి కళాకారులు కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి గౌద శ్రీరాములు, పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, ఇంజా హేమలత, సోమన సబిత, చింతల మల్లేష్, వస్తువుల అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యం, నాణ్యత లోపంతో కొనసాగుతున్న ప్రాజెక్టు పనులు



ప్రజాపక్షం/ నాంపల్లి: లక్ష్మణాపురం ప్రాజెక్టు పనుల్లో నాణ్యత లేదని అధికారుల, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనుల్లో జాప్యం జరుగుతుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ అంజయ్య చారి అన్నారు. శుక్రవారం మండలంలోనీ లక్ష్మణాపురం ప్రాజెక్టు పనుల తీరును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో ఇరిగేషన్ అధికారులు జేఈ, డిఈ, ఎఈ ల పర్యవేక్షణ లేదని, పనులలో నాణ్యత లోపంతో నిర్మాణం అవుతున్నాయని ఆరోపించారు. ముందు తరాల కోసం నిర్మించే ఈ ప్రాజెక్టు పనులు నాణ్యతతో నిర్మించకుండా, పర్యవేక్షణ లేకుండా పనులు జరగడం ఏంటని ఆరోపించారు. ఉన్నతాధికారులు ప్రాజెక్టు పనులు పర్యవేక్షణ చేసినిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు కాంట్రాక్టర్ల పై చర్యలు తీసుకొని బిల్లులు నిలిపి వేసేలా చూడాలని కోరారు. ఆయన వెంట సిపిఐ మండల కార్యదర్శి సుదన బోయిన రమేష్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు జనం పాట జగన్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఊరిపాక వెంకటయ్య, నేతాళ్ల రాజు, మండల కార్యవర్గ సభ్యులు కోరే సత్తయ్య, అగ్గిరాజు, దశరథ, గుడ్డేటి సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం



ప్రజాపక్షం/భువనగిరి : బడ్జెట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం యాదాద్రి భువనగిరి జిల్లాలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడాల జలంధర్ రెడ్డి అధ్వర్యంలో స్థానిక వివెర హోటల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి రాష్ట్ర అధ్యక్షులు శేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జగ్గు మల్లారెడ్డి, కోశాధికారి జె.శ్రీనివాసరావు, నారాయణ రెడ్డి హాజరయ్యారు. అనంతరం పలువురు మాట్లాడుతూ బడ్జెట్ స్కూల్ సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. బడ్జెట్ స్కూల్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు లైఫ్ ఇన్సూరెన్స్ విధానాన్ని తీసుకురావాలని రాష్ట్ర కమిటీ తీర్మానం చేసింది. అనంతరం యా దాద్రి భువనగిరి జిల్లా బిస్మార్ట్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మిర్యాల దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా చిట్టి బాబు, కోశాధికారిగా ప్రభాకర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బసవ రెడ్డి, జాయింట్ సెక్రటరీగా కోణార్క్ రావు నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు డిగ్రీ కళాశాల రాష్ట్ర అధ్యక్షులు బొజ్జ సూర్యనారాయణ రెడ్డి, ప్రైవేట్ జూనియర్ కళాశాల అసోసియేటెడ్ ప్రెసిడెంట్ మల్లేశం, మహాత్మా గాంధీ యూనివర్సిటీ కోశాధికారి ప్రవీణ్, వివిధ పాఠశాలల కరెస్పాండెం ట్లు, ప్రిన్సిపాల్, యజమానులు కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరయ్యారు.

# పేదలందరికీ ఇండ్లు ఇవ్వడమే ధ్యేయం

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఇండ్లు లేని నిరుపేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని లక్ష్మీ పురం గ్రామంలో 80 మంది నిరుపేదలకు ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ఇండ్ల పట్టాలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం ఇచ్చిన వాగ్ధానాలన్నింటిని నెరవేరుస్తుందని అన్నారు. ముఖ్యంగా ఆరు గ్యారెంటీలను అమలు చేసి ప్రజా ప్రభుత్వమని నిరూపించుకుంటుందన్నారు. లక్ష్మీ పురం గ్రామంలో నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇచ్చేందుకు 2022లో సర్వే నెం. 437లో 4.37 ఎకరాల భూమిని కొనుగోలు పథకం కింద కొనుగోలు చేసినప్పటికీ గత ప్రభుత్వం అప్పటి నుంచి పెండింగ్‌లో పెట్టడం జరిగిందన్నారు. తాను ఎమ్మెల్యేగా అయిన తరువాత గుట్టలతో నిండిన ఈ స్థలాన్ని చదును చేయించి లేఅవుట్ ఏర్పాటుచేసి పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇందుకు కృషి చేసిన రెవెన్యూ అధికారులు సబ్ కలెక్టర్, తహసీల్దార్‌ల పాత్ర మరువలేనిదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా ఎక్కడా లేని విధంగా 80మంది పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వడం సంతోషసంగా ఉందన్నారు. పట్టాలు ఇచ్చిన ఈ ఇంటి స్థలంలోనే ఇందిరమ్మ ఇండ్లు సైతం నిర్మించి ఇస్తామని, ఇందిరమ్మ కాలనీగా ఏర్పాటు చేస్తామన్నారు. దీని పైలట్ ప్రాజెక్టుగా తీసుకోని పట్టాలు పొందిన వారందరికి ఇండ్లు కట్టిస్తామన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్, తహసీల్దార్ హరిబాబు తదితరులు ఉన్నారు.



## పహల్గామ్ ఉగ్రదాడి అమానవీయం

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్

ప్రజాపక్షం/సూర్యాపేట: జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడి అమానవీయమని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ ధర్మభిక్షం భవన్‌లో కృష్ణారెడ్డి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి ఉగ్రవాద దాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదులు దేశ పౌరులపై కాల్పులు జరిపి హత్య చేయడం అనాగరిక చర్య అని ఈ దాడిని దేశంలోని పౌర సమాజం అంత ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. ఉగ్రవాదు కేవలం హిందువులే లక్ష్యంగా చేసుకొని కాల్చి చంపడం దేశంలో మతసామర్యానికి దెబ్బతీయడానికేనని స్పష్టమవుతుందన్నారు. ఈ దాడిలో కొంతమందికి తీవ్ర గాయాలయ్యాని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యాటకులపై జరిగిన ఉన్మాద చర్యలకు వ్యతిరేకంగా బాధిత కుటుంబాలకు అండగా దేశ ప్రజలు నిలబడాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. మేడే ఉత్సవాలపై చర్చించారు. జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు, హనుమంతరావు, మల్లేశ్వరి, బూర వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, లత్తు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

ప్రజాపక్షం/డిండి : ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యపు కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు తార్పాలిన్‌లు, టెంట్, మంచినీటి సదుపాయం కల్పించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి. మైనోద్దీన్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వేసవిలో రోజురోజుకు ఎండల తీవ్రత అధికమవుతున్న తరుణంలో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తమ ధాన్యాన్ని అరబెట్టుకొనే సమయంలో వారికి ఎండ తీవ్రత నుండి ఉప శమనం కల్పించేందుకు వీలుగా రైతులకు మంచి నీటి సదుపాయం, టెంట్‌లు ఏర్పాటు చేసి వడదెబ్బకు గురికాకుండా చూడాలని అన్నారు. ఎండ లు మండుతున్న నేపథ్యంలో తక్షణమే కొనుగోలు కేంద్రాల వద్ద టెంట్‌తో పాటు మంచి నీటి సదుపాయం కల్పించాలని మైనోద్దీన్ అన్నారు.

## మే 3వరకు ఆసరా పింఛన్లు పంపిణీ

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: జిల్లాలో వివిధ రకముల చేయూత ఆసరా పింఛన్లు మే 3వరకు పంపిణీచేస్తున్నట్లు డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి తెలిపారు. పింఛన్లు పొందుతున్న పింఛన్దారులు వృద్దాప్య, వితంతు, వికలాంగుల, చేనేత, కల్లుగీత, ఒంటరి మహిళలు మీ ప్రాంతంలో ఉన్నటువంటి పోస్ట్ ఆఫీస్‌ల ద్వారా పింఛను మొత్తము నేరుగా పొందవలన్నారు.ఎవరు కూడ మధ్య దళారీలను నమ్మ వద్దన్నారు.పింఛను పొందుటకు ఎటువంటి సొమ్ము చెల్లించవలసిన అవసరము లేదాని పింఛను మొత్తము సొమ్ము రూ.16 తో సహా అడిగి తీసుకోవాలని సూచించారు.

# నిబంధనల ప్రకారం ఖైదీలకు సౌకర్యాలు

రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ జస్టిస్ షమీం అక్తర్



ప్రజాపక్షం/నల్లగొండ: జిల్లా జైలులో ఖైదీలకు అన్ని వసతులతో పాటు, జైలు పరిశుభ్రంగా ఉందని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ జస్టిస్ షమీం అక్తర్ తెలిపారు. ఒకరోజు నల్లగొండ జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం అయన జిల్లా కేంద్రంలోని జిల్లా జైలును సందర్శించారు. జైలులోని అన్ని బ్యారక్స్ ను, వంటగదిని, ఖైదీలకు పెట్టే ఆహార పదార్థలను, భోజనాన్ని అన్నిటిని పరిశీలించారు. అంతేకాక ఖైదీలతో మాట్లాడి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం జైలు బయట మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ నల్గొండ జిల్లా జైలులో సుమారు 177 మంది ఖైదీలు ఉన్నారని, అందులో 21 మంది మహిళా ఖైదీలు ఉన్నట్లు తెలిపారు. జైలులో సౌకర్యాలన్నీ పరిశీలించడం జరిగిందని, అన్ని బ్యారక్స్ ను పరిశీలించానని, అధికారుల ప్రవర్తన, సౌకర్యాలు, తదితర వివరాలగురించి ఖైదిలతో మాట్లాడి తెలుసుకోవడం జరిగిందని, జిల్లా జైలు పరిశుభ్రంగా ఉండటమే కాకుండా, నిబంధనల ప్రకారం ఖైదీలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారని, ముఖ్యంగా ఖైదీలకు భోజనం ,ఇతర సౌకర్యాలు బాగున్నాయని ,వంటగది బాగుందని , జైలులోఎలాంటి ఇబ్బందులు లేవని చెప్పారు. ఖైదీల నుండి ఎలాంటి ఫిర్యాదులు లేవని తెలిపారు. ఖైదీలలో కొంతమంది నైపుణ్యం కలిగిన వారు ఉన్నారని తెలిపారు. నియమ ,నిబంధనల ప్రకారం జిల్లా జైలును బాగా నిర్వహిస్తుండడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్ కు జిల్లా జైలు సూపరింటెండెంట్ ప్రమోద్ జైలులో ఖైదీల వివరాలు ,సౌకర్యాలు, ఏర్పాట్లు, తదితర వివరాలను తెలియజేశారు. ఖైదీల సంక్షేమంలో భాగంగా వారి కోసం చేపట్టే కార్యక్రమాలను వివరించారు .జిల్లా జైలర్ బాలకృష్ణ ఉన్నారు.అంతకుముందు ఆర్అండ్‌బి అతిథి గృహం వద్ద రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్ కు నల్లగొండ ఆర్‌డిఓ వై. అశోక్ రెడ్డి, అడిషనల్ ఎస్‌పి రమేష్, డిఎస్‌పి శివరామిరెడ్డి, తహసిల్దార్ శ్రీనివాస్, తదితరులు పూల మొక్కలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయన జిల్లాలో ధాన్యం కొనుగోలు, ప్రభుత్వ ఆసుపత్రులద్వారా అందిస్తున్న సేవలు, సంక్షేమ హాస్టల్ల ద్వారా అందిస్తున్న సేవలు, ఇతర కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కోదాడ, మునగాల, నడిగూడెం, అనంతగిరి, చిలుకూరు మండలాలకు చెందిన ఎంఈఓ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఫౌండేషన్ లీటరసీ న్యూమరసి(ఎఫ్ఎల్ఎస్) పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందనే నమ్మకం విద్యార్థుల్లో కల్పించి వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థుల సంఖ్యను పెంచేలా కృషి చేయాలన్నారు. ప్రతి రోజు విద్యార్థులకు తెలుగు రాయడం, చదవడం నేర్పించేలా ఉపాధ్యాయులు సమయం కేటాయించాలన్నారు. ఉపాధ్యాయులు బాధ్యతగా ఉంటూ గత సంవత్సరం జరిగిన వైఫల్యాలను సరి చేసి వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించాలన్నారు. ఎల్ఎఫ్ఎల్‌పై జిల్లా, మండల స్థాయిలో సమీక్షలు నిర్వహించాలన్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచేలా ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించాలని చెప్పారు. ఈ సమావేశంలో డిఈఓ అశోక్, క్వాలిటీ కో ఆర్డీనేటర్ జనార్ధన్, ప్లానింగ్ కో ఆర్డీనేటర్ శ్రవణ్ కుమార్, ఇంక్లూజివ్ కోఆర్డీనేటర్ రాంబాబు, జనరల్ ఈక్వాలిటీ కో ఆర్డీనేటర్ పూలమ్మ, ఎంఈఓలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

## రైతులకు ప్రభుత్వం ఉచితంగా న్యాయ సాయం

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



ప్రజాపక్షం/కోదాడ (నడిగూడెం): భూ సమస్యల పరిష్కారం కోసం రైతులకు ప్రభుత్వమే ఉచితంగా న్యాయ సహాయం చేస్తుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. శుక్రవారం నడిగూడెం మండల కేంద్రంలోని కొల్లు పాపయ్య ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన భూ భారతి చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక తెల్లకాగితం ద్వారా పెద్ద మనుషుల మధ్య కొనుగోలు చేసిన భూముల క్రమబద్దీకరణ చేయుటకు సాదాబైనామా ద్వారా 2020లో దరఖాస్తులు స్వీకరించారు. కాని ధరణి చట్టం వల్ల అమలు కాలేదని, ఇప్పుడు భూభారతి ద్వారా సాదాబైనామా దరఖాస్తులు ఆర్డీవో క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయమైన వాటిని క్రమబద్దీకరించి పట్టాదార్ పాస్ పుస్తకం జారీ చేస్తారని తెలిపారు. ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా అసైన్మెంట్ కమిటిలు వేసి రక్షించడం జరుగుతుందని తెలిపారు. కోదాడ ఆర్డీవో సూర్యానారాయణ పిపిటి ద్వారా భూ భారతి చట్టంను రైతులకు చదివి వినిపించారు. అనంతరం నడిగూడెం మండలం రామచంద్రాపురంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. నీలం శైలజ ఇంటి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారాయణ, మండల స్పెషల్ ఆఫీసర్ సతీష్‌కుమార్, తహసిల్దార్ సరిత, ఎంపీడివో సంజీవయ్య, వ్యవసాయ సంచాలకులు యల్లయ్య, మార్కెట్ కమిటి చైర్మన్ ఏపూరి తిరుపతమ్మ సుధీర్, కొల్లు రామారావు, రాజేష్, పంచాయతీ కార్యదర్శులు ఉమారాణి, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

# ఉగ్రవాదులను అంతమొందించాలి

కేంద్ర ప్రభుత్వ నిఘా సంస్థల వైఫల్యం కారణంగానే పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడి : నర్సింహారెడ్డి



ప్రజాపక్షం/దేవరకొండ: కేంద్ర ప్రభుత్వ నిఘా సంస్థల వైఫల్యం కారణంగానే కాశ్మీర్‌లోని పహాల్గంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేశారని, పోలీసు మారువేషాలలో వచ్చి విచక్షణారహితంగా పర్యాటకులపై బుల్లెట్లతో దాడుల చేసిన పాకిస్తాన్ ప్రేరేపిత లస్కరే తోయిబా ఉగ్రవాదులను అంతమొందించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం దేవరకొండ లో స్థానిక పల్లా పర్వత్‌రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయం నుండి పట్టణంలోని ప్రధాన రహదారిపై కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఉగ్రదాడిలో మరణించిన భారత పౌరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ చనిపోయిన వారికి కోటి, గాయపడిన పౌరులకు 25 లక్షల నష్టపరిహారం కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలన్నారు. ఈ కొవ్వొత్తుల ప్రదర్శన ర్యాలీలో సిపిఐ దేవరకొండ మండ ల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి, జిల్లా సమితి సభ్యులు బుచ్చిరెడ్డి, మండల సహాయ కార్యదర్శి రామస్వామి, కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి, ఆంజనేయులు, మైనోద్దీన్, వెంకట్రాములు, జ్యోతిబస్, నగేష్, యాదయ్య, శ్రీను, మల్లేష్, మధు, సైదులు, లింగమయ్య, వెంకటయ్య, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం/డిండి: కాశ్మీర్‌లోని పహాల్గంలో విచక్షణారహితంగా పర్యాటకులపై బుల్లెట్లతో దాడులు చేసిన పాకిస్తాన్ ప్రేరేపిత లస్కరే తోయిబా ఉగ్రవాదులను అంతమొందించాలని సిపిఐ డిండి మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ మృతి చెందిన భారత పౌరుల కుటుంబాలకు భారత కమ్యూనిస్టు పార్టీ డిండి మండల సమితి పక్షాన ప్రగాఢ సానుభూతిని, సంతాపం వ్యక్తం చేశారు.

## పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

జిల్లా కలెక్టర్ సంతోష్ అధికారులకు ఆదేశం

ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజీవ్ యువ నివాసం పథకంలో ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా త్వరితగతిన నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐ.డి.ఓ.సి కాన్ఫరెన్స్ హాల్‌లో రాజీవ్ యువ వికాసం పథకంపై ప్రత్యేక డిసిస బ్యాంకుల సమావేశం, ఇందిరమ్మ ఇండ్లు, ఎల్.ఆర్.ఎస్ పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 6,000 కోట్ల నిధులు వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ ,మైనార్టీల నుండి 25,000 దరఖాస్తులు అందాయని వాటిలో 8000 దరఖాస్తులను సెక్టర్ల వారీగా పారదర్శకంగా స్క్రూటీని చేయాలన్నారు. ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ఉండేలా అధికారులు ఆధార్, ఆదాయం, కుల ధృవీకరణ పత్రాలతో పాటు అర్హత ప్రమాణాలను క్షుణ్ణంగా పాటించాలని సూచించారు. దరఖాస్తులను డౌన్ లోడ్, చేసి కార్పొరేషన్ వారీగా, బ్యాంకులు శాఖల వారీగా వర్గీకరించి సోమవారంలోగా సంబంధిత బ్యాంకు మేనేజర్లకు సమర్పించాలని ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లకు కలెక్టర్ ఆదేశించారు. బ్యాంకు మేనేజర్లకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వారంలోగా అర్హత నివేదికను అందజేయాలని ఆదేశించినారు. జిల్లా స్థాయిలో దరఖాస్తులు పరిశీలన 28 మే వరకు నిర్వహించాలన్నారు. మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేశామని ఈ కమిటీలు ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించి అర్హత ఉన్నవారిని మాత్రమే ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేస్తూ, నిర్దేశించి లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.





## సిపిఐ పోరాటాల ఫలితంగా అండర్ పాస్ సమస్య పరిష్కారం

ప్రజాపక్షం/భువనగిరి : సిపిఐ పోరాటాల ఫలితంగా అండర్ పాస్ సమస్య పరిష్కారం అని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు వస్తూపుల అభిలాష్ అన్నారు. భువనగిరి అర్బన్ కాలనీలో కాలనీవాసులు వెళ్లడానికి అండర్ పాస్ కావాలని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో గత 3 సంవత్సరాలుగా దశలవారీగా ఆందోళన నిర్వహించాము. ఈ కారణంగా మున్సిపల్ అధికారులు ముఖ్యంగా శాసనసభ్యులు బీటి రోడ్డు వేయాలని త్వరితగతిన పూర్తి చేయించారు. ఇట్టి సమస్యను పరిష్కరించిన అధికారులు ఎమ్మెల్యేకి సిపిఐ పట్టణ సమితి పక్షాన కృతజ్ఞతలు తెలియజేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, పట్టణ నాయకులు చింతల మల్లేశం, పెంటయ్య, దాసరి లక్ష్మ య్య, షర్ఫుద్దీన్, రాజు సాయి కృష్ణ, కార్తీక్, బాల సాయి, భాను ప్రసాద్, రామ్ చరణ్, సంకల్పు, జావేద్ పాల్గొన్నారు.

# క్రీడ




## మహిళా వరల్డ్ కప్ సంగతేంటీ?

భారత్, పాకిస్థాన్ దౌత్య సంబంధాల్లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. పహల్గాంలో ఉగ్రవాదులు 26 మందిని పొట్టనబెట్టుకోవడంతో దాయాదితో ద్వైపాక్షిక మ్యాచ్‌లు ఆడబోమని బిసిసిఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా తెగేసి చెప్పాడు. ఇదే విషయమై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్‌కు లేఖ కూడా రాసింది బిసిసిఐ. భవిష్యత్‌లో జరిగే ఐసిసి ఈవెంట్లలో ఇరుజట్లు ఒకే గ్రూప్‌లో ఉండకుండా చూడాలని ఐసిసికి విన్నవించింది. అయితే.. ఇదంతా సాధ్యమయ్యేనా? అనేది తెలియాల్సి ఉంది. ఎందుకంటే.. ఈ ఏడాది మహిళల వన్డే వరల్డ్ కప్ పోటీలకు భారత్ ఆతిథ్యం ఇస్తోంది. భారత గడ్డపై సెప్టెంబర్‌లో జరుగనున్న మహిళా వన్డే వరల్డ్ కప్ టోర్నీకి పాకిస్థాన్ అమ్మాయిల జట్టు అర్హత సాధించింది. ఈ నేపథ్యంలో ఇండియా, పాక్ తలపడే మ్యాచ్ ఎక్కడ నిర్వహిస్తారు? అనేది ప్రశ్నార్థకంగా మారింది. అయితే.. ఈమధ్య ముగిసిన ఛాంపియన్స్ ట్రోఫీ తరహాలో దాయాదిల మ్యాచ్‌ను తటస్థ వేదికపై నిర్వహించే అవకాశముంది. అంటే ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్ దక్షిణాఫ్రికా, శ్రీలంక.. లేదంటే బంగ్లాదేశ్ గడ్డపై ఇండోపాక్ జట్లు తలపడేందుకు ఆస్కారముంది. కానీ, అందుకు ఇంకా సమయం ఉన్నందున బిసిసిఐ, పాక్ క్రికెట్ బోర్డులతో ఐసీసీ మాట్లాడనుంది. ఇరుదేశాలకు ఆమోదయోగ్యమైన వేదికను ఖరారు చేయనుంది. కానీ.. మహిళల వరల్డ్ కప్ కంటే ముందే పురుషుల ఆసియా కప్ ఉంది. దాంతో, ఈ టోర్నీని తటస్థ వేదికపై జరిపేందుకు బీసీసీఐ సన్నాహాలు చేస్తోంది. దుబాయ్, శ్రీలంక గడ్డ పై ఆసియా కప్ పోటీలు జరిగే వీలుంది. ఒకవేళ భారత్, పాకిస్థాన్‌లు ఫైనల్ చేరితే.. లీగ్ దశ.. సూపర్ 4తో కలిపి ఇరు జట్ల మధ్య మూడు మ్యాచ్‌లు ఉంటాయి.

## చెపాక్‌లో ఓడిన చెన్నై..


### 5 వికెట్ల తేడాతో హైదరాబాద్ విజయం



ఐపిఎల్ 18లో భాగంగా కీలక మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయం సాధించింది. చెపాక్ వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఎస్‌ఆర్‌హెచ్ 5 వికెట్ల +తేడాతో నెగ్గింది. తొలుత హైదరాబాద్ బౌలర్లు విజృంభించడంతో సీఎస్కే 19.5 ఓవర్లలో 154 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులో డేవాల్ బ్రెవిస్ (42) టాప్ స్కోరర్. అనంతరం బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ 18.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఇషాన్ కిషన్ (44) రాణించాడు. చెన్నై బౌలర్లలో నూర్ అహ్మద్ 2, ఖలీల్ అహ్మద్, అన్షుల్ కంబోజ్, రవీంద్ర జడేజా ఒక్కో వికెట్ తీశారు.

**చెలరేగిన హైదరాబాద్ బౌలర్లు..**

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన సీఎస్కేకు ఇన్నింగ్స్ తొలి బంతికే షాక్ తగిలింది. షమీ బౌలింగ్‌లో షేక్ రషీద్ అభిషేక్ శర్మకు క్యాచ్ ఇచ్చి డకౌట్‌గా వెనుదిరిగాడు. మరో ఓపెనర్ ఆయుశ్ మాత్రే (30: 19 బంతుల్లో 6 ఫోర్లు) దూకుడుగా ఆడాడు. ఎడాపెడా ఫోర్లు బాదాడు. నాలుగో ఓవర్లలో హర్షల్ పటేల్ బౌలింగ్‌లో సామ్ కరన్ (9) అనికేత్ వర్మకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. స్వల్పతేడాతో అయుశ్ మాత్రేను కమిన్స్ ఔట్ చేశాడు. దీంతో 47 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి చెన్నై కష్టాల్లో పడింది. ఈ క్రమంలో జడేజా (21)తో కలిసి బ్రెవిస్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. 74 పరుగుల వద్ద జడేజా ఔటైనప్పటికీ బ్రెవిస్ సిక్స్‌లతో ఇన్నింగ్స్‌కు ఊపుతెచ్చాడు. అయితే హర్షల్ పటేల్ బౌలింగ్‌లో కమిందు మెండిస్ అద్భుతంగా క్యాచ్ బ్రెవిస్ వెనుదిరిగాడు. దీంతో సీఎస్కే 114 పరుగుల వద్ద ఐదో వికెట్ కోల్పోయింది. అనంతరం హైదరాబాద్ బౌలర్లు క్రమంగా వికెట్లు తీశారు. దీంతో 19.5 ఓవర్లలో చెన్నై ఆలౌట్ అయింది. దీపక్ హుడా (22), శివమ్ దూబె (12), ధోనీ (6) భారీ స్కోర్ చేయలేకపోయారు.




## 78 ఏళ్లలో సాధించింది ఏమీ లేదు


### పాక్‌కు గావస్కర్ చురక



పాక్‌కు గావస్కర్ చురక జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు దారుణానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ ఘటనపై ప్రపంచవ్యాప్తంగా సంఘీభావం వ్యక్తమైంది. ప్రధాని నరేంద్ర మోదీ గట్టి చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. పలువురు భారత మాజీ, ప్రస్తుత క్రికెటర్లు తమ సంతాపం తెలియజేశారు. క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ కాస్త ఘాటు వ్యాఖ్యలు చేశారు. బెంగళూరు వేదికగా జరిగిన ఆర్సీబీ, ఆర్ఆర్ మ్యాచ్ అనంతరం సునీల్ గావస్కర్ ఉగ్రదాడిని ఖండిస్తూ స్పందించారు. ఉగ్రవాదులు, వారి మద్దతుదారులు 78 ఏళ్లలో సాధించింది ఏమీ లేదని, భవిష్యత్తులోనూ ఎలాంటి మార్పు ఉండదని పాక్‌కు పరోక్షంగా చురకలంటించారు. "ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా. ఇది భారతీయులందరిపైనా ప్రభావం చూపిస్తుంది. ఈ సందర్భంగా ఉగ్రవాదులను, వారికి మద్దతుగా నిలిచే వారిని ఒక ప్రశ్న అడుగుదామనుకుంటున్నా. ఇదంతా ఏం సాధించడానికి చేస్తున్నారు? గత 78 ఏళ్లలో ఒక్క మిల్లీమీటర్ భూమినైనా కదల్చగలిగిరా? వచ్చే 78 వేల సంవత్సరాల తర్వాతైనా ఎలాంటి మార్పులు ఉండవు. మరి ఎందుకు ప్రశాంతంగా జీవించకుండా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. మనం మరింత దృఢంగా ముందుకు సాగాలనేదే నా విజ్ఞాపన" అని గావస్కర్ వెల్లడించారు.

## ఆయనకు ఎన్నిసార్లు కృతజ్ఞతలు చెప్పినా తక్కువే

– మనోజ్ బాజ్‌పేయి



వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తుంటారు బాలీవుడ్ నటుడు మనోజ్ బాజ్‌పేయి. 'ది ఫ్యామిలీ మ్యాన్'తో తెలుగు ఆడియన్స్‌కు మరింత చేరువయ్యారు. తాజాగా ఆయన ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ తన కెరీర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇండస్ట్రీలో తాను ఎదుర్కొన్న ఒడుదొడుకులను వివరించారు. తాను ఎన్ని సినిమాలు చేసినప్పటికీ రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో నటించిన 'సత్య' తనకు ఎప్పటికీ ప్రత్యేకమేనన్నారు. "నటుడిగా 'బండిట్ క్వీన్' నాకు మొదటి సినిమా. కానీ, నాకు గుర్తింపు వచ్చింది మాత్రం 'సత్య'తోనే. ఆ సినిమాలో నన్ను ఎంపిక చేసుకున్నందుకు రామ్ గోపాల్ వర్మకు ఎన్నిసార్లు కృతజ్ఞతలు చెప్పినా తక్కువే. రోజూ ఆయన్ని గుర్తుచేసుకుంటుంటాను. ఆయనతో నేను వరుసగా నాలుగు సినిమాలకు పని చేశాను. మూడు చిత్రాల్లో నటించాను. ఒక దానికి నిర్మాతగా వ్యవహరించాను. ఆ దశే నేను ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడానికి, కొనసాగడానికి కారణమైంది" అని చెప్పారు.

"ఇన్నేళ్ల నా కెరీర్‌లో ఎన్నో ఒడుదొడుకులు చూశాను. చిత్ర పరిశ్రమలో కొనసాగడం అంత తేలికైన విషయం కాదు. ఎంతో పోటీని ఎదుర్కోవాలి. మనల్ని చూసి అసూయపడేవారు ఉంటారు. మనతో నవ్వుతూ మాట్లాడుతూనే.. మన వెనక మనల్ని హేళన చేసే వారుంటారు. ఇలాంటి వాళ్లను ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చాను. తొలినాళ్లలో దిగులుపడ్డాను. నేను నటించిన సినిమాలు అనుకున్న స్థాయిలో అలరించలేకపోతే కోపం వచ్చేది. ఇండస్ట్రీనే ప్రపంచం అనుకొని వచ్చాను. నటన తప్ప మరొకటి తెలియదు. ఏదేమైనా ఇక్కడే ఉండాలని నిర్ణయించుకొని అన్నిటినీ తట్టుకొని నిలబడ్డాను" అని తెలిపారు.

## 27న బెల్లంకొండ శ్రీను ఫస్ట్ లుక్!




మన టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా ఇపుడు పలు సినిమాలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇక ఈ చిత్రాల్లో భైరవం ఇంకా టైసన్ నాయుడు చిత్రాలు దాదాపు పూర్తి కావచ్చాయి. ఇక ఈ సినిమాలు కాకుండా తన నుంచి ఉన్న మరో చిత్రం తన కెరీర్ 11వ సినిమా కూడా ఉంది. దర్శకుడు కౌశిక్ పగళ్ళపాటి తెరకెక్కిస్తున్న ఈ చిత్రంతో అనుపమ పరమేశ్వరన్ మరోసారి బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌తో మరోసారి నటిస్తుంది. అయితే ఇక ఈ సినిమా ఫస్ట్ లుక్‌కి ఇపుడు మేకర్స్ డేట్‌ని ఫిక్స్ చేసేసారు. ఈ ఏప్రిల్ 27న ఈ సినిమా ఫస్ట్ ఫస్ట్ లుక్‌ని విడుదల చేస్తున్నట్టుగా డేట్ అనౌన్స్ చేసేసారు. మరి ఈ చిత్రంలో ఈ యంగ్ హీరో ఎలా కనిపిస్తాడో చూడాలి. ఇక ఈ చిత్రం కోసం ఇద్దరు సంగీత దర్శకులు సామ్ సిఎస్ అలాగే చైతన్ భరద్వాజ్‌లు సంగీతం అందిస్తుండగా షైన్ స్క్రీన్ సినిమాస్ వారు నిర్మాణం వహిస్తున్నారు.

# రీల్

## ఎన్టీఆర్ నీల్.. సలార్‌తో క్రాసోవర్ లేనట్టేనా?




మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా సెన్సేషనల్ మాస్ దర్శకుడు ప్రశాంత్ నీల్‌తో భారీ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రానికి ముందు ప్రశాంత్ నీల్ చేసిన సినిమాలు సలార్, అలాగే కేజీఎఫ్ చిత్రాల పట్ల ఆ మధ్య అంతా నీల్ సినిమాటిక్ యూనివర్స్ పై పలు క్రేజీ రూమర్స్ ఏ రకంగా హల్చల్ చేశాయో అందరికీ తెలిసిందే. అయితే వాటి క్రాసోవర్ ఏమో కానీ నటుడు, సలార్ విలన్ పృథ్వీరాజ్ సుకుమారన్ మాత్రం సలార్ కి నీల్ నుంచి మరో సినిమాకి ఓ క్రేజీ క్రాసోవర్ ఉందని రివీల్ చేయడం ఓ రేంజ్‌లో అందరినీ ఎగ్జైట్ చేసింది. అయితే ఎలాగో కేజీఎఫ్‌లో లేదని అపుడు క్లారిటీ వచ్చింది కానీ ఇపుడు ఎన్టీఆర్ నీల్‌తో ఉండొచ్చు అని అనుకున్నారు కొందరు.

## అతనితో నాది ప్రత్యేక బంధం

– సమంత



ఒక్క అంశం ఆధారంగా కెరీర్‌ను నిర్ణయించలేమని సమంత అన్నారు. తాజాగా కోలీవుడ్‌లో నిర్వహించిన గోల్డెన్ క్వీన్ పురస్కారాల్లో సమంత గోల్డెన్ క్వీన్‌గా అవార్డు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన కెరీర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అలాగే దర్శకుడు, నటుడు రాహుల్ రవీంద్రన్‌తో తన అనుబంధాన్ని పంచుకున్నారు. "నాకు ఆరోగ్యం బాగాలేనప్పుడు రాహుల్ నావెంటే ఉన్నాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ నాతోనే ఉంటూ జాగ్రత్తగా చూసుకున్నాడు. మా అనుబంధానికి పేరు పెట్టలేను. నా స్నేహితుడు, సోదరుడు, కుటుంబ సభ్యుడు, రక్తసంబంధీకుడా అని చెప్పలేను" అన్నారు. అభిమానుల గురించి మాట్లాడుతూ.. "ఇంతమంది అభిమానులను సొంతం చేసుకోవడం నా అదృష్టం. లక్‌తో పాటు నేను పడిన కష్టమే ఈరోజు ఇంతమంది అభిమానానికి కారణం. దేవుడిచ్చిన వరంగా భావిస్తాను. మనం తీసుకునే ఒక్క నిర్ణయాన్ని దృష్టిలో ఉంచుకొని కెరీర్ ఎలా ఉంటుందో చెప్పలేం. ఒకవేళ ఎవరైనా అలా డిసైడ్ చేస్తే అది అబద్ధమే అవుతుంది. తెలిసి, తెలియక తీసుకున్న ఎన్నో నిర్ణయాలు కెరీర్‌పై ప్రభావం చూపుతాయి" అని సమంత తెలిపారు.

## సంయమనం పాటించండి

(మొదటి పేజీ తరువాయి)

దిగజారాయి. ఉగ్రవాదాన్ని ఎగదోస్తూ అంతులేని దాడులను ప్రేరేపిస్తూ ఉండటంతో పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పేందుకు భారతదేశం సన్నద్ధమవుతున్నది. "పరిస్థితులు మరింత దిగజారకుండా రెండు దేశఋూలు సంయమనం పాటించాలి" అని ఐక్యరాజ్యసమితి అధికార ప్రతినిధి స్టీఫెన్ డుజార్రిక్ విజ్ఞప్తి చేశారు. ఎలాంటి సమస్యలనైనా అర్థవంతమైన చర్చల ద్వారా శాంతియుతంగా పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. పహల్గామ్‌లో కాల్పులకు బాధ్యులైన ఉగ్రవాదులను ఏరిపారేస్తామని, వారికి ఈ భూమ్మీద చోటు లేకుండా చేస్తామని భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రతిజ్ఞ చేశారు.

## 'బ్లాంకెట్ స్టే' సరికాదు

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన ప్రాథమిక హక్కులను వక్ఫ్ సవరణలు హరిస్తాయనే తప్పుడు ప్రాతిపదికన వక్ఫ్ (సవరణ)చట్టం 2025 చట్టబద్ధతను సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్లను రద్దు చేయాలని కేంద్రం ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానాన్ని కోరింది.'న్యాయస్థానం ఈ సవాళ్లను పరిశీలిస్తున్న సమయంలో సాధారణ కేసులలో ముస్లిం సమాజానికి చెందిన సభ్యులు అలాంటి ఉత్తర్వు సంబంధిత విపరీత పరిణామాలు లేకుండా బ్లాంకెట్ స్టే (లేదా పాక్షిక స్టే) పిటిషన్లు విఫలమైతే ప్రత్యేకించి అలాంటి చట్టాల చెల్లుబాటు అంచనాను ఊహించిన సందర్భంలో పున: ప్రారంభించడాన్ని పిలువరాదు'అని కేంద్రం వాదించింది. ఫలితంగా చట్టంలోని నిబంధనలను నిలిపివేసేందుకు కేంద్రం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనాన్ని అభ్యర్థించింది.చట్టంలోని నిబంధనలను నిలిపివేయాలని కాకుండా మధ్యంతర ఆదేశాలు జారీచేయాలన్న పిటిషన్లను మే 5న సుప్రీంకోర్టు ధర్మాసనం విచారించనున్నది. 2013 సంవత్సరం నుంచి వక్ఫ్ ఆస్తులు ఆశ్చర్యపోయేలా భారీగా పెరిగాయని ప్రభుత్వం అఫిడవిట్‌లో పేర్కొంది. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, రాష్ట్ర వక్ఫ్ బోర్డులలో ముస్లిములు మైనారిటీలో ఉన్నందున ఈ చట్టాన్ని మార్చాలన్న వాదనలను కేంద్ర ప్రభుత్వం తన అఫిడవిట్‌లో కొట్టిపారేసింది. పార్లమెంటరీ కమిటీ ద్వారా సమగ్రమైన, లోతైన, విశ్లేషణాత్మక అధ్యయనం తర్వాతే వక్ఫ్ చట్టానికి సవరణలు చేసినట్లు కేంద్రం అత్యున్నత న్యాయస్థానానికి తెలిపింది. మొఘల్ యుగం, స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్యం తర్వాత మొత్తం వక్ఫ్‌లు 18,29,163.896 ఎకరాల భూ మి సృష్టించినట్లు అఫిడవిట్ తెలిపింది. అయితే 2013తర్వాత దిగ్భ్రాంతికరంగా వక్ఫ్ భూమి అదనంగా 20,92,072.536కు పెరిగిందని చెప్పింది. వక్ఫ్ చట్టం రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ 72పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై ఏప్రిల్ 17న సుప్రీం కోర్టు విచారణ జరిపింది. దీనిపై మధ్యంతర ఉత్తర్వులను ఇవ్వడానికి ముందు కేంద్రం వారం రోజుల గడువుకోరగా.. సుప్రీంకోర్టు అందుకు అంగీకరించింది.తదుపరి విచారణ వరకు వక్ఫ్ ఆస్తులను డీనోటిఫై చేయబోమని కేంద్రం తెలిపింది.అప్పటివరకు వక్ఫ్ కౌన్సిల్‌లో ముస్లిమేతరులను సభ్యులుగా నియమించవద్దని సుప్రీంకోర్టు కేంద్రానికి స్పష్టం చేస్తూ, తదుపరి విచారణను మే 5వ తేదీకి వాయిదా వేసింది.

## అలజడి (మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించి ఐదురోజులుగా వాటిని కొనసాగిస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లోని బిజాపూర్‌జిల్లాలోని కొంత ప్రాంతం కూడా ఈ గాలింపు చర్యల పరిధిలోకి వచ్చింది. రాజధాని రాయ్‌పూర్‌కు 450 కి.మీ దూరంలో ఉన్న ఈ ప్రాంతంలో కూడా గాలింపు జరుగుతోంది. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ బెటాలియన్ నెం–1కు ఈ ప్రాంతం ప్రధాన కేంద్రంగా ఉందని భావిస్తున్నారు. హిడ్మా,దామోదర్ వంటి సీనియర్ మావోయిస్టు నాయకుల సారథ్యంలోతెలంగాణ రాష్ట్ర మావోయిస్టు కమిటీ, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలకు ఈ ప్రాంతం ఆవాసంగా ఉందని ఇంటిలిజెన్స్ వర్గాలు అందించిన సమాచారం మేరకు భారీ ఎత్తున ఈ గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. "ఇదెంతో కీలకమైన గాలింపు కార్యక్రమం, ఎందుకంటే దీంతో ఇక నిషేధిత సిపిఐ మావోయిస్టుల సైనికబలం అంతమైనట్టే. పిఎల్‌జిఎ బెటాలియన్ నెం–1ను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు చేస్తున్నాం, మావోయిస్టుల సైద్ధాంతిక భావజాల నాయకత్వం దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ (డికెఎస్‌జెడ్‌సి), తెలంగాణ స్టేట్ కమిటీ ఈ ప్రాంతంలో ఉన్నాయి" అని ఆ అధికారి చెప్పారు. గురువారంనాడు జరిగినకాల్పుల యుద్ధంలో చాలామంది గాయపడి ఉండవచ్చు లేదా హతులై ఉండవచ్చునని అధికారి చెప్పారు. ఈ మొత్తం ప్రాంతాన్ని గాలింపు దళాలు చుట్టుముట్టాయన్నారు. "ఈ గాలింపు చర్య ఒక టెస్ట్‌క్రికెట్ మ్యాచ్ లాంటిది, మేం ఉత్కంఠభరితమైన సమాచారాన్ని ప్రతి ప్రయత్నంలోనూ మేం సాధించలేం, అదువల్ల ఇది దీర్ఘకాలం కొనసాగుతుంది, కానీ ఆట చివరిల మాత్రం చాలా మంచి సానుకూల ఫలితాలు వస్తాయని మేం ఆశిస్తున్నాం" అని ఆ అధికారి చెప్పారు. నక్సలైట్లవల్ల ఇబ్బందులు ఎదుర్కొనే రాష్ట్రాల ప్రభుత్వాలు, అధికారులు సహా దీని సూత్రధారి కేంద్ర ప్రభుత్వం ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ గాలింపు చర్యల్లో నిమగ్నమై ఉన్నాయి అని చెప్పారు. ఇప్పటివరకూ దళాలన్నీ సురక్షితంగానే ముందుకు సాగుతున్నాయన్నారు. ఎలాంటి సమస్యలు, ఆటంకాలు ఇప్పటివరకూ రాలేదనీ, ఈ ఎండాకాలంలో దళాలు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. కానీ దళాల ఆత్మవిశ్వాసం మెండుగా ఉందన్నారు. తీవ్రమైన ఎండలతో వడదెబ్బకు గురైనందువల్ల కొంతమంది జవాన్లను ఇక్కడి నుండి ఆసుపత్రికి తరలించామన్నారు. గత ఏడాది జనవరి నెల నుండి ఇప్పటివరకూ భద్రతా దళాలు దాదాపు 350 మందికంటే ఎక్కువమంది నక్సలైట్లను గాలింపు చర్యల్లో కాల్చి చంపారు. వీరిలో ఎక్కువమందిని బస్తర్ రీజియన్‌లో కాల్చి చంపారు. మార్చి 29న బస్తర్ రీజియన్‌లో జరిగిన రెండు ఎన్‌కౌంటర్లలో మొత్తం 18 మంది మృతుల్లో 11 మంది మహిళలు ఉన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకూ జరిగిన వేరు వేరు కాల్పుల ఘటనలలో 144 మంది నక్సలైట్లను కాల్చి చంపారు. వీరిలో 128 మందిని ఏడుజిల్లాలలో విస్తరించి ఉన్న బస్తర్ ప్రాంతం నుండి నిర్మూలించారు.

## సిఎంలకు అమిత్ షా ఫోన్


(మొదటి పేజీ తరువాయి)

సేవలను తక్షణమే నిలిపివేస్తున్నట్లు భారతదేశం ప్రకటించింది. దీనితో పాటు, సార్క్ వీసా మినహాయింపు పథకం (ఎస్‌విఇఎస్) కింద పాకిస్తాన్ జాతీయులు భారతదేశానికి ప్రయాణించడానికి అనుమతించబడరని, ప్రస్తుతం ఎస్‌విఇఎస్ వీసా కింద భారతదేశంలో ఉన్న ఏ పాకిస్తానీ జాతీయుడైనా దేశం విడిచి వెళ్లడానికి 48 గంటల సమయం ఉందని ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. అయితే ఆ గడువు శుక్రవారంతో ముగిసింది. ఇదిలా ఉండగా, భారతదేశం పాకిస్తాన్‌పై దౌత్యపరమైన దాడిని ముమ్మరం చేయడంతో, పహల్గామ్ మారణహోమంలో పాల్గొన్న ప్రతి ఉగ్రవాదిని, వారి మద్దతుదారులను గుర్తించి, ట్రాక్ చేసి, శిక్షిస్తామని, హంతకులను భూమిపై ఏ మూలనా ఉన్నా వెంబడిస్తామని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గురువారం ఉద్ఘాటించారు. పహల్గామ్ ఉగ్రదాడి తరువాత గురువారం నాడు బిహార్‌లోని మధుబనిలో తొలిసారి ప్రధాని మోదీ స్పందించారు. ఉగ్రవాదం శిక్షించబడకుండా ఉండదని, న్యాయం జరిగేలా చూసుకోవడానికి అన్ని ప్రయత్నాలు చేస్తామని మోడీ ప్రతిజ్ఞ చేశారు. భారత్ స్ఫూర్తిని ఉగ్రవాదం ఎప్పటికీ విచ్ఛిన్నం చేయదన్నారు. అదే విధంగా ఢిల్లీలో నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో పార్టీలకతీతంగా నేతలంతా ఉగ్రవాదం, ఉగ్రవాద శిబిరాలపై నిర్ణయాత్మక చర్య తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి వారి పూర్తి మద్దతును హామీ ఇచ్చారు. అదే సమయంలో, 1960 నాటి సింధు జలాల ఒప్పందాన్ని తక్షణమే నిలిపివేయాలనే తన నిర్ణయాన్ని భారతదేశం పాకిస్తాన్‌కు తెలియజేసింది, పాకిస్తాన్ తన షరతులను ఉల్లంఘించిందని పేర్కొంది. జమ్ముకశ్మీర్‌ను లక్ష్యంగా చేసుకుని పాకిస్తాన్ చేస్తున్న సీమాంతర ఉగ్రవాదం సింధు జలాల ఒప్పందం కింద భారతదేశ హక్కులకు ఆటంకం కలిగిస్తుందని జల వనరుల కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ పాకిస్తాన్ జలవనరుల కార్యదర్శి సయ్యద్ అలీ ముర్తజాకు రాసిన లేఖలో తెలిపారు.

## రేవంత్‌కు మినహాయింపు



**హైదరాబాద్ :** హైదరాబాద్ నాంపల్లి ప్రత్యేక కోర్టులో బిజెపి పెట్టిన కేసు విచారణకు సిఎం రేవంత్‌రెడ్డికి హాజరు నుంచి హైకోర్టు శుక్రవారం మినహాయింపు ఇచ్చింది. పార్లమెంట్ ఎన్నికలప్పుడు కొత్తగూడెంలో గత ఏడాది మేలో నిర్వహించిన జన జాతర సభలో బిజెపి అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్‌లను రద్దు చేస్తుందని రేవంత్ ఆరోపించారు. ఇది తమ పార్టీ పరువు దెబ్బతీసేలా ఉందని బిజెపి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు నాంపల్లి ప్రత్యేక కోర్టులో ప్రైవేటు ఫిర్యాదు చేశారు. ఈ కేసును డిస్మిస్ చేయాలంటూ సిఎం రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మ ణ్ శుక్రవారం విచారించారు. కౌంటరు దాఖలు చేయాలని వెంకటేశ్వర్లు, పోలీసులను ఆదేశించారు. విచారణను జూన్ 13కు వాయిదా వేశారు.



Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com